కలం నిఘా
WWW.KALAMNIGHA.COM
తెలుగు దినపత్రిక
హైదరాబాద్ బుధవారం 16 ఏప్రిల్ 2025
సంపుటి: 15, సంచిక: 9, పేజీలు 8, వెల: 4.00
Published from : Hyderabad, Karimnagar, Nizamabad, Warangal, Vijayawada, Tirupati, Kurnool, Visakhapatnam

## ట్రంప్ దూకుడుకు చైనా కళ్లెం

కీలక ఖనిజాల ఎగుమతులు నిలిపివేత
టెక్నాలజీ, ఎలక్ట్రానిక్ పరికరాలకు ముడిసరుకు దెబ్బ



2



లిక్కర్ కేసులో విజయసాయికి
## సిట్ నోటీసులు

2

## మళ్లీ గెలవాలంటే...
# ప్రజల్లో ఉండాలి

### మంత్రివర్గ విస్తరణలో అధిష్టానం నిర్ణయమే ఫైనల్



పార్టీ గీత దాటితే చర్యలు తప్పవని ఎమ్మెల్యేలకు రేవంత్ వార్నింగ్
పార్టీకి వ్యతిరేకంగా మాట్లాడితే లాభం కంటే నష్టమే ఎక్కువ
ఎమ్మెల్యేలు వీక్ ఎండ్‌లో నియోజకవర్గాలకు వెళ్లడం సరికాదు
ప్రతిపక్షాల విష ప్రచారాలను తిప్పి కొట్టడంలో నిర్లక్ష్యం
సోషల్ మీడియాలో చురుకైన పాత్ర పోషించాలి
త్వరలో గ్రామాల పర్యటనకు శ్రీకారం.. పార్టీ ఎమ్మెల్యేలకు సీఎం రేవంత్ సూచన

**హైదరాబాద్ ఏప్రిల్ 15(నిఘా న్యూస్):** రాష్ట్రంలో మంత్రివర్గ విస్తరణ నేపథ్యంలో కాంగ్రెస్ ఎమ్మెల్యేలు చేస్తున్న వ్యాఖ్యలు దుమారం రేపుతున్న వేళ ఎమ్మెల్యేలకు సీఎం రేవంత్ రెడ్డి సున్నితంగా హెచ్చరిక చేశారు. ఎవ్వరు కూడా పార్టీ ల్యైన్ దాటి మాట్లాడవద్దని అన్నారు. మంత్రివర్గ విస్తరణ అన్నది అదిష్టానం నిర్ణయమని కూడా స్పష్టం చేశారు. శంషాబాద్ నోవాటెల్ హోటల్‌లో జరిగిన కాంగ్రెస్ శాసనభాపక్ష సమావేశంలో సీఎం రేవంత్ మాట్లాడారు. తనకు మంత్రి పదవి రాకుండా జానా రెడ్డి అడ్డుకుంటున్నారని కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి రచ్చ చేస్తే.. పదేళ్లు పార్టీని కాపాడుకున్న మమ్మల్ని కాదని, వేరే పార్టీలు తిరిగొచ్చిన వారికి పదవులు ఇస్తారా అని ప్రేమ్‌సాగర్ రావు పరోక్షంగా ప్రభుత్వానికే వార్నింగ్ ఇచ్చారు. ఇలా ఒక్కొక్కరుగా కాంగ్రెస్ ఎమ్మెల్యే బహిరంగంగా అసంతృప్తి వ్యక్తం చేస్తుండటంపై సీఎం రేవంత్ రెడ్డి అసహనం వ్యక్తం చేశారు. ఇష్టమొచ్చినట్లు మాట్లాడితే సహించేది లేదంటూ కాంగ్రెస్ ఎమ్మెల్యేలకు హెచ్చరికలు చేశారు. మంత్రి పదవులను అధిష్ఠానం చూసుకుంటుందని తెలిపారు. పార్టీ గీత దాటితే ఊరుకునేది లేదని ఎమ్మెల్యేలను హెచ్చరించారు. పార్టీకి ఇబ్బంది కలిగిస్తే నేతలే ఇబ్బందులు ఎదుర్కొంటారని అన్నారు. పార్టీకి వ్యతిరేకంగా మాట్లాడితే లాభం కంటే నష్టమే ఎక్కువ అని చెప్పారు. మంత్రివర్గ విస్తరణపై అధిష్ఠానందే తుది నిర్ణయమని స్పష్టం చేశారు. మంత్రివర్గ విస్తరణపై ఎవరేం మాట్లాడినా ఉపయోగం లేదని అన్నారు. మీరు మాట్లాడేదంతా రికార్డవుతుందని హెచ్చరించారు. అలాగే కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ఎవరూ సోషల్‌మీడియా వాడటం లేదని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. ప్రభుత్వంపై నెగిటివ్ ప్రచారం ..మిగతా 2లో



## తెలంగాణలోనూ
# ఎన్‌డీఏ కూటమి

### భూముల అమ్మకంలో బీఆర్ఎస్‌తో పోటీ
### అప్పులు, భూముల అమ్మకంతో నడుస్తున్న ప్రభుత్వం
### పార్టీ జాతీయ అధ్యక్షుడి రేసులో లేను
### మీడియాతో కేంద్రమంత్రి కిషన్ రెడ్డి

**హైదరాబాద్ ఏప్రిల్ 15(నిఘా న్యూస్)** తెలంగాణలో భూములు, మద్యం విక్రయాలు, అప్పులతో ప్రభుత్వాన్ని నడుపుతున్నారని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి విమర్శించారు. భూముల అమ్మకంలో భారాసతో కాంగ్రెస్ పోటీ-పడుతోందన్నారు. హెచ్‌సీయూ అంశంలో తనపై కేసు పెడితే ఎదుర్కొనేందుకు సిద్ధమని తెలిపారు. అర్ధరాత్రి ఫ్లడ్ ల్యైట్లు పెట్టి చెట్లను నరికిన ప్రభుత్వాలను చూశామా అని ప్రశ్నించారు. హైదరాబాద్‌లో మీడియాతో కిషన్‌రెడ్డి మాట్లాడుతూ భాజపా రాష్ట్ర అధ్యక్షుడి ఎన్నికకు తొందరేమీ లేదని కిషన్‌రెడ్డి అన్నారు. ఎన్నికకు మరో వారం రోజుల సమయం పట్టే అవకాశముందని తెలిపారు. పార్టీ జాతీయ అధ్యక్షుడి ప్రతిపాదనల్లో తన పేరు లేదని కిషన్‌రెడ్డి స్పష్టం చేశారు. తమిళనాడులో ఎన్డీఏను పునరుద్ధరించామని.. తెలంగాణలోనూ అధికారంలోకి రావాలని కోరుకుంటున్నామన్నారు. ఎమ్మెల్యే రాజాసింగ్ తమ పార్టీ నేత అని ఆయన అంశంపై అంతర్గతంగా చర్చించుకుంటామని తెలిపారు. మీడియాతో జరిగిన చిట్‌చాట్ సందర్భంగా పలు కీలక అంశాలపై స్పందించారు. తనను జాతీయ అధ్యక్షుడిగా నియమించనున్నట్టు వస్తున్న ప్రచారాలను ఖండిస్తూ.. ఇప్పటి వరకు దక్షిణాదిలో కేవలం ..మిగతా 2లో

## ఎస్సీ వర్గీకరణకు...
# ఏపీ కేబినెట్ ఆమోదం



### విశాఖలో ఐటీ విస్తరణకు పెద్దపీట
### 617 కోట్లతో అసెంబ్లీ నిర్మాణం
### 786 కోట్లతో హైకోర్టు భవన నిర్మాణం
### నిర్మాణ పనులను ఎల్1 బిడ్డర్‌కు అప్పగింత
### టిసిఎస్‌కు 21.66 ఎకరాల కేటాయింపు
### 30 మెగావాట్ల సామర్థంతో 2 హైడల్ ప్రాజెక్టుల నిర్మాణం
### ఏపీ కేబినెట్ కీలక నిర్ణయాలు

**అమరావతి ఏప్రిల్ 15(నిఘా న్యూస్):** ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన నిర్వహించిన ఏపీ కేబినెట్ సమావేశంలో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ఎస్సీ వర్గీకరణ ముసాయిదా ఆర్డినెన్స్‌కు రాష్ట్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. పట్టణ ప్రాంతాల్లో వరద నిర్వహణకు ప్రత్యేక వ్యవస్థలను ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. విశాఖలోని ఐటీ-హిల్ - 3 పైన టీసీఎస్‌కి 21.66 ఎకరాలు, ఉరుస క్లస్టర్స్ ప్రైవేట్ లిమిటెడ్‌కి 3.5 ఎకరాలు కేటాయిస్తూ కేబినెట్ నిర్ణయం తీసుకుంది. ఉరుస క్లస్టర్‌కు కాపులుప్పాడలో 56 ఎకరాల భూమిని కేటాయింపునకు అంగీకరించింది. బలిమెల, జోలాపుట్ రిజర్వాయర్ల వద్ద చేపట్టాల్సిన హైడల్ ప్రాజెక్టులకు సంబంధించిన నిర్మాణాలపై ఒడిశా పవర్ కన్సార్టియమ్‌కు కూడా రాష్ట్ర కేబినెట్ ఆమోదం తెలిపింది. 30 ..మిగతా 2లో



2

నేషనల్ హెరాల్డ్ కేసులో...
## సోనియా, రాహుల్‌పై ఈడీ ఛార్జ్‌షీట్

## మే 2న రానున్న ప్రధాని

### అమరావతి పునర్నిర్మాణ పనులు ప్రారంభం
### మంత్రుల పనితీరు మార్చుకోవాల్సిందే
### కేబినెట్ భేటీ తరవాత మంత్రులతో చంద్రబాబు



**అమరావతి ఏప్రిల్ 15(నిఘా న్యూస్):** ఆంధ్రప్రదేశ్‌లో కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత అమరావతి పునఃనిర్మాణంపై పరత్యేక దృష్టిసారించింది. ఇప్పటికే పలు రకాల పనులకు సీఆర్డీఏ అథారిటీ, ఏపీ కేబినెట్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చేశాయి. అయితే, గతంలో అమరావతి శంకుస్థాపన కార్యక్రమానికి హాజరైన ప్రధాని నరేంద్ర మోడీ ఇప్పుడు, అమరావతి పునఃనిర్మాణానికి కూడా రాబోతున్నారు. మే 2వ తేదీన అమరావతిలో ప్రధాని నరేంద్రమోడీ పర్యటన కొనసాగనుంది. అమరావతి పునర్నిర్మాణ పనుల్లో భాగంగా మోడీ పర్యటన ఉంటుందని సీఎం చంద్రబాబు నాయుడు మంత్రులకు తెలిపారు. మూడేళ్లలో శాశ్వత సచివాలయం, అసెంబ్లీ, హైకోర్టు, రహదారులు పూర్తి చేయడమే లక్ష్యంగా పెట్టుకున్నట్టు వివరించారు ఇంఛార్జ్ మంత్రుల పర్యటనల్లో మూడు పార్టీల నేతల భాగస్వామ్యం ఉండాలని ..మిగతా 2లో

## హైదరాబాద్‌లో...
# 56 శాతం వృద్ధిరేటు



### ట్రిలియన్ డాలర్ల ఎకానమీ దిశగా తెలంగాణ
### ప్రభుత్వ ప్రైవేటు- భాగస్వామ్యంతో ఆర్థిక వ్యవస్థ పురోగతి
### సిటిజన్‌గ్లోబల్ కేపబిలిటీ సెంటర్ ప్రారంభోత్సవంలో శ్రీధర్ బాబు

**హైదరాబాద్ ఏప్రిల్ 15(నిఘా న్యూస్):** గ్లోబల్ బిజినెస్ హబ్‌గా హైదరాబాద్ మారిందని మంత్రి శ్రీధర్‌బాబు అన్నారు. ఇక్కడ కమర్షియల్ స్పేస్‌కు డిమాండ్ బాగా పెరిగిందని చెప్పారు. అమెరికాకు చెందిన సిటిజన్స్ ఫైనాన్షియల్ గ్రూప్, కాగ్నిజెంట్ టెక్నాలజీస్ ఆధ్వర్యంలో సిటిజన్స్ గ్లోబల్ కేపబిలిటీ సెంటర్‌ను ..మిగతా 2లో



# నేనూ ఒక రౌడీనే

### కేసీఆర్ అంత మంచి దాన్ని అయితే కాదు
### పింక్‌బుక్‌లో బెదిరింపు నేతల పేర్లు
### రజతోత్సవ సభకు రాకుండా బెదిరింపులు
### వేధించే నాయకులు, అధికారులను వదలబోము
### సన్నాహక సమావేశంలో ఎమ్మెల్సీ కవిత

2

పోలవరానికి నేడు
## కేంద్ర బృందం రాక

డయాఫ్రమ్ వాల్ నాణ్యతను పరిశీలించనున్న నిపుణులు



2

## నిజాలు రాస్తే చంపుతామని
# విలేఖరికి బెదిరింపులు

### లోకేశ్వరంలో కల్తీకల్లు మాఫియా ఆగడాలు
### నేడు పోలీసులకు ఫిర్యాదు



**లోకేశ్వరం ఏప్రిల్ 15 (నిఘా న్యూస్):** కల్తీ కల్లు ఆరోగ్యానికి చిల్లు అనే శీర్షికన ప్రచురించిన వార్త కథనానికి సంబంధిత అధికారులేమో గాని ఆ వార్తను చుసిన ఓ కల్తీ కల్లు వ్యాపారి మాత్రం స్పందించాడు. నిన్ను ఏ రోజైనా నేనే చంపేస్తా" ..మిగతా 2లో



## పోలవరానికి నేడు కేంద్ర బృందం రాక

### డయాఫ్రమ్ వాల్ నాణ్యతను పరిశీలించనున్న నిపుణులు

**ఏలూరు ఏప్రిల్ 15(నిఘా న్యూస్):** నేటినుంచి పోలవరంలో కేంద్ర నిపుణుల బృందం పర్యటించనుంది. గ్యాప్-1, గ్యాప్-2 ప్రాంతాల్లో నిర్మిస్తున్న డయాఫ్రమ్ వాల్ పనుల నాణ్యత ఈ బృందం పరిశీలించనుంది. అల్లూరి జిల్లా దండంగి గ్రామం వద్ద స్పిల్‌వే సమీపంలో ఉంచిన మట్టి నిల్వల నుంచి శాంపిల్స్ సైతం సేకరించనున్నారు. ఈ బృందంలో కేంద్ర మెటీరియల్ అండ్ సాయిల్ రిసెర్చ్ సెంటర్ నిపుణులు బి.సిద్ధార్థ్ హెడావో, సైంటిస్టు, ఏఆర్వో విపుల్ కుమార్ గుప్తాలు ఉన్నారు. త్వరలోనే మరోసారి ప్రాజెక్టు ప్రాంతంలో విదేశీ నిపుణుల బృందం కూడ పర్యటనకు రానుంది. అయితే, పోలవరం పనుల్లో ఎలాంటి జాప్యం లేకుండా వేగవంతంగా నిర్మాణాలు పూర్తి చేసేందుకు ఏపీ ప్రభుత్వం అడుగులు వేస్తోంది. ఇప్పటికే కొత్తగా నిర్మిస్తున్న డయాఫ్రం వాల్ నిర్మాణ పనులను కాంట్రాక్టు సంస్థలు వేగవంతం చేశాయి. గ్యాప్-1, గ్యాప్-2 ప్రాంతాల్లో నిర్మిస్తున్న డయాఫ్రమ్ వాల్ నిర్మాణంలో తీసుకుంటున్న జాగ్రత్తలను కేంద్ర నిపుణుల బృందానికి వివరించనున్నారు. తన హాయంలోనే ఈ పోలవరం ప్రాజెక్టును పూర్తి చేయాలని సీఎం చంద్రబాబు నిర్ణయించుకున్నారు. అందులో భాగంగానే ప్రాజెక్టు పనులు శరవేగంగా కొనసాగుతున్నాయి.

## లిక్కర్ కేసులో విజయసాయికి సిట్ నోటీసులు

**అమరావతి ఏప్రిల్ 15(నిఘా న్యూస్):** వైసీపీ హయాంలో జరిగిన లిక్కర్ స్కామ్ కేసులో కీలక పరిణామం చోటు చేసుకుంది. మాజీ ఎంపీ విజయసాయిరెడ్డికి సిట్ అధికారులు నోటీసులు జారీ చేశారు. ఈనెల 18వ తేదీన విచారణకు రావాలని నోటీసుల్లో పేర్కొన్నారు. విజయవాడ సీపీ కార్యాలయంలో విచారణకు హాజరు కావాలని ఆదేశించారు. గతంలో లిక్కర్ స్కామ్ కేసుపై సాయిరెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. ఈ మేరకు సాక్షిగా వాంగ్మూలం ఇచ్చేందుకు రావాలంటూ సిట్ అధికారులు నోటీసుల్లో పేర్కొన్నారు. ఇదిలా ఉండగా మద్యం కుంభకోణంలో కీలక పాత్ర పోషించిన వైఎస్ జగన్ మోహన్ రెడ్డి బంధువు, వైసీపీ ప్రభుత్వ ఐటీ సలహాదారు రాజ్ కసిరెడ్డి కోసం పోలీసులు, సిట్ అధికారులు గాలింపు చర్యలు ముమ్మరం చేశారు. విచారణకు హాజకావాలని హైకోర్టు చెప్పినా, ఆదేశాలను లెక్కచేయకుండా కసిరెడ్డి తప్పించుకుని తిరుగుతున్నాడు. ఈ మేరకు హైదరాబాద్‌లో సోమవారం నాడు ఏకకాలంలో 15 చోట్ల సిట్ అధికారులు సోదాలు నిర్వహించారు. రాయదుర్గం, ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌లో ఉన్న కసిరెడ్డి ఇళ్లు, కార్యాలయాల్లో తనిఖీలు చేశారు. అలాగే అతని బంధువులు, స్నేహితులు, ఆత్మీయుల ఇళ్లలోనూ సోదాలు చేశారు. ఏక్తా హైట్స్, కసిరెడ్డి భార్య డైరెక్టర్‌గా ఉన్న అరేటి ఆస్పత్రి, అలాగే అతని అత్త ఇంట్లోనూ దాడులు నిర్వహించారు. మద్యం కుంభకోణంలో ప్రతి నెలా రూ.60 కోట్ల చొప్పున ఐదేళ్లపాటు దాదాపు రూ.3 వేల కోట్లు వసూలు చేయడంలో కసిరెడ్డి ప్రధాన ప్రాతధారిగా ఉన్నట్లు అధికారులు గుర్తించారు. ఈ మేరకు విచారణ హాజరుకావాలని కోరగా ఇటీవల హైకోర్టును ఆశ్రయించారు. అక్కడ చుక్కెదురు కావడంతో తప్పించుకుని తిరుగుతున్నాడు. మరోవైపు అతను దేశం విడిచి పారిపోకుండా అధికారులు లుక్ అవుట్ నోటీసులు సైతం జారీ చేశారు.

## నిజాలు రాస్తే చంపుతామని విలేఖరికి బెదిరింపులు

మొదటి పేజీ తరువాయి...

అంటూ ఏకంగా ఫోన్ లు చేసి బెదిరింపులకి పాల్పడుతు న్నాడు. ఇటీవల కామారెడ్డి జిల్లాలో కల్తీ కల్లు సృష్టించిన కల్లోలం రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం రేపింది. అదే కోణంలో నిబద్ధత గల రిపోర్టర్ గా కల్తీ కల్లును ఏరులుగా పారిస్తున్న అంశాన్ని కళ్ళకు కట్టినట్టు రాస్తే ఆ వార్త చూసి స్పందించి వృత్తి ధర్మంగా మేం ఉన్నాం అనేలా వ్యవహరించాల్సిన అధికారులు అటు ఎక్సైజ్ పోలీసులు స్పందించకపోగా కల్తీ కల్లు ను విక్రయిస్తున్న లోకేశ్వరం మండలం రాజురా గ్రామానికి చెందిన ముత్తాగౌడ్ అనే వ్యక్తి మాత్రం న్యూస్ రాసిన రిపోర్టర్ కి ఫోన్ చేసి చంపేస్తా అని అనడంలో ఉన్న మాటలకి ఆంతర్యం ఏంటో జనాలు అర్థం చేసుకోవాలి. రిపోర్టర్ కి డైరెక్ట్ గా బెదిరింపులకి పాల్పడుతున్నాడు అంటే ఆయన వెనక ఎవరున్నారు. ఇంత ధైర్యంగా దాడులకు పాల్పడం, చంపేస్తామని బెదిరించడం అంటే ఆయనకి ఎవరు సపోర్ట్ గా నిలుస్తున్నారో ఆధారాలున్నాయి. ఇన్ని గ్రామాలలో కల్తీ కల్లు వార్త రాస్తే ఈ ఒక్క వ్యక్తి ఎందుకింత ఉలిక్కిపడడం ఎందుకో ఎక్సైజ్ అధికారులు, ఇటు పోలీసులు ఆలోచించాలి. నిజాన్ని జనాల్లోకి తీసుకెళ్లే ప్రయత్నం చేస్తే చంపేస్తారా..!? ఇదెక్కడి సంస్కృతి. ఇలా అయితే మరీ ఇప్పుడు పని చేస్తున్నవారంతా లోకేశ్వరం (మండల రిపోర్టర్లు) ఆయన కాలికింది చెప్పు అని అంత ధైర్యంగా అన్నాడు అంటే నిజంగానే రిపోర్టర్లు నిజాన్ని రాయడం మానేశారనేగా అర్థం.మరి ఆయన కాలికింది చెప్పులా ఉన్న రిపోర్టర్లు ఎంత మందో నిఘా పేపర్ కి తెలియదు, కానీ అందరిలో కొందరైనా నిఖార్సైన విలేకరులు లేకపోతారా అని నిఘా పత్రిక నమ్ముతోంది.

## మే 2న రానున్న ప్రధాని

మొదటి పేజీ తరువాయి...

స్పష్టం చేశారు. సీఎం చంద్రబాబు నాయుడు, రెవెన్యూ సంబంధిత అంశాలను త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు. రెవెన్యూ సమస్యల్లో పోలీసుల జోక్యం అంశాలను పరిష్కరించాలన్న సీఎం. సూర్యఘర్ పథకం అమలు మరింత వేగం పెంచాలని దిశానిర్దేశం చేశారు. వచ్చే నెల 2వ తేదీన ఏపీకి ప్రధాని నరేంద్ర మోడీ వస్తారని ఈ సందర్భంగా మంత్రులకు వివరించారు .ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు. కాగా, కేబినెట్ భేటీ ముగిసిన తర్వాత మంత్రులతో ప్రత్యేకంగా సమావేశం అయ్యారు. కొన్ని విషయాల్లో ఎన్నిసార్లు చెప్పినా మార్పు రాదా? అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. తిరుపతిలో గోవుల మృతిపై వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అసత్య ప్రచారాన్ని తిప్పి కొట్టడంలో మంత్రులు వైఫల్యం చెందారని మండిపడ్డారు. దేశంలో ఎక్కడా అమలు చేయలేని సంక్షేమ కార్యక్రమాలు మనం అమలు చేస్తుంటే. ప్రజల్లోకి తీసుకెళ్లడంలో మంత్రులు విఫలం అవుతున్నారని దుయ్యబట్టారు. జిల్లాలు యూనిట్‌గా తీసుకొని పార్టీ, ప్రభుత్వం, మంత్రులు సమన్వయంతో అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి బలంగా తీసుకుని వెళ్లాలన్నారు. అంతేకాదు ఎన్నిసార్లు చెప్పినా మంత్రుల తీరిలో మార్పు రావడం లేదంటూ అసహనం వ్యక్తం చేశారు. వ్యక్తిగత కార్యదర్శులు, వోఎస్‌డీలు చేస్తున్న తప్పులు ప్రభుత్వంపై పడుతున్నాయి. వాటిని సరిదిద్దుకోవాలని హెచ్చరించిన సీఎం చంద్రబాబు.

# ఎస్సీ వర్గీకరణకు ఏపీ కేబినెట్ ఆమోదం

మొదటి పేజీ తరువాయి...



మెగావాట్ల సామర్థ్యంతో 2 హైడల్ ప్రాజెక్టుల నిర్మాణం కోసం జలవనరుల శాఖ చేసిన ప్రతిపాదనలను కేబినెట్ ఆమోదం ఇచ్చింది. వివిధ ప్రాంతాల్లో పవన విద్యుత్, సౌర విద్యుత్ ప్లాంట్ల ఏర్పాటుకు కేబినెట్ ఆమోదం ఇచ్చింది. సచివాలయంలో జరిగిన భేటీలో రాష్ట్ర అభివృద్ధికి సంబంధించిన పలు కీలక అంశాలను మంత్రిమండలి చర్చించి ఆమోదించింది. ఎస్సీ వర్గీకరణ , సీఆర్డీఏ, అసెంబ్లీ, హైకోర్టు నూతన భవనాలు వంటి 24 ప్రధాన అంశాలే అజెండాగా క్యాబినెట్ చర్చలు జరిపింది. ఈ సందర్భంగా పలు అంశాలకు సంబంధించి మంత్రిమండలి ఆమోదం తెలిపింది. జాతీయ ఎస్సీ కమిషన్ నుంచి వచ్చిన ఎస్సీ వర్గీకరణ నివేదికపై మంత్రివర్గంలో పూర్తిస్థాయి చర్చ జరిగింది. ఎస్సీ వర్గీకరణకు సంబంధించి రాజీవ్ రంజన్ మిశ్రా కమిషన్‌ను చంద్రబాబు సర్కార్ నియమించిన సంగతి తెలిసిందే. ఆయన ఇచ్చిన నివేదికను ఏపీ శాసనసభలో ఆమోదించి జాతీయ ఎస్సీ కమిషన్‌కు పంపించారు. దాన్ని పరిశీలించిన జాతీయ ఎస్సీ కమిషన్ తిరిగి ఏపీ ప్రభుత్వానికి నివేదించింది. దీనిపై చర్చించిన మంత్రులు ఎస్సీ వర్గీకరణపై ఆర్డినెన్స్ జారీ చేసేందుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. అలాగే సీఆర్డీఏ 46వ అథారిటీ-నిర్ణయాలకు సైతం మంత్రివర్గం ఆమోదం తెలిపింది. మరోవైపు ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ, హైకోర్టు శాశ్వత భవనాల టెండర్ల అంశాలపైనా మంత్రులు పూర్తిస్థాయిలో చర్చించి ఆమోదం తెలిపారు. ఎల్ వన్‌గా నిలిచిన సంస్థలకు లెటర్ ఆఫ్ యాక్సెప్టెన్స్ ఇచ్చేందుకు క్యాబినెట్ అంగీకరించింది. అలాగే రూ.30,667 కోట్ల పెట్టుబడులతో 16 సంస్థల ఏర్పాటుకు ఇటీవల పెట్టుబడుల ప్రోత్సాహక మండలి5వ సమావేశంలో నిర్ణయించారు. వీటి ద్వారా 32,133 మందికి ఉద్యోగాలు వస్తాయని అంచనా వేస్తున్నారు. కాగా, ఈ పనులకు కూడా ఏపీ క్యాబినెట్ ఆమోదం తెలిపింది. మంత్రివర్గ నిర్ణయాలను నిమ్మల రామానాయుడు మీడియాకు వివరించారు. త్వరలోనే డీఎస్సీ నోటిఫికేషన్ జారీ చేస్తామన్నారు. వచ్చే విద్యా సంవత్సరంలోగా ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేస్తామని స్పష్టం చేశారు. ఈ నెల 26న మత్స్యకార భరోసా సాయం కింద లబ్ధిదారులకు రూ.20వేలు పంపిణీ చేస్తామన్నారు. రాష్ట్రంలో టీసీఎస్ విస్తరణకు భూమి కేటాయించాలని నిర్ణయించాం. ఐటీని విస్తరించేందుకు మంత్రి లోకేశ్ ప్రయత్నిస్తున్నారు. భూగర్భ కేబుల్ వ్యవస్థ ఏర్పాటుకు నిర్ణయం తీసుకున్నాం. గుంటూరులో ఈఎస్ఐ ఆస్పత్రికి ఉచితంగా భూమి ఇవ్వాలని నిర్ణయించాం. గ్రేహౌండ్స్ విభాగానికి కొత్తవలసలో భూమి కేటాయిస్తాం. రాష్ట్ర వ్యాప్తంగా మంచి రోడ్లు వేసేందుకు చర్యలు తీసుకుంటున్నాం. తెదేపా అధికారంలోకి వచ్చిన తర్వాతే ప్రజలకు సామాజిక న్యాయం జరిగిందని నిమ్మల రామానాయుడు తెలిపారు. సామాజిక న్యాయం కోసం టీడీపీ పని చేసింది.. ఇప్పుడు ఎన్డీయే కూడా కట్టు-బడి ఉందన్న ఆయన.. ఎస్సీ వర్గీకరణ ఆర్డినెన్స్ కు కేబినెట్ ఆమోదం తెలిపింది.. జనాభా ప్రాతిపదికన ఎస్సీ వర్గీకరణ జరిగింది.. ఆర్డినెన్స్ రెండురోజుల్లో వస్తుంది.. ఆ తర్వాత డీఎస్సీ నోటిఫికేషన్ వస్తుందన్నారు.. ఇక, ఎన్డీఏ కూటమి వేట నిషేధ సమయంలో మత్స్యకారుల సాయాన్ని పది వేల నుంచి 20 వేలకు పెంచుతూ కేబినెట్ నిర్ణయం తీసుకుందంటూ మత్స్యకారులకు శుభవార్త చెప్పారు మంత్రి నిమ్మల. ఈ నెల 26వ తేదీన మత్స్యకారులకు రూ.20 వేల చొప్పు సాయాన్ని సీఎం చంద్రబాబు నాయుడు అందిస్తారని తెలిపారు..ఐటీ-సెక్టార్ కి భూములు ఇచ్చే విషయంలో విధానాలు సరళంగా ఉండాలని నిర్ణయం తీసుకున్నాం. రాజధాని పనులు త్వరితగతిన ప్రారంభించేలా కేబినెట్ నిర్ణయం తీసుకుందన్నారు మంత్రి నిమ్మల రామానాయుడు.. రాష్ట్రంలో వైసీపీ కులాలు,మతాలు ప్రాంతాల మధ్య చిచ్చు పెట్టాలని చూస్తోందని మండిపడ్డారు.మాజీ సీఎం వైఎస్ జగన్ సారథ్యంలో మతాల మధ్య చిచ్చు పెట్టే కార్యక్రమం జరుగుతోంది. వక్ఫ్ బిల్ పేరుతో ముస్లిం పాస్టర్ పేరుతో -క్రైస్తవులు, గో మరణాల పేరుతో హిందువులను రెచ్చగొట్టాలని చూస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.రాజ్యసభ లో వక్ఫ్ సవరణ బిల్లుకు అనుకూలంగా ఓటు వేసి,బయటకు వచ్చి డబుల్ స్టాండ్ రాజకీయం చేశారని దుయ్యబట్టారు. డిక్లరేషన్ ఇవ్వడానికి నిరాకరించిన వ్యక్తి టీటీడీపై మాట్లాడతారు. భూమన చరిత్ర ఎవరికి తెలియదు. ఆయన నాస్తికుడు, ఐదేళ్ల వైసీపీ పాలనలో గోవులు చనిపోవడంపై నిన్న టీటీడీ ఈవో వివరించారినట్లు తెలిపారు. మంత్రి నిమ్మల. ఎస్సీ ఉపవర్గీకరణకు కేబినెట్ ఆమోదం తెలిపిందని మంత్రి డోలా బాల వీరాంజనేయ స్వామి తెలిపారు. ఎస్సీ ఉపవర్గీకరణలో 200 పాయింట్ల రోస్టర్ అమలుకు కేబినెట్ నిర్ణయం తీసుకుందని చెప్పారు. విద్య, ఉద్యోగాల్లో రిజర్వేషన్ల ఫలాలు సమానంగా అందేలా చర్యలు తీసుకుంటాం. ఎస్సీ ఉపవర్గీకరణ కింద గ్రూప్-1లో 12 ఉపకులాలకు 1శాతం రిజర్వేషన్ రానుంది. గ్రూప్-2లో 18 ఉపకులాలకు 6.5 శాతం రిజర్వేషన్ అమలు కానుంది. గ్రూప్-3లో 29 ఉపకులాలకు 7.5 శాతం రిజర్వేషన్ వర్తించనుంది. అన్ని జిల్లాల్లో ఈ ఆర్డినెన్స్ అమల్లోకి వస్తుందని తెలిపారు. రాష్ట్రంలో మతకలహాలు సృష్టించాలని కుట్రలు చేస్తున్నారని హోం మంత్రి వంగలపూడి అనిత అన్నారు. శాంతిభద్రతలకు భంగం కలిగించేందుకు అనేక కుయుక్తులు పన్నుతున్నారని ఆరోపించారు. తితిదే ఛైర్మన్‌గా పని చేసిన వ్యక్తి చాలా జాగ్రత్తగా మాట్లాడాలి. తితిదేపై బురద జల్లి ప్రభుత్వానికి చెడ్డపేరు తేవాలని వైకాపా నేత భూమన కరుణాకర్ రెడ్డి ప్రయత్నిస్తున్నారు. తితిదేపై అసత్య ఆరోపణలు చేస్తున్నారని ఈవో శ్యామలరావు కూడా చెప్పారు. పాస్టర్ ప్రవీణ్ అంశంపై కొందరు కుట్రలు పన్ని ఆరోపణలు చేశారు. సీసీటీవీ ఫుటేజీలను బయట%ఎ%పెట్టేసరికి నోళ్లు మూసుకున్నారని అనిత అన్నారు.

# ట్రంప్ దూకుడుకు చైనా కళ్లెం

### కీలక ఖనిజాల ఎగుమతులు నిలిపివేత
### టెక్నాలజీ ఎలక్ట్రానిక్ పరికరాలకు ముడిసరుకు దెబ్బ

**వాషింగ్టన్ ఏప్రిల్ 15(నిఘా న్యూస్)** అమెరికా- చైనాల మధ్య సుంకాల యుద్ధం కొనసాగుతోంది. ఈ క్రమంలో చైనా కూడా ట్రంప్ తీరుకు ఘాటుగా సమాధానం ఇస్తోంది. ఈక్రమంలో అమెరికాకు అవసరమైన పలు వస్తువులపై నిషేధం విధించి, ఎగుమతలను నిలిపివేసింది. చైనా ఉత్పత్తులపై టారిఫ్‌లను యూఎస్ 145 శాతానికి పెంచినట్లు ఇటీవల అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రకటించిన విషయం తెలిసిందే. అందుకు ప్రతిగా చైనా కూడా అమెరికా ఉత్పత్తులపై సుంకాలను 125 శాతానికి పెంచుతున్నట్లు ప్రకటించింది. అంతటితో ఆగకుండా తమ దేశంలో లభ్యమయ్యే అరుదైన ఖనిజాలు, కీలకమైన లోహాలు, అయస్కాంతాలను యూఎస్‌కు ఎగుమతి చేయడాన్ని ఆపేస్తున్నట్లు బీజింగ్ పేర్కొంది. ఈ ప్రకటనపై అమెరికా స్పందించింది. ఖనిజాల ఎగుమతి విషయంలో చైనా తీసుకున్న నిర్ణయం ఆందోళనకరంగా ఉందని ట్రంప్ ముఖ్య ఆర్థిక సలహాదారుల్లో ఒకరైన కెవిన్ హసెట్ పేర్కొన్నారు. టెక్నాలజీ, ఎలక్ట్రానిక్ పరికరాల తయారీ రంగంలో ఈ ఖనిజాల అవసరం ఎక్కువగా ఉందన్నారు. డ్రాగన్ నిర్ణయం వల్ల పశ్చిమదేశాల్లో ఆయుధాలు, ఎలక్ట్రానిక్స్, ఆటోమొబైల్స్, ఏరోస్పేస్ తయారీ, సెమీకండక్టర్ల కంపెనీలకు సమస్యలు ఎదురయ్యే అవకాశం ఉందన్నారు. ఈ అంశాన్ని నిశితంగా పరిశీలిస్తున్నామని వీటిపై డ్రాగన్‌తో చర్చలు జరిపే అవకాశం ఉందని తెలిపారు. అయితే ట్రంప్ విధించిన టారిఫ్‌ల వల్ల 100 శాతం మాంద్యం వస్తుందని తామేమీ అనుకోవట్లేదని అన్నారు. ప్రపంచ వ్యాప్తంగా ఉత్పత్తి అవుతున్న అరుదైన ఖనిజాల్లో దాదాపు 90 శాతం చైనా నుంచే వెళుతున్నాయి. తాజాగా బీజింగ్ చేపట్టిన చర్యల ప్రభావం కేవలం అమెరికా వరకే పరిమితం కాదు. అన్ని దేశాలపైనా ఉండనుంది. తొలుత చైనా ఉత్పత్తులపై టారిఫ్‌లను ట్రంప్ 54శాతం పెంచడంతో కీలక విడిభాగాల ఎగుమతులను చైనా ఆపేసింది. మరోసారి అగ్రరాజ్యం సుంకాలను 145 శాతానికి పెంచడంతో అరుదైన ఖనిజాలు, కీలకమైన లోహాలు, అయస్కాంతాలు, ఇతర ఉత్పత్తులను ఎగుమతి చేయడం బీజింగ్ నిలిపివేసింది. దీంతోపాటు- ఎక్స్‌పోర్ట్ లైసెన్స్‌లను పరిమితం చేసే అవకాశాలు కూడా ఉన్నాయి. అమెరికాలోని లాక్‌హీడ్‌మార్టిన్, -టెస్లా, యాపిల్ వంటి సంస్థలు చాలా ముడిపదార్థాల కోసం బీజింగ్‌పైనే ఆధారపడుతున్నాయి. అమెరికా ప్రభుత్వం వద్ద రేర్‌ఎర్త్ మినరల్స్ నిల్వలు ఇప్పటికే ఉన్నాయి. కానీ, తమ డిఫెన్స్ కాంట్రాక్టర్లకు సరఫరా చేయడానికి మాత్రం ఇవి సరిపోవు. దీంతో అమెరికా ప్రభుత్వం చైనా చర్యలపై ఆందోళన వ్యక్తం చేస్తోంది.

# హైదరాబాద్‌లో 56 శాతం వృద్ధిరేటు

మొదటి పేజీ తరువాయి...

ఏర్పాటు చేశారు. ఈ సెంటర్‌ను మంత్రి ప్రారంభించిన సందర్భంగా శ్రీధర్‌బాబు మాట్లాడారు. ఢిల్లీ, చెన్నైలాంటి మెట్రో నగరాలతో పోలిస్తే హైదరాబాద్‌లో 56 శాతం వృద్ధి రేటు ఉంది. ఈ క్రమంలో తెలంగాణ దేశంలో ట్రిలియన్ డాలర్ల ఎకానమీగా ఎదిగేందుంకు చేస్తున్న ప్రయత్నానికి దోహదపడుతుందని మంత్రి అన్నారు. ప్రస్తుతం బలమైన ప్రభుత్వ ప్రైవేటు భాగస్వామ్యంతో తెలంగాణ ఆర్థిక వ్యవస్థ వేగంగా ముందుకు సాగుతోందని ఆయన వెల్లడిరచారు. గతేడాది రిటైల్ రంగంలో 1.8 మిలియన్ చదరపు అడుగుల స్పేస్‌ను సంస్థలు లీజుకు తీసుకున్నాయి. ఆమ్జెన్, గ్లోబల్ లాజిక్, ఎలీ లిల్లీ, మారియట్, సిగ్నాలాంటి అంతర్జాతీయ సంస్థలు నగరానికి వచ్చాయి. ఏడాది వ్యవధిలో 70కి పైగా గ్లోబల్ కేపబులిటీ సెంటర్‌లు ఏర్పాటయ్యాయి. 2030 నాటికి దేశ జీడీపీలో తెలంగాణ వాటా ట్రిలియన్ డాలర్లకు చేరుకుంటుంది పెట్టుబడులు తీసుకొచ్చి యువతకు ఉద్యోగావకాశాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యం. అభివృద్ధిని అడ్డుకునేందుకు ప్రతిపక్షాలు దుష్ప్రచారం చేస్తున్నాయి. ప్రభుత్వంపై నమ్మకంతో పారిశ్రామిక వేత్తలు ముందుకు వస్తున్నారని శ్రీధర్‌బాబు అన్నారు. అమెరికాకు చెందిన ఫైనాన్షియల్ సేవల దిగ్గజం సిటిజన్ ఫైనాన్షియల్ గ్రూప్ తాజాగా హైదరాబాదులో టెక్ కంపెనీ కాగ్నిజెంట్ తో జతకట్టి తన గ్లోబల్ కెపాసిటీ సెంటర్ ఏర్పాటు చేసింది. ఇది హైదరాబాదులోని కాగ్నిజెంట్ క్యాంపస్ లోపలే ఉంటుందని కంపెనీ పేర్కొంది. వాస్తవానికి ఇదొక ఇన్నోవేషన్ హబ్ మాదిరిగా వర్క్ చేస్తుందని కంపెనీ వెల్లడిరచింది. ఈ జీసీసీ ఏర్పాటు ద్వారా మార్చి 2026 నాటికి కొత్తగా 1000 హై వ్యాల్యూ కలిగిన ఉపాధి అవకాశాలు కల్పించబడతాయని వెల్లడిరచాయి. ఈ సెంటర్ బ్యాంకింగ్ సంస్థలకు రానున్న కాలంలో థర్డ్ పార్టీ సంస్థలపై ఆధారపడటాన్ని తగ్గిస్తుందని జీసీసీ పేర్కొంది. హైదరాబాద్‌లో దాదాపు 57 వేల మంది సిబ్బందిని కలిగి ఉన్న కాగ్నిజెంట్, దాని ప్లాట్‌ఫారమ్‌లైన న్యూరో, ఎ÷%-%లోసోర్స్‌లను ఉపయోగించి సిటిజన్స్ జీసీసీకి అదనపు శక్తిని ఇవ్వనుంది. అలాగే క్లౌడ్, డేటా, సైబర్ సెక్యూరిటీ-, ఇంటెలిజెంట్ ఆటోమేషన్ రంగాల్లో భవిష్యత్తు అవసరాలకు తగిన ఉత్పత్తులను కంపెనీ అందించనుంది. అమెరికా చెందిన సిటిజన్స్ సంస్థ, కాగ్నిజెంట్ చేతులు కలపటంపై తెలంగాణ ఐటీ మంత్రి శ్రీధర్ బాబు హర్షం వ్యక్తం చేశారు. ప్రస్తుతం హైదరాబాద్ బ్యాంకింగ్ అండ్ ఫైనాన్షియల్ రంగంలో ఆవిష్కరణలకు ప్రపంచ ప్రధాన కార్యాలయంగా మారిందని కాగ్నిజెంట్ ప్రతినిధి నాగేశ్వర్ చెరుకుపల్లి అన్నారు. పైగా అనేక జీసీసీల ఏర్పాటుకు హైదరాబాద్ డెస్టినేషన్ గా మారింది. ప్రస్తుతం హైదరాబాదులో అత్యుత్తమ టాలెంట్ పూల్ అందుబాటులో ఉండటమే ప్రపంచ దేశాలకు చెందిన దిగ్గజ కంపెనీలను ఆకట్టుకోవటానికి కారణంగా నిపుణులు చెబుతున్నారు.

## నేనూ ఒక రౌడీనే

**కామారెడ్డి ఏప్రిల్ 15 (నిఘా న్యూస్):** ఎవరెవరు బెదిరిస్తున్నారో వాళ్ల పేర్లను బరాబర్ పింక్ బుక్కులో రాసుకుంటాం బెదిరింపులకు పాల్పడేవారిని ఎట్టిపరిస్థితుల్లో వదిలిపెట్టేదే లేదని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత సంచలన వ్యాఖ్యలు చేశారు. బీఆర్ఎస్ కార్యకర్తలను వేధిస్తున్న కాంగ్రెస్ నాయకులపై ఎమ్మెల్సీ కవిత ఫైర్ అయ్యారు. బాన్సువాడలో బీఆర్ఎస్ రజతోత్సవ సన్నాహక సమావేశంలో కవిత పాల్గొని ప్రసంగించారు. బీఆర్ఎస్ రజతోత్సవ సభకు వెళ్లవద్దని కొంత మంది ఫోన్లు చేసి బెదిరిస్తున్నట్లు తెలిసింది. కేసులు పెట్టించే పోలీస్ స్టేషన్లకు ఈడ్చిన వాళ్లను క్షమించే ప్రసక్తే లేదు. బీఆర్ఎస్ కార్యకర్తలను వేధించే కాంగ్రెస్ నాయకులు, అధికారులు ఎవరైనా ఊరుకునేదే లేదు. కాంగ్రెస్ నాయకుల తాటాకు చప్పుళ్లకు భయపడేదే లేదు. వాళ్ల తాతలు, ముత్తాతలు, జేజమ్మలు ఎవరు దిగొచ్చినా కూడా భయపడే వాళ్లెవరూ లేరు ఇక్కడ అని ఎమ్మెల్సీ కవిత తేల్చిచెప్పారు. మాట తప్పడం మడమ తిప్పడమే కాంగ్రెస్ నైజం. సోనియా గాంధీ, రాహుల్ గాంధీ సంతకాలు పెట్టిన గ్యారెంటీ కార్డులను కాంగ్రెస్ నాయకులు ఇంటింటికి పంచి ఓట్లేయించుకున్నారు. ఇప్పుడు గ్యారెంటీలు అమలు చేయకుండా కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేస్తున్నది. గతంలో తెలంగాణ ఇస్తామని హామీ ఇచ్చి పదేళ్ల పాటు- అరిగోస పెట్టింది కాంగ్రెస్ పార్టీ. వందలాది మంది తెలంగాణ బిడ్డల ఆత్మబలిదానాలకు కారణం కాంగ్రెస్ పార్టీ. ఏడాదిన్నర పాలనలోనే ఇంత వ్యతిరేకత మూటగట్టు కున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి నోబుల్ ప్రైజ్ ఇవ్వాలని కవిత విమర్శించారు. ప్రతీ ఇంటి నుంచి ఒకరు రజతోత్సవ సభకు రావాలి. తెలంగాణ గడ్డ మీద అగ్గిపెట్టించి రాష్ట్రాన్ని సాధించిన చరిత్ర బీఆర్ఎస్ పార్టీది. నలిగిపోయిన ఆత్మగౌరవాన్ని రెపరెపలాడిరచింది బీఆర్ఎస్ పార్టీ. స్వతంత్ర దేశంలో లక్ష్యాన్ని చేరిన ఏకైక పోరాటం కేసీఆర్ నేతృత్వంలోని తెలంగాణ ఉద్యమం మాత్రం. వీరులు మాత్రమే లక్ష్యం చేరే వరకు పోరాటం చేస్తారు... అది కేసీఆర్‌తో మాత్రమే సాధ్యమైంది. ప్రజాస్వామ్య పంథాను నమ్ముకొని హింసాయుతం గా పోరాటం చేసి తెలంగాణ సాధించాము. త్యాగాలతో తెలంగాణ కోసం కేసీఆర్ మొదటి అడుగు వేశారు. కేంద్ర మంత్రి పదవిని సైతం గడ్డిపోచలా వదిలేసిన ఘనత కేసీఆర్‌ది. ఎవరో భిక్షపెడితేనో, ఎవరో దయదలచి ఇస్తే తెలంగాణ రాలేదు. కేసీఆర్ త్యాగం, కృషి, పోరాటపటిమ వల్ల తెలంగాణ సాధ్యమైంది. తెలంగాణ రాష్ట్రం ఏర్పడితే తెలంగాణలో కటిక చీకటి వస్తుంది, నక్సలైట్ల రాజ్యం వస్తుందని అప్పటి సీఎం కిరణ్ కుమార్ రెడ్డి అన్నారు. కానీ తెలంగాణ వచ్చిన తర్వాత వెలుగు జిలుగుల తెలంగాణను తయారు చేసుకున్నాం. కోటి ఎకరాల మాగాణను తయారు చేసుకున్నాం ఎమ్మెల్సీ కవిత పేర్కొన్నారు.

## మళ్లీ గెలవాలంటే ప్రజల్లో ఉండాలి

మొదటి పేజీ తరువాయి...

చేస్తుంటే, ఎమ్మెల్యేలు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. పలువురు ఎమ్మెల్యేలు హైదరాబాద్‌కే పరిమితమవుతున్నారని అన్నారు. వీకెండ్ రాజకీయాలు చేయొద్దని సూచించారు. రేవంత్‌రెడ్డి అధ్యక్షతన కాంగ్రెస్ శాసనసభా పక్షం సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మాట్లాడిన సీఎం. పలువురు ఎమ్మెల్యేలను హెచ్చరించినట్లు తెలుస్తోంది. పార్టీకి ఇబ్బంది కలిగిస్తే నేతలే ఇబ్బందులు ఎదుర్కొంటారు. పార్టీకి వ్యతిరేకంగా మాట్లాడితే లాభం కంటే నష్టమే ఎక్కువ. మంత్రివర్గ విస్తరణపై అధిష్ఠానం నిర్ణయమే ఫైనల్. దీనిపై ఎవరేం మాట్లాడినా ఉపయోగం లేదని సీఎం తేల్చి చెప్పారు. మంత్రి పదవులపై ఒకరికి మించి మరొకరు లీకులు ఇస్తున్నారని అసహనం వ్యక్తం చేసిన సీఎం. ఇష్టం వచ్చినట్లు- మాట్లాడితే మంత్రి పదవులు రావన్నారు. కొత్తగా ఎన్నికైన ఎమ్మెల్యేలు జాగ్రత్తగా పని చేసుకోవాలని సూచించారు. కాగా, మంత్రి వర్గ విస్తరణపై కొందరు ఆశావహులు బహిరంగంగానే తమ అసంతృప్తిని వ్యక్తం చేస్తున్నారు. తనకు మంత్రి పదవి ఇవ్వకుంటే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తానని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి ఏకంగా హుకుం జారీ చేశారు. మరోవైపు మంత్రి పదవి విషయంలో మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు, చెన్నూరు ఎమ్మెల్యే గడ్డం వివేక్ మధ్య మాటల యుద్ధం నడుస్తోంది. ఇలా మంత్రి వర్గ విస్తరణపై ఆశవహులు బహిరంగంగ మాట్లాతుండటంతోనే తాజాగా జరిగిన సీఎల్పీ భేటీలో సీఎం రేవంత్ రెడ్డి వార్నింగ్ ఇచ్చినట్లు తెలిసింది. ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సీఎం రేవంత్‌రెడ్డి పార్టీ నేతలకు దిశా నిర్దేశర చేశారు. ఎమ్మెల్యేలు ప్రతి గ్రామంలో పర్యటించేలా కార్యాచరణ చేపట్టాలన్నారు. రేపటి నుంచి జూన్ 2 వరకు ఎమ్మెల్యేలు గ్రామాల్లో పర్యటించాలి. నేను కూడా మే 1 నుంచి జూన్ 2 వరకు ప్రజలతో మమేకమవుతా. ప్రతిపక్షాల ప్రచారాన్ని నమ్మి, బుల్డోజర్లు పంపిస్తున్నారని ప్రధాని మాట్లాడుతున్నారు. భాజపా, భారాస కలిసి ప్రజా ప్రభుత్వంపై విష ప్రచారం చేస్తున్నాయి. పార్టీ, ప్రభుత్వ ప్రతిష్ఠ పెరిగితేనే భవిష్యత్ ఉంటుంది. మళ్లీ గెలవాలంటే ఇప్పటి నుంచే ప్రజల్లోకి వెళ్లాలి. తెలంగాణ పథకాలతో ప్రధాని మోదీ ఉక్కిరిబిక్కిరవుతున్నారు. తెలంగాణ మోడల్‌పై దేశంలో చర్చ జరుగుతోంది. కాంగ్రెస్‌ను ఇబ్బంది పెట్టాలనే భాజపా, భారాస ఒక్కటయ్యాయి. సన్నబియ్యం మన పథకం మన పేటెంట్, మన బ్రాండ్. భాజపా పాలిత రాష్ట్రాలలో సన్నబియ్యం ఎందుకు ఇవ్వట్లేదో చెప్పాలని రేవంత్‌రెడ్డి ప్రశ్నించారు. ఈ సమావేశంలో మంత్రులు భట్టి విక్రమార్క,పొంగులేటి, శ్రీధర్ బాబు, పొన్నం, పిసిసి చీఫ్ మహేశ్కుమార్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణలోనూ ఎన్‌డిఎ కూటమి

మొదటి పేజీ తరువాయి...

రెండు రాష్ట్రాలకే అధ్యక్షుల నియామకం జరిగిందని, నన్ను జాతీయ అధ్యక్షుడిగా చేయాలన్న ప్రతిపాదన ఎక్కడా లేదని స్పష్టం చేశారు. నియోజకవర్గాల పునర్విభజన అంశం ప్రస్తుతం పార్టీలో కానీ, కేంద్ర ప్రభుత్వంలో కానీ చర్చలో లేదని తెలిపారు. ప్రజల ఆలోచనలు, అభిప్రాయాలను అనుసరించి భవిష్యత్తులో బీజేపీ తగిన నిర్ణయం తీసుకుంటుందని తెలిపారు. అలాగే తెలంగాణ రాష్ట్రంలో భూముల అమ్మకం ద్వారా ప్రభుత్వాన్ని నడపాలనే పద్ధతికి తీవ్రంగా వ్యతిరేకత వ్యక్తం చేశారు. భూములు అమ్మడం, అప్పులు చేయడం, మద్యం అమ్మకాలు ఇవే ఆదాయ సమకూర్చే మార్గాలుగా ఈ ప్రభుత్వం భావిస్తోంది అంటూ ఆరోపించారు. గతంలో బిఆర్ఎస్ ప్రభుత్వం కూడా ఇదే పని చేసింది. ఇప్పుడు కాంగ్రెస్ అదే మార్గాన్ని అనుసరిస్తోందని విమర్శించారు. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ పరిధిలోని చెట్ల కొట్టడంపై ప్రభుత్వాన్ని నిలదీశారు. ఒక్క చెట్టును కొట్టాలన్నా అనుమతి అవసరం. కానీ, ప్రభుత్వం చట్టాలను ఉల్లంఘిస్తూ హెచ్‌సీయు భూముల్లో చెట్లను కూల్చుతోందని విమర్శించారు. అటవీ ప్రాంతంలో జంతువులు ఉన్నాయని, తాను ట్విట్టర్‌లో పెట్టిన పోస్ట్‌కు కట్టుబడి ఉన్నానని స్పష్టం చేశారు. అక్కడ జంతువులు ఉంది అవాస్తవమా అంటూ ప్రశ్నించారు. అలాగే, ఈ భూముల వెనుక మా ఎంపీ ఉంటే ఆ పేరును బయటపెట్టండని, ఎవరు అయినా తప్పు చేస్తే శిక్ష పడాల్సిందే అంటూ ఘాటుగా వ్యాఖ్యానించారు. యూనివర్సిటీ అధికారులు కూడా ఈ భూములు హెచ్‌సీయువే అని స్పష్టంగా చెబుతున్నారని గుర్తు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా మేము పోరాడడం లేదు.. అక్కడ గ్రీనరీ అలానే ఉండాలని మా పోరాటమని అన్నారు. గచ్చిబౌలి భూముల్లో జంతువులు ఉన్న మాట వాస్తవం. నా మీద కేసు పెట్టిన ఎదుర్కోవడానికి నేను సిద్ధం, ఎప్పుడు ఎన్నికలు జరిగిన కాంగ్రెస్ ఘోరంగా ఓడిపోతుందని అన్నారు. వేరే రాష్ట్రం వ్యాపారస్తులు ఇక్కడ ప్రభుత్వాన్ని కూల్చుతారు వారికేమి పని.. వక్ఫ్ చట్టం పై ఆందోళన చేయడం అంటే భూ బకాసురులకు వత్తాసు పలికినట్టే అని వ్యాఖ్యానించారు. ఎంఐఎం కబ్జాదారులను పోగేసి ఆందోళన చేస్తుందని, కాకపోతే పేద ముస్లిములకు మాత్రమే ఆందోళన చేసే హక్కు ఉందని ఆయన అన్నారు. కేంద్ర ప్రభుత్వం చేసిన చట్టం వల్ల ఏమీ నష్టమో చెప్పాలని, ఒక్క రూపాయి కూడా దుర్వినియోగం జరగదని, వక్ఫ్ చట్టం పైన మేము మా మేనిఫెస్టోలో పెట్టే చేశామని తెలిపారు. ఇక్కడ కూడా మైనారిటీ- వర్గాల్లోకి వెళ్లేందుకు ప్రయత్నం చేస్తున్నామని, ఈ నెల 17న సన్నాహక సమావేశం ఉందని తెలిపారు. ముస్లిం ప్రార్థన మందిరాలకు వక్ఫ్ బోర్డు కు సంబంధం లేదని, మజీదుల ద్వారా వచ్చే ఆదాయంతో వక్ఫ్ బోర్డు నడవదన్నారు. ఎన్నికలన్నప్పుడు ఓటర్లందరిని కలుస్తాం. బిఆర్ఎస్, కాంగ్రెస్, ఈ పార్టీ ఆ పార్టీ అని కాకుండా అందరినీ ఓట్లు అడుగుతామని అన్నారు. ఏ పార్టీ అధికారం లోకి వచ్చిన ఆ పార్టీ పక్కన చేరి ఎంఐఎం ప్రాభల్యం పెంచుకుంటు-ందని అన్నారు. ఎంఐఎం చిన్నగా న్యూ సిటీ లోకి వచ్చిందని ఎర్రగడ్డ, బొరబండ లాంటి చోట్ల ఆ పార్టీ కార్పొరేటర్ లు గెలిచారని అన్నారు. భవిష్యత్ లో హైదారాబాద్ ను కబ్జా చేసే ప్రయత్నం ఆ పార్టీ చేస్తుందని కీలక వ్యాఖ్యలు చేసారు. కాంగ్రెస్, బిఆర్ఎస్ లకి బిగ్ బాస్ అసదుద్దీన్ ఒవైసీ అని కామెంట్ చేసారు.

## నేషనల్ హెరాల్డ్ కేసులో... సోనియా, రాహుల్‌పై ఈడీ ఛార్జ్‌షీట్

**న్యూఢిల్లీ ఏప్రిల్ 15(నిఘా న్యూస్):** 'నేషనల్ హెరాల్డ్' మనీలాండరింగ్ కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసులో ఛార్జిషీట్ దాఖలు చేసిన ఈడీ అందులో కాంగ్రెస్ అగ్రనేతలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీ సహా పలువురి పేర్లను పేర్కొంది. ఇప్పటికే ఈ కేసుతో ముడిపడి ఉన్న ఆస్తుల స్వాధీనానికి నోటీసులు జారీ చేసిన ఈడీ అధికారులు తాజాగా కాంగ్రెస్ ఎంపీలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీతో పాటు ఆ పార్టీ నేతలు శామ్ పిట్రోడా, సుమన్ దుబే పేర్లతో ఢిల్లీ రౌస్ అవెన్యూ కోర్టులో ప్రాసిక్యూషన్ కంప్లయింట్ దాఖలు చేశారు. దీనిపై ఏప్రిల్ 25న ఢిల్లీ ప్రత్యేక కోర్టు విచారణ చేపట్టనుంది. మరోవైపు, కాంగ్రెస్ అగ్రనేతలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీపై ఈడీ ఛార్జిషీట్ దాఖలు చేయడం ఇదే తొలిసారి. హరియాణాలో జరిగిన రియల్ ఎస్టేట్ ఒప్పందంతో ముడిపడి ఉన్న మనీలాండరింగ్ ఆరోపణలపై కాంగ్రెస్ ఎంపీ ప్రియాంకా గాంధీ వాద్రా భర్త, వ్యాపారవేత్త రాబర్ట్ వాద్రాను ఈడీ ప్రశ్నించిన కొన్ని గంటల వ్యవధిలోనే ఈ పరిణామం చోటు-చేసుకోవడం గమనార్హం. నేషనల్ హెరాల్డ్ పత్రికకు సంబంధించి మనీ లాండరింగ్ ఆరోపణలతో కాంగ్రెస్ అగ్రనేతలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీని ఈడీ అధికారులు గతంలో పలుమార్లు విచారించిన విషయం తెలిసిందే. విదేశీ నిధులతో నేషనల్ హెరాల్డ్ పత్రికను పెంచి పోషించారన్న ఫిర్యాదుల మేరకు ఈడీ, సీబీఐ దర్యాప్తు చేశాయి. సీబీఐ విచారణ మధ్యలోనే నిలిచినప్పటికీ, ఈడీ దర్యాప్తు మాత్రం కొనసాగుతోంది. ఇటీ-వల ఈ కేసులో 2023, నవంబరులో జప్తు చేసిన అసోసియేటెడ్ జర్నల్స్ లిమిటెడ్ (ఏజేఎల్)కు చెందిన రూ.661 కోట్ల విలువైన ఆస్తుల స్వాధీనానికి చర్యలు ప్రారంభించింది. ఇందులో భాగంగా నోటీసులు జారీ చేసింది. తాజాగా ఢిల్లీ ప్రత్యేక కోర్టులో ఛార్జిషీట్ దాఖలు చేసిన ఈడీ. తదుపరి విచారణను కొనసాగిస్తున్నట్లు తెలిపింది. నేషనల్ హెరాల్డ్ ఆస్తుల్ని స్వాధీనం చేసుకోవడమనేది చట్టబద్ధమైన పాలన ముసుగులో ప్రభుత్వ ప్రాయోజిత నేరంగా కాంగ్రెస్ పేర్కొంది.



తెలుగు జర్నలిస్ట్ ల సంక్షేమ సంఘం ఉగాది పురస్కారాలను అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన జర్నలిస్ట్ లకు అవార్డుల ప్రదానం చేస్తుంది. 2024-25 సంవత్సరానికి గాను ఈ అవార్డుల జాభితాను టి జె ఎస్ ఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మేడవరపు రంగనాయకులు ప్రకటించారు. ఈ సంవత్సరానికి గాను రెండు తెలుగు రాష్ట్రాల్లో అర్హులైన వంద మంది పేర్లను ప్రకటించగా హైదరాబాద్ కు చెందిన జర్నలిస్ట్, సామాజిక కార్యకర్త రాపోలు లింగస్వామిని మనవీయ కోణాన్ని ఆవిష్కరించిన జర్నలిస్ట్ గా ఎంపిక అవ్వడం జరిగింది. విజయవాడలోని తుమ్మలపల్లి కలక్షేత్రంలో మాజీ సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి నూతలపాటి వెంకటరమణ నిర్వాహకులతో కలిసి రాపోలు లింగస్వామితో పాటు పలువురికి పురస్కారం తోపాటు ప్రశంసా పత్రం ఐదు వేల నగదును అందజేశారు.

*-హైదరాబాద్, ఏప్రిల్ 15 (నిఘా న్యూస్)*

## హెచ్ బి కాలనీ వెంకటేశ్వర ఆలయ ట్రస్ట్ ప్రమాణ స్వీకారం



**మౌలాలి, ఏప్రిల్ 15 (నిఘా న్యూస్):** మీర్పేట్ హెచ్ బి కాలనీ శ్రీ వెంకటేశ్వర ఆలయ దేవాదాయ ధర్మాదాయ ట్రస్టీ బోర్డు ఛైర్మన్, ధర్మకర్తలు మంగళవారం ప్రమాణ స్వీకారం చేశారు. ఉప్పల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ పరమేశ్వర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా దేవాదాయ ధర్మాదాయ శాఖ అధికారులు ఛైర్మన్ గా సప్పిడి జ్యోతి, ధర్మకర్తలుగా రాయిని ఉదయ్ కుమార్ గుర్రాల ఎల్లమ్మ అనిల్ కుమార్ నల్లగొండ సమ్మయ్య కూరల మల్లికార్జున్, భానూరి నవీన్ గౌడ్, ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ నేపథ్యంలో ఆలయ ట్రస్టీ బోర్డు ప్రథమ కమిటీ మంగళవారం ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమంలో దేవాలయ ఈవో వెంకట రెడ్డి ఇన్స్పెక్టర్ ప్రణీత్ సీతారామ రెడ్డి బొంతు శ్రీదేవి సింగి రెడ్డి ధన్ పల్ రెడ్డి, అంజి రెడ్డి డివిజన్ అధ్యక్షులు పోలెపాక అంజయ్య, కాశెట్టి ప్రసాద్, సాయి కిరణ్ గౌడ్, భూపాల్ రెడ్డితదితరులు పాల్గొన్నారు.

## మాల మహానాడు గ్రేటర్ అధ్యక్షులుగా డా.మహేందర్



**చిలుకానగర్, ఏప్రిల్ 15 (నిఘా న్యూస్):** చిలకానగర్ మాల సంఘం అధ్యక్షులు మహేందర్ ను జాతీయ మాల మహానాడు గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షులుగా నియమిస్తూ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు పిల్లి సుధాకర్, వర్కింగ్ ప్రెసిడెంట్ చిప్పల నరసింగరావు నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ అల్లిబిల్లి మహేందర్ మాట్లాడుతూ అంబేద్కర్, పూలే, ఆశయాలతో ముందుకెళ్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం సభ్యులు కొంగరి రామచంద్రం, జరుక సుదర్శన్, అల్లూరి తామస్, రాజు, దామోదర్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సంఘం సీనియర్ సభ్యులు షెడ్యూల్ కులాల సేవా సంఘం అధ్యక్షులు కొండ్ర రాములు, పడిగం రాంనర్సయ్య, దేవుళ్ళ పురుషోత్తం పొడిసెట్టి, కృష్ణ ఆంజనేయులు సుందర్, శ్రీనివాస్, రవి, మంచినీళ్ల శ్రీనివాస్ ,కనకరాజు, అనిల్ హరీష్ అభినందనలు తెలిపారు.

## పంట నష్టపోయిన ప్రతి రైతుకు పరిహారం అందించాలి

### బిఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు లక్ష్మీ నరసింహారావు



**ములుగు, ఏప్రిల్ 15 (నిఘా న్యూస్):** జిల్లాలో ఇటీవల కురిసిన భారీ వడగండ్ల వర్షాలకు పంట నష్టపోయిన ప్రతి రైతుకు నష్టపరిహారం అందించాలని ములుగు జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ కు బిఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షులు కాకులమర్రి లక్ష్మీ నరసింహారావు మంగళవారం కార్యకర్తలు, నాయకులు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా లక్ష్మణ్ బాబు మాట్లాడుతూ ములుగు జిల్లాలోని మంగపేట,ఏటూరు నాగారం మండలాల పరిధిలో కురిసిన భారీ వడగండ్ల వర్షానికి, ఈదురు గాలులకు సుమారు మూడు వేల ఎకరాలు వరి పంట కింద పడిపోయి వడ్లు రాలిపోయి నష్టపోయినట్టు జిల్లా కలెక్టర్ కు విన్నవించారు. అంతేకాకుండా రైతులు, కౌలు రైతులు,పట్టాలేని రైతులు, భూమి ఎక్కువ ఉండి పట్టాలో తక్కువ ఉన్న రైతులు ఉన్నారని వారికి సైతం వరి చేలను పరిశీలించి,నష్ట పరిహారం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు తుమ్మ మల్లారెడ్డి,పోరిక గోవింద్ నాయక్, మల్క రమేష్, ప్రదీప్ రావు, తక్కెళ్ళపెల్లి మోహన్,ఎస్కె.అసైన్, భోజరావు, ముత్తయ్య, రామకృష్ణ.దాసరి బుజ్జన్న,వెంకట్రావు, సమ్మయ్య, ఎండి అబ్బార్, ఎండి, ముస్తఫా, ఎస్.కె.ఖలీల్, కటుకూరి రాఖి తదితరులు పాల్గొన్నారు.

# భూభారతి చట్టం పైలెట్ ప్రాజెక్టులో వెంకటాపూర్

### ముఖ్యమంత్రి, మంత్రుల చిత్రపటానికి పాలాభిషేకం



**వెంకటాపూర్/రామప్ప, ఏప్రిల్ 15 (నిఘా న్యూస్):** జిల్లా అధ్యక్షులు పైడాకులఅశోక్ ఆదేశాల మేరకు మంగళవారం ములుగు నియోజకవర్గంలోని వెంకటాపూర్(రామప్ప)మండల కేంద్రంలో తాసిల్దార్ ఆఫీసు కార్యాలయం ముందు మండల కాంగ్రెస్ పార్టీ నాయకుల ఆధ్వర్యంలో భూభారతి చట్టం పైలెట్ ప్రాజెక్టులో వెంకటాపూర్ మండలంను ఎంపిక చేసినందుకు ధన్యవాదాలు తెలుపుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రులు పొంగులేటి, సీతక్క చిత్రపటాలకు పాలాభిషేకం చేయటం జరిగింది. ఇట్టి కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా టీపీసీసీ సభ్యులు మల్లాడి రాంరెడ్డి,జిల్లా గ్రంధాలయ సంస్థచైర్మన్ బానోత్ రవిచందర్,బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు బైరెడ్డి భగవాన్ రెడ్డి హాజరు కావడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ధరణి చట్టం కారణంగా పేద ప్రజలు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నారని,వందల ఎకరాల భూ కబ్జాలు,అక్రమ దందాలు చేస్తూ అమాయకపు ప్రజలను పిండి పిప్పిచేసిన చరిత్రను మూట కట్టుకున్నారు కాబట్టి పేదప్రజల దృష్టిలో ఉంచుకుని పేదప్రజల అందుబాటులో ఉండేవిధంగా భూ భారతీ చట్టాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం రూపొందించిందని, ఇలాంటి గొప్ప నిర్ణయం తీసుకున్న ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండలధ్యక్షులు చెన్నోజు సూర్యనారాయణ,మండల వర్కింగ్ ప్రెసిడెంట్ బండి శ్రీనివాస్,జిల్లా ప్రధాన కార్యదర్శిలు వేముల చంద్రాకర్ రెడ్డి,మిల్కూరి ఐలయ్య,బ్లాక్ కాంగ్రెస్ ఉపాధ్యక్షులు దొంతరవేని కుమార్,నియోజకవర్గ యూత్ అధ్యక్షులు మారం సుమన్ రెడ్డి, ఎన్ఎస్ యుఐ జిల్లా అధ్యక్షులు మామిడిశెట్టి కోటి,యూత్ మండల అధ్యక్షులు కట్టెకోళ్ల వెంకటేష్ యాదవ్, కిసాన్ కాంగ్రెస్ మండల అధ్యక్షులు కాసిడి శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పౌష్టికాహార కిట్లు పంపిణీ



**ఉప్పల్, ఏప్రిల్ 15 (నిఘా న్యూస్):** ఉప్పల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో టిబి ముక్త్ భారత్ కార్యక్రమంలో భాగంగా టీ బి రోగులకు ప్లాన్ ఇండియా ఆర్గనైజేషన్ సంస్థ నిక్షయ్ మిత్రాగా నమోదు చేసుకొని వారి సహకారంతో మంగళవారం పౌష్టికాహార కిట్ల పంపిణీ చేయడం చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర జాయింట్ డైరెక్టర్ టి.బి డాక్టర్ రాజేశం మాట్లాడుతూ మందులతో పాటు పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా వ్యాధి నుండి త్వరగా కోలుకోవచ్చని చెప్పారు.మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా వైద్యాధికారి డాక్టర్ ఉమా గౌరీ మాట్లాడుతూ క్షయ వ్యాధిని నివారించడంలో ముందస్తు వ్యాధి నిర్ధారణ పూర్తి కాలం మందులు వాడటం చాలా ముఖ్యమని తెలియజేశారు. ప్రోగ్రాం ఆఫీసర్ టిబి డాక్టర్ శ్రీదేవి మాట్లాడుతూ ప్లాన్ ఇండియా ఆర్గనైజేషన్ సంస్థకు పౌష్టికాహార కిట్ల పంపిణీ చేసినందుకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఇంకా నిశ్చయమిత్ర ద్వారా దాతలు ముందుకు వచ్చి టిబి బారిన పడిన రోగులకు న్యూట్రిషన్ కిట్ల అందించడంలో సహాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డి ఎంహెచ్ ఓ డాక్టర్ సత్యవతి, పీహెచ్సీ ఉప్పల్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సౌశీల్య, శ్రీ అభిలాష్ స్టేట్ ప్రాజెక్ట్ లీడర్ ప్లాన్ ఇండియా ఆర్గనైజేషన్, శ్రీనివాస్ వాసు ప్రసాద్ స్టేట్ జాయింట్ డైరెక్టర్ టీబీ సెల్ బి.వెంకటేశ్వర రెడ్డి ఎం పి హెచ్ ఈ ఓ, హెల్త్ సూపర్వైజర్ బోగ ప్రకాష్, డిస్ట్రిక్ట్ టీబీ స్టాఫ్, పీహెచ్ సి ఉప్పల్ ఎస్ టి ఎస్ శాదిధర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లాలోని 6 టిబి యూనిట్ లలో ప్లాన్ ఇండియా ఆర్గనైజేషన్ వారు 750 టిబి రోగులకు రెండు నెలలకు సరిపడా 1500 న్యూట్రిషన్ కిట్ల పంపిణీ కార్యక్రమాన్ని జిల్లా అంతం నిర్వహించారు.

# డిగ్రీ కళాశాల విద్యార్థులకు బహుమతులు

### అంబేద్కర్ జయంతి సందర్భంగా ఆయన సేవలపై వ్యాసరచన పోటీలు




**ఉప్పల్, ఏప్రిల్ 15 (నిఘా న్యూస్):** ఉప్పల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల లో అంబేద్కర్ జయంతి సందర్భంగా ఏర్పాటు చేసిన ఆన్ లైన్ క్విజ్ లో వివిధ రాష్ట్రాల విద్యార్థులు పాల్గొనడంతో విజయవంతం కాగా మంగళవారం వ్యాసరచన, చిత్రలేఖనం, పాటల పోటీలు జరిగాయి. సమ సమాజ నిర్మాణంలో అంబేద్కర్ పాత్ర అనే అంశంపై వ్యాసరచన పోటీ జరిగింది. వ్యాసరచన పోటీలో జి.కళ్యాణి, ఎండి సనా, టి.నవ్యశ్రీ లు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు సాధించారు. అంబేద్కర్ చిత్రలేఖనంలో జి.స్నేహ, జి.మాధవి ప్రథమ ద్వితీయ బహుమతులు సాధించారు. అంబేద్కర్ పాటల పోటీలలో ఎం గాత్రిని, విజయలక్ష్మి బహుమతులు సాధించారు. విజేతలకు విన్నర్స్ పబ్లికేషన్స్ నుండి డా. ప్రసన్న హరికృష్ణ సౌజన్యంతో విలువైన పోటీపరీక్షల విలువైన పుస్తక బహుమతులు అందించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహుమతి ప్రదాన కార్యక్రమంలో వక్తలు అంబేద్కర్ తత్త్వంపై ప్రసంగించగా పలువురు పాటలతో అలరించారు. ఈ కార్యక్రమాన్ని కళాశాల ఎన్ ఎస్ ఎస్ పిఓ జె విశ్వనాథ్ కుమార్, రాజనీతి శాస్త్ర అధ్యాపకులు పి.విజయ్ కుమార్ లు సమన్వయ పరచగా సభాధ్యక్షులు కళాశాల ప్రిన్సిపాల్ డా.కె.విజయ్ కుమార్ విజేతలకు బహుమతులు అందించారు. వైస్ ప్రిన్సిపాల్ డా.ఎ.రవిప్రసాద్, అకడమిక్ కోర్డినేటర్ కె.గీత, డా.సిహెచ్ సత్యనారాయణ, డా.జి.తిరుపతయ్య, డా.ఎస్ యమున, డా.వి.శ్రీనివాసరావు, డా.ఆర్ చంద్రసాగర్, డా.పి.వెంకటేశ్వర్లు, కె.అరుణ, పర్వీన్, జి.మమత, జి.శ్రీదేవి. భాగ్యరేఖ, షకీలా తదితరులు పాల్గొన్నారు.

# పాకాలలో అగ్నిమాపక వారోత్సవాలు

### అగ్నిమాపక అధికారి గుణశేఖర్ రెడ్డి



**చంద్రగిరి, ఏప్రిల్ 15 (నిఘా న్యూస్):** తిరుపతి జిల్లా చంద్రగిరి నియోజకవర్గం పాకాల మండలం పాకాల పంచాయతీ పార్క్ వీధిలో మంగళవారం అగ్నిమాపక వారోత్సవాలలో భాగంగా అగ్నిమాపక అధికారి గుణశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో అగ్ని ప్రమాదాల నివారణ,పై ప్రమాదాలు జరగకుండా డెమో కార్యక్రమం నిర్వహించారు.15వ తేదీ నుంచి 20వ తేదీ వరకు అగ్నిమాపక వారోత్సవాల కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా అగ్నిమాపక అధికారి గుణశేఖర్ రెడ్డి మాట్లాడుతూ మొదటి రోజు పాకాల పంచాయతీ పార్క్ వీధిలో అగ్నిమాపక వారోత్సవాలలో భాగంగా అగ్ని ప్రమాదాలు జరగకుండా తీసుకోవలసిన జాగ్రత్తలను గూర్చి ప్రజలకు వివరిస్తూ వాటర్ డెమో ద్వారా చేసి చూపించడం జరిగిందని తెలిపారు. అదేవిధంగా అగ్ని ప్రమాదాలు జరిగినప్పుడు తీసుకోవలసిన జాగ్రత్తలు,నివారించే పద్ధతుల తెలిపే కరపత్రాలను కూడా ప్రజలకు పంపిణీ చేయడం జరిగిందని తెలిపారు. ఈ అగ్నిమాపక వారోత్సవాలు ఏప్రిల్ 15 నుండి 20వ తేదీ వరకు జిల్లా అధికారుల ఆదేశాల మేరకు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అంతేకాకుండా జాతీయ మౌలిక సదుపాయాల అభివృద్ధికి అగ్ని బద్ధతపై పూర్తి దశలో ప్రజలకు అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. సాధారణ జాగ్రత్తలలో భాగంగా ఇంటిని పరిశుభ్రంగా ఉంచుకోవాలని, వస్తువులను చిందర వందరంగా లేకుండా సక్రమంగా ఉంచుకోవాలని తెలిపారు. ఇంట్లో ఉన్న చిన్న పిల్లలకు అగ్గిపెట్లు ,లైటర్లు, టపాకాయలు, ఎలక్ట్రికల్ సామాగ్రి, ఇతర మండే పదార్థములు ఏవి కూడా అందుబాటులో ఉంచరాదని తెలిపారు. అనుకోకుండా జరిగే అగ్ని ప్రమాదాలకు ముందుగానే కొంత నీటిని మీ ఇంటిలో నిల్వ చేసుకోవాలని తెలిపారు. ఇంట్లో వంటింటి క్రింద పై భాగాలలో గాలి,వెలుతురు ఉండేటట్లు చూసుకోవాలని,సిలిండర్ విషయంలో తగు జాగ్రత్తలు కూడా తీసుకోవాలని తెలిపారు. గ్యాస్ లీక్ అవుతున్నట్లు మీకు తెలిసిన వెంటనే రెగ్యులేటర్లను తప్పక ఆపివేయాలని తెలిపారు. వంట చేసేటప్పుడు సరియైన నూలు బట్టలు ఏప్రాన్ దుస్తులు ధరించాలని తెలిపారు. ప్రమాదవశాత్తు మీ బట్టలకు నిప్పు అంటుకుంటే భయంతో పరిగెత్తవద్దని, నేలపై దొర్లి,దుప్పటి లేదా కోటు లేదా పెద్ద టవల్ను చుట్టుకోండి అని తెలిపారు. మీ చుట్టుపక్కల అగ్ని ప్రమాదం జరిగితే ప్రతి ఒక్కరూ ఆరు బయటకు వెంటనే సురక్షితంగా రావాలని తెలిపారు. అగ్ని ప్రమాదాలు సంభవించినప్పుడు విలువైన వస్తువులు గూర్చి సమయాన్ని వృధా చేసుకోకుండా వాటి కోసం తిరిగి లోనికి ప్రవేశించరాదని తెలిపారు. విద్యుత్ పరికరాలకు నిప్పంటుకున్నప్పుడు నీళ్లతో ఆర్పవద్దని దీనివల్ల కరెంటు షాక్ కు తగిలి ప్రాణాపాయము కలగవచ్చునని తెలిపారు. అలా కాకుండా వెంటనే కరెంటును ఆఫ్ చేయాలని తెలిపారు. అగ్ని ప్రమాదం జరిగిన వెంటనే పట్టణ అగ్నిమాపక కేంద్రానికి గాని 101 కు సమాచారాన్ని అందించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో అగ్నిమాపక సిబ్బంది బాలాజీ,నాగర్జున, సురేంద్ర బాబు తదితరులు పాల్గొన్నారు.

# జర్నలిస్ట్ ల ఇళ్ల స్థలాల పోరుకు సిపిఎం మద్దతు

### సిపిఎం కాశీబుగ్గ కార్యదర్శి మహమ్మద్ బషీర్



**వరంగల్, ఏప్రిల్ 15 (నిఘా న్యూస్):** జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలు వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేస్తూ వరంగల్ జర్నలిస్టులు చేస్తున్న నిరసన కార్యక్రమానికి వివిధ పార్టీల నాయకులు సంఘీభావం తెలిపి మద్దతు ప్రకటించాయి. మంగళవారం సిపిఎం పార్టీ కాశీబుగ్గ ఏరియా కార్యదర్శి మహమ్మద్ బషీర్ అహ్మద్ మద్దతు పలికారు. బషీర్ మాట్లాడుతూ జర్నలిస్టుల న్యాయమైన డిమాండ్ ను వెంటనే తీర్చాలని వారికి ఉచితంగా డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అవసరమైతే వారి పక్షాన జర్నలిస్టులతో కలిసి సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ లో దీక్ష కైనా సిద్ధమని ప్రకటించారు. ఢిల్లీ నుండి గల్లి దాక నిత్యం సమాజంలో జరిగే కార్యక్రమాలను ప్రజలకు తెలియచేస్తూ చాలిచాలని వేతనాలతో జీవితాన్ని గడుపుతున్న జర్నలిస్టులకు డబుల్ ఇండ్ల స్థలం ఇచ్చి, ఐదు లక్షలు మంజూరు చేయాలన్నారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వంలో వరంగల్ 12వ డివిజన్ దేశాయిపేట శివారులో లక్ష్మీ మెగా టౌన్షిప్ వెనకాల జర్నలిస్టులకు డబుల్ బెడ్రూం నిర్మించారు. గత ప్రభుత్వం నిర్లక్ష్యం వలన జర్నలిస్టులకు ఇల్లు ఇవ్వలేక పోయారు. ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వంలో జర్నలిస్టులకు నిర్మించి ఉన్న డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు త్వరగతిన తక్షణమే స్థానిక కలెక్టర్, ప్రజా ప్రతినిధులు వారి సమస్యలను దృష్టిలో ఉంచుకొని డబుల్ బెడ్ రూములు జర్నలిస్టులకు పంచాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో దేవేందర్ సతీష్ అశోక్ నాగరాజు ప్రింట్ మీడియా ఎలక్ట్రిక్ మీడియా జర్నలిస్టులు తదితరులు పాల్గొన్నారు.



అంబర్ పేట డివిజన్ లోని దుర్గానగర్ లో ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ సహకారంతో నూతన కమిటీ హాల్ ను నిర్మిస్తామని కార్పొరేటర్ ఇ. విజయ్ కుమార్ గౌడ్ అన్నారు. మంగళవారం దుర్గా నగర్ లో స్థానిక బస్తివాసులతో కలిసి ఆయన పర్యటించారు. బస్తీ ప్రజల విజ్ఞప్తి మేరకు కమ్యూనిటీ హాల్ నిర్మిస్తామని ఆయన హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక బస్తి నాయకులు వెంకట్ గౌడ్, నరసింహ గౌడ్, శంకర్, లక్ష్మి, శివకృష్ణ, శివ తదితరులు పాల్గొన్నారు.

*-అంబర్ పేట, ఏప్రిల్ 15 (నిఘా న్యూస్):*

## రైల్వే ఉద్యోగాలు సాధించడానికి ఉచిత శిక్షణ

**అంబర్ పేటం, ఏప్రిల్ 15 (నిఘా న్యూస్):** రైల్వేలో ఉద్యోగాలు సాధించడానికి కావల్సిన శిక్షణను పరవస్తు క్రియేటివ్ ఫౌండేషన్, రాంకీ ఫౌండేషన్, లయన్స్ క్లబ్ గ్రీన్ ల్యాండ్ సంస్థల ఆధ్వర్యంలో ఉచిత శిక్షణ అందించనున్నారు. రైల్వేలో ఉద్యోగం పొందడానికి 3 నుంచి 4 నెలల పాటు అన్ని విధాల శిక్షణను నిరుద్యోగ యువతకు ఇవ్వనున్నట్లు సంస్థల ప్రతినిధులు గద్దె భాస్కర్, మువ్వారాంరెడ్డి, ప్రొఫెసర్ లక్ష్మీ కుమారి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉచిత శిక్షణ పొందే నిరుద్యోగ యువతకు ఈ నెల 20వ తేదీన అర్హత పరీక్షను నిర్వహించనున్నట్లు వారు తెలిపారు. అర్హత పరీక్షలో ఉత్తీర్ణులైన నిరుద్యోగులకు ఉచిత భోజనం, వసతి, కోచింగ్ ఇవ్వడం జరుగుతుందన్నారు. శ్రీధర్ సీసీఈ ఇనిస్టిట్యూట్ సహకారంతో ఉత్తమ శిక్షణ అందిస్తామన్నారు. రెండు తెలుగు రాష్ట్రల్లోని వివిధ నగరాల్లో అర్హత రాత పరీక్షను నిర్వహించడంజరుగుతుందన్నారు. అర్హత పరీక్షకు హాజరు కావాల్సిన వారు ముందుస్తుగా తమ పేర్లను ఈ నెల 17వ తేది లోపు నమోదు చేసుకోవాలన్నారు. ఆసక్తి గల వారు పరవస్తు క్రియేటివ్ ఫౌండేషన్ పేస్ బుక్ పేజీ, యూట్యూబ్ చానల్స్ ఫోన్: 9515658033లలో సంప్రదించవచ్చని వారు తెలిపారు.

## ఉప్పల్లో రూ.1.86 కోట్లతో బైపాస్ రోడ్డు నిర్మాణం

### పనులను పరిశీలించిన కార్పొరేటర్ రజితారెడ్డి



**ఉప్పల్, ఏప్రిల్ 15 (నిఘా న్యూస్):** ఉప్పల్‌లో వరంగల్ జాతీయ రహదారిపై ట్రాఫిక్ సమస్య ఒత్తిడిని తగ్గించేందుకు ప్రత్యామ్నాయంగా బైపాస్ రోడ్డు నిర్మాణం చేపడుతున్నట్టుగా ఉప్పల్ కార్పొరేటర్ రజితా రెడ్డి పేర్కొన్నారు. రూ.1.86 కోట్ల నిధులతో బైపాస్ రోడ్డు నిర్మాణాన్ని చేపట్టినట్టుగా చెప్పారు. ఉప్పల్ లోని సాయిబాబా కాలనీ నుంచి సూర్యనగర్ కాలనీ వరకు బైపాస్ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. ఈ పనులను కార్పొరేటర్ రజితా రెడ్డి,ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి పరమేశ్వర్ రెడ్డి కాలనీవాసులతో కలిసి పరిశీలించారు. ఈ పనులు పూర్తయితే మెట్రో క్యాష్ అండ్ క్యారీ నుంచి నేరుగా ఏషియన్ మాల్ వరకు రాకపోకలను సాగించవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో సాయిబాబా కాలనీ అధ్యక్షులు లెక్కల అంజి రెడ్డి తుమ్మల దేవి రెడ్డి ,సురేష్ సుమన్ శర్మ ,రత్నం తుమ్మల రాజేందర్ రెడ్డి ,చంద్ర రెడ్డి ,వెంకట్ రెడ్డి రమణ రెడ్డి ,లక్ష్మ రెడ్డి ,బిక్షపతి అంజయ్య గౌడ్ భీమయ్య ,బిక్షం రెడ్డి ,బొమ్మాజి ,నరేందర్ ,నర్సింహా ,నరేష్ గౌడ్ ,ఉపేందర్ ,చింతకింది శ్రీనివాస్ గర్దాసు వెంకటేష్ ,నాగునాయక్ ,గణేష్ సురేష్ యాదవ్ ,జంగా రెడ్డి ,ప్రమోదా ,పీరంభి ,సుమలత ,సువర్ణ ,బాలమణి సిద్ధమ పాల్గొన్నారు.

## బీకేఎం బైబిల్ కాలేజీని ప్రారంభించిన రాగం



**శేరిలింగంపల్లి, ఏప్రిల్ 15 (నిఘా న్యూస్):** శేరిలింగంపల్లి డివిజన్ లోగల పాపిరెడ్డి కాలనీలోని బీకేఎం చర్చికి సంబంధించిన బీకేఎం బైబిల్ కాలేజీ ప్రారంభోత్సవ కార్యక్రమానికి శేరిలింగంపల్లి కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ బైబిల్ కాలేజీ ముఖ్య ఉద్దేశం శిక్షణ ఇవ్వడానికి, సన్నద్ధం చేయడానికి క్రీస్తు లాంటి నాయకులు అవసరమని అన్నారు. ఏసుక్రీస్తు బోధనలు ప్రతిఒక్కరూ అనుసరించి నీతివంతమైన జీవితాన్ని కొనసాగించాలని, అదేవిధంగా ఆయన సూచించిన క్రీస్తుబోధనలు అనుసరిస్తూ ఉండాలని అన్నారు. ఏసుక్రీస్తు చల్లని దయ అందరిపై ఎల్లప్పుడూ ఉండాలని ప్రార్థించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీకేఎం చర్చ్ పాపిరెడ్డి నగర్ పాస్టర్ డానియల్, పాస్టర్ అమ్మ, ఇమ్మానుయేల్, ఏసుపాదం, శ్యామ్ బాబు, తదితర పాస్టర్లు, కాబోయే పాస్టర్లు తదితరులు పాల్గొన్నారు.

## ఫోక్సో కేసులో నిందితుడికి జీవిత ఖైదీ

### శిక్ష పడటంలో కృషి చేసిన పోలీస్ లకు సత్కారం



**వరంగల్, ఏప్రిల్ 15 (నిఘా న్యూస్):** వరంగల్ జిల్లా గీసుగొండ పోలీస్ స్టేషన్ పరిధిలో బాలికపై అత్యాచారం కేసులో నిందితుడికి జీవితాఖైదీ శిక్ష పట్టడంలో కృషి చేసిన పబ్లిక్ ప్రాసిక్యూటర్లు రవికిరణ్ మర్రి వాసుదేవ రెడ్డి భరోసా లీగల్ అడ్వైసర్ నీరజ ఏసీపీ తిరుపతి ఇన్స్ స్పెక్టర్ బాబూలాల్ మహేందర్ హెడ్ కానిస్టేబుల్ విజేందర్ కానిస్టేబుళ్లు శ్రవణ్ యుగంధర్లను ఈస్ట్ జోన్ డీసీపీ అంకిత్ కుమార్ సత్కరించారు.

## నాచారం సమస్యలపై జెడ్ సిని కలిసిన కార్పొరేటర్ శాంతి



**నాచారం, ఏప్రిల్ 15 (నిఘా న్యూస్):** నాచారం డివిజన్ కార్పొరేటర్ శాంతి జోనల్ కమిషనర్ కు వినతి పత్రం అందజేశారు. నాచారం డివిజన్లో ప్రధానంగా ఎండాకాలం అయినా పటేల్ కుంట చెరువులలో పెద్ద ఎత్తున గుర్రపు డెక్క నిలిచి ఉండడంతో విపరీతమైన దోమల సమస్యతో నాచారం ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తక్షణమే చెరువులోని గుర్రపు డెక్క తొలగించాలని కోరడం జరిగింది. అలాగే హిందూ స్మశాన వాటికలో అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయాలని కోరారు. హెచ్ఎంటి నగర్ పెద్ద చెరువుపై ఏర్పాటు చేసిన వీధి దీపాలు పనిచేయడం లేదని ఫిర్యాదు చేశారు. అన్ని సమస్యలపై సానుకూలంగా జోనల్ కమిషనర్ స్పందించడం జరిగింది.

## వెంకన్న బాబుకు గౌరవ డాక్టరేట్ ఎంపిక



**షాద్ నగర్, ఏప్రిల్ 15 (నిఘా న్యూస్):** రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్‌కు చెందిన ప్రముఖ సామాజిక కార్యకర్త, కొమ్ము వెంకన్న బాబు గౌరవ డాక్టరేట్‌కు ఎంపికయ్యారు. జర్నలిజం, సామాజిక సేవ, మానవతా దృక్పథం, యువత అభివృద్ధి రంగాల్లో చేసిన విశిష్ట సేవలకు గుర్తింపుగా ఆయనకు ఈ గౌరవం లభించింది. ఈ అవార్డును ఏసియా ఇంటర్నేషనల్ కల్చర్ రీసెర్చ్ యూనివర్సిటీ వారి తరపున, ఏసియా వేదిక్ ఇంటర్నేషనల్ కల్చర్ అండ్ రీసెర్చ్ స్ఫూర్తి అకాడమీ అందజేస్తోంది. అకాడమీ చైర్మన్ లయన్ డాక్టర్ ఆకుల రమేష్ చేతుల మీదుగా, నాంపల్లి తెలుగు యూనివర్సిటీ వేదికగా ఏప్రిల్ 17న ఈ గౌరవ డాక్టరేట్ అందజేయనున్నారు.


## పేదల ఇంట్లో సన్న బియ్యం భోజనం చేసిన కెఎల్ఆర్



**మహేశ్వరం, ఏప్రిల్ 15 (నిఘా న్యూస్):** ప్రభుత్వం సరఫరా చేసే సన్న బియ్యం పేదలకు వరమని మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ ఇన్చార్జి కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి అన్నారు. తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న సన్నబియ్యం కార్యక్రమంలో కె.ఎల్.ఆర్ పాల్గొన్నారు. రేషన్ దుకాణం ద్వారా సన్నబియ్యం పొందిన బీసీ నాయకులు ఎడ్ల మహేందర్ ముదిరాజ్, రాములు ముదిరాజ్ ఇంట్లో మధ్యాహ్నం భోజనం చేశారు. ఈ సందర్భంగా కేఎల్ఆర్ మాట్లాడుతూ ధనికుడు తినే అన్నం పేదోడు సైతం కడుపు నిండా తినాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సన్నబియ్యం పథకాన్ని తెచ్చారని కొనియాడారు. సంక్షేమ పథకాలు పారదర్శకంగా అమలు చేసేలా కాంగ్రెస్ నేతలు కృషి చేయాలని లక్ష్మారెడ్డి కోరారు. ఈ కార్యక్రమంలో కందుకూరు మండల నాయకులు సహా అన్ని విభాగాల ప్రతినిధులు పాల్గొన్నారు.


## ఫ్లిప్ కార్ట్ భాగస్వామ్యంతో...

### ఏఐ ఆధారిత ల్యాప్‌టాప్ విడుదల



**హైదరాబాద్, ఏప్రిల్ 15 (నిఘా న్యూస్):** భారత్ లో తన ఏఐ-ఆధారిత ఎక్స్‌పర్ట్‌బుక్ పి-సిరీస్ ల్యాప్‌టాప్‌లను ఫ్లిప్ కార్ట్ భాగస్వామ్యంతో విడుదల చేస్తున్నట్లు అసూస్ ఏపీఏసీ కమర్షియల్ పీసీ బిజినెస్ అధిపతి, వైస్ ప్రెసిడెంట్ మిస్టర్ రెక్స్ లీ మా మంగళవారం నగరంలో విడుదల చేసిన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆయన మాట్లాడుతూ ఈ ల్యాప్‌టాప్ లు అధిక పనితీరు, అధిక మన్నిక, గొప్ప బ్యాటరీ బ్యాకప్, ఎంటర్‌ప్రైజ్-గ్రేడ్ భద్రత, సర్వీస్ మద్దతుతో నడిచే వ్యాపార నిపుణుల కోసం రూపొందించ బడ్డాయన్నారు. ఫ్లిప్‌కార్ట్ సీనియర్ డైరెక్టర్ సుజిత్ అగాషే మాట్లాడుతూ ఈ ల్యాప్‌టాప్ ఫ్లిప్‌కార్ట్, ఫ్లిప్‌కార్ట్ మినిట్స్‌లో అందుబాటులో ఉంటుందన్నారు. ఫ్లిప్‌కార్ట్ ప్రతినిధులు ఆదిత్య మన్నురియా, సుజిత్ అగాషే, ఆసుస్ ప్రతినిధులు దినేష్ శర్మ, రెక్స్ లీ, ఎరిక్ ఔ, ఇంటెల్ ప్రతినిధులు రాహుల్ మల్హోత్రా, కరణ్ బావా పాల్గొన్నారు.

## కట్ట మైసమ్మ ఆలయంలో ఏనుగు పూజలు



**శామీర్ పేట, ఏప్రిల్ 15 (నిఘా న్యూస్):** శామీర్ పేట మండలంలోని బిజెపి జిల్లా కార్యవర్గ సభ్యులు దంగుడుల మైసయ్య నిర్వహించిన అమ్మ వారి పూజలో పాల్గొని అనంతరం శామీర్ పేట కట్ట మైసమ్మ ఆలయంలో అమ్మవారిని దర్శించుకున్న బిజెపి నేత ఏనుగు సుదర్శన్ రెడ్డి ఈ కార్యక్రమంలో ఆయనతో పాటు బీజేపీ శామీర్ పేట మండల అధ్యక్షులు కొరివి కృష్ణ, సీనియర్ నాయకులు పవన్ గౌడ్, నర్సింహులు, బిజెవైఎం జిల్లా ఉపాధ్యక్షులు బోయిని శివ, బిజెవైఎం మండల అధ్యక్షుడు శరత్ తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ రాష్ట్రాన్ని భ్రష్టు పట్టిస్తున్న కాంగ్రెస్

- 27న జరిగే రజతోత్సవ సభను విజయవంతం చేయాలి
- మాజీ మంత్రి ఎమ్మెల్యే సబితా రెడ్డి



**బాలాపూర్, ఏప్రిల్ 15 (నిఘా న్యూస్):** ప్రజల సమస్యలు పట్టించుకోని సోయిలేని ప్రభుత్వం రాష్ట్రాన్ని పాలిస్తుందని, కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రాన్ని భ్రష్టుపట్టిస్తుందని మాజీ మంత్రి మహేశ్వరం ఎమ్మెల్యే సబితా రెడ్డి మండిపడ్డారు. బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని పెద్దబావి మల్లారెడ్డి గార్డెన్‌లో బడంగ్పేట్ కార్పొరేషన్ బీఆర్ఎస్ అధ్యక్షులు రామిడి రామిరెడ్డి ఆధ్వర్యంలో జరిగిన మహేశ్వరం నియోజకవర్గం బిఆర్ఎస్ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశానికి ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతో ఏప్రిల్ 27న వరంగల్‌లో జరగబోయే భారీ రజతోత్సవ బహిరంగ సభ ఛలో వరంగల్ ను విజయవంతం చేయాలని పిలుపునిస్తూ దిశా నిర్దేశం చేశారు. కేసీఆర్ నాయకత్వంలో బీఆర్ఎస్ లేకపోతే తెలంగాణ రాష్ట్రం వచ్చేది కాదన్నారు. తెలంగాణ పట్ల చిత్తశుద్ధి వ్యూహాత్మక అడుగులతో తెలంగాణ రాష్ట్రం సాకారమైందన్నారు. ఉద్యమం కోసం ఒక రాజకీయ పార్టీ ఏర్పడటం దేశంలోనే తొలిసారి అని అందుకు బీఆర్ఎస్ సభ్యులందరూ గర్వపడాలని ఎమ్మెల్యే సబిత ఇంద్రారెడ్డి అన్నారు. బీఆర్ఎస్ పార్టీ రజతోత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నందున ఆరోజు పార్టీ దిమ్మెలకు రంగులు వేసి పార్టీ జెండా ఎగురవేయాలని కోరారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలు నెరవేర్చలేక ఘోరంగా విఫలమైందన్నారు. అందుకే ప్రజలు కేసీఆర్ నాయకత్వం వైపు చూస్తున్నారన్నారు. గత ప్రభుత్వం హయాంలో రైతులతో పాటు అన్ని వర్గాల ప్రజలు సంతోషంగా ఉన్నారని గుర్తు చేశారు. తెలంగాణ రాష్ట్రానికి కెసిఆర్ ఇచ్చిన ప్రతి సంక్షేమ పథకం చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతుందని, ఏ సంక్షేమ పథకం అమలు చేసినా రైతుబంధు, హరితహారం, పెన్షన్లు, విదేశీ విద్యా పథకం వంటి పథకాలు కేసీఆర్ మార్క్ గా చరిత్రలో చెరగని ముద్ర వేసాయని అన్నారు. ఈ సమావేశంలో మాజీ ప్రజాప్రతినిధులు, నియోజకవర్గ స్థాయి బీఆర్ఎస్ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలి

### మధిరలో ముమ్మరంగా టియుడబ్ల్యూజె సభ్యత్వం నమోదు



**మధిర, ఏప్రిల్ 15 (నిఘా న్యూస్):** అర్హులైన వర్కింగ్ జర్నలిస్టులందరికీ ఇల్లు, ఇళ్లస్థలాలు హెల్త్ కార్డులు ఇవ్వాలని టియు డబ్ల్యూజే (ఐజేయు) జిల్లా కమిటీ సభ్యులు పాగి బాలస్వామి, శ్రీ రామోజీ యోగేష్ కోరారు. నియోజకవర్గ కేంద్రంలో మంగళవారం టియుడబ్ల్యూజే (ఐజేయు) సభ్యత్వ నమోదు కార్యక్రమం స్థానిక ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో నిర్వహించారు. తొలి సభ్యత్వాన్ని సీనియర్ జర్నలిస్టులు అట్లూరి సాంబిరెడ్డి, కొంగర మురళి చేతుల మీదగా సీనియర్ జర్నలిస్టు పాగి బాలస్వామికి అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అనేక సంవత్సరాలుగా మధిర ప్రాంతంలో జర్నలిస్టులుగా పనిచేస్తున్నారని వారు తెలిపారు. ప్రజలకు ప్రభుత్వానికి సారథిగా వ్యవహరిస్తున్న జర్నలిస్టులకు ఇల్లు, ఇళ్ల స్థలాలు ఇవ్వాలని వారు కోరారు. అదేవిధంగా హెల్త్ కార్డులు ఇవ్వాలని, ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలలో, రాజీవ్ యువ వికాసంలో జర్నలిస్టులకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ప్రైవేటు విద్యాసంస్థల్లో జర్నలిస్టు పిల్లలకు ఉచిత విద్య అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్టులు రావిరాల శశి కుమార్, మువ్వా మురళి, మక్కెన నాగేశ్వరరావు, కిలారి కిషోర్, నాళ్ళ శ్రీనివాసరావు, కాకరపర్తి శ్రీనివాసరావు, పసుపులేటి నాగేంద్ర శ్రీనివాసరావు, సుంకర సీతారాములు, చల్లా శ్రీనివాసరెడ్డి, మువ్వా రామకృష్ణ, తలారి రమేష్, రావూరి కృష్ణ ప్రసాద్, పగిడిపల్లి ప్రభాకర్ రావు, దుబాసి రాజేష్, వేల్పుల పవన్ కళ్యాణ్, రాము, మధు, కంచెపోగు కోటేశ్వరరావు, పల్లబోతు ప్రసాదరావు, వేముల నవీన్, కొంగల విజయ్, పసుపులేటి ఈశ్వర్ రవితేజ, ఆదూరి విజయ్ రాజు, లిక్కి రవీంద్ర, చారు గుండ్ల లక్ష్మీ నరసింహమూర్తి, దోర్నాల కృష్ణ, సంతోష్ వివిధ పత్రికలు జర్నలిస్టులు పాల్గొన్నారు.

# నాయీ బ్రాహ్మణుల సమస్యల పరిష్కారానికి కృషి



### నాయీ బ్రాహ్మనుల సంఘం జిల్లా అధ్యక్షులు మాణిక్ ప్రభు

**సంగారెడ్డి, ఏప్రిల్ 15 (నిఘా న్యూస్):** నాయీ బ్రాహ్మణుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి, పరిష్కరించే దిశగా కృషి చేస్తున్నామని నాయీ బ్రాహ్మణ సేవా సంఘం సంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు లక్డారం మాణిక్ ప్రభు ప్రధాన కార్యదర్శి శ్రీశైలం తెలిపారు. సంగారెడ్డి జిల్లా కేంద్రంలోని జడ్పీ హాల్లో మంగళవారం జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. ఈ కార్యక్రమాన్ని నాయీ బ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో నిర్వహించారు. సమస్యలపై అహంకారాలు కాకుండా అందరు సంఘటితంగా పోరాటం చేయలన్నారు. అందరికి సమాన హక్కులు సమానంగా కల్పించేల కృషి చేయాలన్నారు. నాయీ బ్రాహ్మణ సమాజ అభివృద్ధికి యువత కూడా ముందుకు రావాలని పిలుపునిచ్చారు. కొత్తగా ఏర్పడిన సంఘం కమిటీ చాలా తక్కువ సమయంలోనే కొన్ని ప్రధాన సమస్యలకు పరిష్కారం చూపిందన్నారు. ఇటీవల నీరు పేద కుటుంబంలో మరణించిన నాగరాజు కుటుంబానికి ఆర్థిక సహాయం సంఘం తరుపున ఆదు కోవడం మంచి నిర్ణయమని తెలిపారు. నాయీ బ్రాహ్మణ కులస్థుల ఐక్యతను చాటిచెప్పిందన్నారు. భవిష్యత్తులో మారన్ని కార్యక్రమాలను సంఘం ఆధ్వర్యంలో చేపట్టానున్నని పేర్కొకున్నారు. భవిష్యత్ కార్యాచరణలో భాగంగా స్థానిక ఏమ్మెల్యే చింతా ప్రభాకర్ ను కలసి వినతిపత్రాలను సమర్పించి సమస్యల పరిష్కారానికి కృషి చేయనున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గౌరవాధ్యక్షుడు దత్తాత్రేయ, వర్కింగ్ ప్రెసిడెంట్ సాయినాథ్, ఉపాధ్యక్షుడు రంజోల్ ప్రభు, కోశాధికారి శేఖర్, అలాగే మురారి నాయి, పెంటయ్య, వీరన్న, చర్యాల ఆంజనేయులు, సత్యం, చరణ్, పాండు, నిరంజన్, హనుమంతు, శ్రీనివాస్, మహేష్ తదితరులు పాల్గొన్నారు. నాయీ బ్రాహ్మణుల హక్కుల కోసం సంఘం చేపట్టిన ఈ ఉద్యమం, మరింత విస్తరించి సమాజంలో వారిని అర్థించుకునే దిశగా మద్దతు పెరగాలని వారు ఆకాంక్షించారు.

# ప్రజల సహకారంతోనే నేరాల నివారణ సాధ్యం

### ఉప్పల్ పోలీస్ స్టేషన్ అడ్మిన్ ఎస్ఐ కోటేశ్వరరావు



**చిలుకానగర్, ఏప్రిల్ 15 (నిఘా న్యూస్):** చిల్కానగర్ బాలాజీ ఎంక్లేవ్ కాలనీలో కార్పొరేటర్ బన్నాల గీత ఆధ్వర్యంలో బాలాజీ ఎంక్లేవ్ కమ్యూనిటీ హాల్ లో ఏర్పాటు చేసిన కాలనీ పోలీసుల మధ్య సమన్వయ మీటింగ్ ఏర్పాటు చేయడం జరిగింది. బాలాజీ ఎంక్లేవ్ కాలనీ అధ్యక్షులు జగదీశ్వర్ రెడ్డి అభ్యర్థన మేరకు పోలీస్ సిబ్బంది, కాలనీ అసోసియేషన్ సభ్యులతో కలిసి కాలనీలో జరుగుతున్న సైకిళ్ల, పెట్రోల్, దొంగతనాలకు, మందుబాబుల ఆగడాలకు పార్కులలో గంజాయి సేవించే వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలన్న విషయంపై సమావేశం ఏర్పాటు చేయడం జరిగింది. సమావేశంలో కాలనీ అసోసియేషన్ అధ్యక్షులు, వారి సభ్యులు పోలీసు వారికి పెట్రోలింగ్ సరిగ్గా జరగట్లేదని కాలనీలలో సైకిల్ దొంగతనాలు, పెట్రోల్ దొంగలించడం, కన్స్ట్రక్షన్ సైట్ ల వద్ద స్టీల్ ఎత్తుకెళ్లడం లాంటివి జరుగుతున్నాయని వాటిని వెంటనే అరికట్టే విషయంలో అన్ని చర్యలు చేపట్టాలని, గతంలో జరిగే విధంగా పెట్రోలింగ్ విధానాన్ని తరచుగా ఏర్పాటు చేసి అరికట్టాలని పోలీస్ సిబ్బందిని కోరడం జరిగింది. సమావేశంలో పాల్గొన్న ఉప్పల్ పోలీస్ స్టేషన్ అడ్మిన్ ఎస్ఐ కోటేశ్వరరావు మాట్లాడుతూ కచ్చితంగా పోలీస్ పెట్రోలింగ్ ఏర్పాటు చేస్తామని, దొంగిలించిన సైకిల్ని వెంటనే పట్టుకునే అన్ని చర్యలు చేపడతామని, గంజాయిని అరికట్టే విషయంలో మఫ్టీలో పోలీసులు తిరుగుతూ ఉన్నారని వారి పైన కఠిన కేసులు కూడా పెడుతున్నామని తెలిపారు. 25 కాలనీల సమైక్య అధ్యక్షులు బన్నాల ప్రవీణ్ ముదిరాజ్ మాట్లాడుతూ చిన్న చిన్న దొంగతనాలు అరికట్టకపోతే అవి మునుముందు పెద్ద దొంగతనాలకు దారితీస్తాయని పోలీసులతో పాటు సంక్షేమ సంఘం సభ్యులు కూడా తమ వంతు బాధ్యతగా అనుమానిత వ్యక్తులను చూసిన వెంటనే పోలీసు సిబ్బందికి సమాచారం అందించాలని, అదేవిధంగా గంజాయి సేవించే వ్యక్తులను గమనిస్తే పోలీసులకు సోషల్ రెస్పాన్సిబిలిటీ గా సమాచారం అందించాలని సూచించారు. కార్యక్రమంలో బాలాజీ ఎంక్లేవ్ కాలనీ అధ్యక్షులు జగదీశ్వర్ రెడ్డి, మాజీ అధ్యక్షులు వేణుగోపాల్ రెడ్డి, ఓంకార్ సింగ్ కమిటీ సభ్యులు కాలనీ అసోసియేషన్ సభ్యులు మహిళలు, పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## సివిల్ సప్లయ్.. అధికారులు బాధ్యతాయుతంగా పనిచేయాలి

### గతంలో చేసిన తప్పిదాలను పునరావృతం చేయకండి

### చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని



**చంద్రగిరి, ఏప్రిల్ 15 (నిఘా న్యూస్):** తిరుపతి జిల్లా చంద్రగిరి నియోజకవర్గంలో చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని సివిల్ సప్లయ్ అధికారులతో సమావేశం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా చంద్రగిరి ఎమ్మెల్యే మాట్లాడుతూ సివిల్ సప్లయస్ లో అవకతవకులు నా దృష్టికి వస్తున్నాయి, అధికారులందరూ బాధ్యతగా మెలగండని పేర్కొన్నారు. రేషన్ బియ్యం పంపిణీలలో సిఎస్డిటిలు నిక్కచ్చిగా ఉండాలని అన్నారు. డీలర్లకు బియ్యం ఇచ్చేటప్పుడు సరైన తూకాలతో ఇవ్వండి అని తెలియజేశారు. ప్రతి రేషన్ కార్డుదారునికి రేషన్ సరుకులు అందేలా చూడాలని అన్నారు. సిఎస్డిటి లకు ఇబ్బందులు ఉంటే, పై అధికారుల దృష్టికి తీసుకొచ్చి సమస్యలను పరిష్కరించుకోండి అని చెప్పారు. ఎమ్మార్వోలు రేషన్ షాపులను అప్పుడప్పుడు తనిఖీలు నిర్వహించండని తెలియజేశారు. అధికారులందరూ సమన్వయంతో పనిచేసి ప్రజా సమస్యలను త్వరితగతంగా పరిష్కరించాలని పేర్కొన్నారు.

## అర్హులందరికీ ఇందిరమ్మ ఇండ్లు

### జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్



**నారాయణపేట, ఏప్రిల్ 15 (నిఘా న్యూస్):** అర్హత కలిగిన వారికి ఖచ్చితంగా ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేయాలని జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ సూచించారు. నియోజక వర్గానికి ఓ ప్రత్యేక అధికారినీ నియమించడం జరుగుతుందని, ఆ ప్రత్యేక అధికారుల పర్యవేక్షణలో అర్హుల ఎంపిక పారదర్శకంగా చేయాలనీ, అర్హులైన వారికి ఇందిరమ్మ ఇండ్లు వచ్చేటట్లు చూడాలన్నారు. నియోజకవర్గానికి కేటాయించిన 3,500 ఇందిరమ్మ ఇండ్లను అర్హులందరికీ వచ్చేలా అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని ఆమె తెలిపారు. అనంతరం భూ భారతిపై అధికారులతో కలెక్టర్ చర్చించారు. యాక్షన్ ప్లాన్ సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమం లో జిల్లా అదనపు కలెక్టర్ రెవిన్యూ బెంషాలం, అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వర్ ఆర్.డి.ఓ. రాంచందర్ నాయక్, తదితరులు పాల్గొన్నారు.

## రాజానగరంలో రెండు కొత్త ఆరోగ్య కేంద్రాలు మంజూరు

### ఎమ్మెల్యే బలరామకృష్ణ వెల్లడి



**కోరుకొండ, ఏప్రిల్ 15 (నిఘా న్యూస్):** కోరుకొండ మండలం గాదరాడ లోను, రాజానగరం మండలం శ్రీకృష్ణపట్నంలోనూ కొత్తగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు పీహెచ్సీలు మంజూరు చేయాలని గతంలో మంత్రి సత్య కుమార్ యాదవ్ ని కలిసి ఆయన దృష్టికి తీసుకువెళ్ళిన రాజానగరం నియోజకవర్గం శాసనసభ్యులు బత్తుల బలరామకృష్ణ. అదే విధంగా ఆరోగ్య కేంద్రాలు పిహెచ్సిలు ఏర్పాటు ఆవశ్యకతను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి వర్యులు కొణిదెల పవన్ కళ్యాణ్ దృష్టికి తీసుకు వెళ్ళడం జరిగిందని ఫలితంగా పి.హెచ్.సి. ల మంజూరు కోసం డైరెక్టర్ ఆఫ్ పబ్లిక్ హెల్త్ నుంచి ప్రతిపాదనలు పంపాలని తూర్పు గోదావరి జిల్లా డి.ఎం.హెచ్.ఓ. ఆదేశించారు. ఈ మేరకు రిపోర్ట్ ప్రభుత్వానికి పంపారు. త్వరలోనే కోరుకొండ మండలం గాదరాడ, రాజానగరం మండలం శ్రీకృష్ణపట్నంలలో కొత్తగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు పీహెచ్సీ లు ఏర్పాటు చేస్తారని ఈ సందర్భంగా ఎమ్మెల్యే తెలిపారు.

## బి ఆర్ఎస్ వరంగల్ సభ విజయ వంతానికి పాదయాత్ర

### పాదయాత్రను ప్రారంభించిన మాజీ మంత్రి జగదీశ్వర్ రెడ్డి




**వలిగొండ, ఏప్రిల్ 15 (నిఘా న్యూస్):** యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండలం బీఆర్ఎస్ పార్టీ 25వ వసంతంలో అడుగుపెడుతున్న తరుణంలో ఈనెల 27న వరంగల్ లో తలపెట్టిన భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలని కోరుతూ బీఆర్ఎస్ పార్టీ విద్యార్థి, యువజన విభాగం ఆధ్వర్యంలో మత్స్యగిరిగుట్ట నుండి యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి పాదాల వరకు తలపెట్టిన పాదయాత్రను మాజీ మంత్రి సూర్యాపేట ఎమ్మెల్యే జగదీశ్వర్ రెడ్డి మంగళవారం జెండా ఊపి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో భువనగిరి పార్లమెంట్ బిఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ క్యామ మల్లేష్, భువనగిరి మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్ రెడ్డి, గాదిరి కిషోర్, కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి, భూడిద బిక్షమయ్య గౌడ్, డీసీసీబీ మాజీ చైర్మన్ గొంగిడి మహేందర్ రెడ్డి, రాష్ట్ర నాయకులు చింతల వెంకటేశ్వర్ రెడ్డి, మండల పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## దొరల చట్టాన్ని బంగాళా ఖాతంలో విసిరేసాం

### రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



**హైదరాబాద్, ఏప్రిల్ 15 (నిఘా న్యూస్):** తెలంగాణ రాష్ట్ర ప్రజల భూములకు పూర్తి భద్రత, భరోసా కల్పించే భూభారతి చట్టాన్ని ప్రజలకు అందించడంతో తన జన్మధన్యమైందని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి శ్రీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. గత ప్రభుత్వ దొరల హయాంలో నాలుగు గోడల మధ్య నలుగురు కలసి రూపొందించిన 2020 రెవెన్యూ చట్టం- ధరణితో ప్రజలకు కంటిమీద కునుకు లేకుండా పోయిందని, రెవెన్యూ వ్యవస్థ కూడా తెల్లవారు ఝామున దొరగారి మదిలో మెదిలిన ఆలోచనలకు అనుగుణంగా పరిగెత్తలేకపోయారు. అందరి గుండెల్లో రైళ్లు పరిగెత్తించే ఈ చట్టాన్ని స్వార్ధ ప్రయోజనాలకోసం ఉపయోగించుకోవడానికి గ్రామ పరిపాలనాధికారుల వ్యవస్థను కూడా నాడు రద్దు చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఇతర సహచర మంత్రులు ఎంతో కృషి చేసి రూపొందించిన ఈ చట్టాన్ని అసెంబ్లీలో ప్రవేశపెడితే బి ఆర్ ఎస్ సభ్యులు ఏ విధంగా అపహాస్యం చేశారో, అడ్డుకోవడానికి ప్రయత్నించారో గమనించాలి. అయినా ఎన్నికల ముందు ఇచ్చిన హామీని నేటితో నిలబెట్టుకున్నాం 2020 రెవెన్యూ చట్టం మూడేళ్లలో మురిగిపోగా, నేటి 2025 భూభారతి చట్టం వందేళ్లు వర్ధిల్లుతుంది. ఈ చట్టాన్ని సమర్ధవంతంగా ప్రజలకు అందించేందుకు గాను 4 జిల్లాల్లోని 4 మండలాలను పైలట్ ప్రాజెక్ట్ కింద ఎంపిక చేశాం. ఖమ్మం, మెహబూబ్‌నగర్, ములుగు, కామారెడ్డి జిల్లాలను ఎంపికచేశాం. అధికారులే ప్రజల వద్దకు వచ్చి సమస్యలు స్వీకరించి 15 రోజుల్లో పరిష్కరిస్తారు. ఈనెల 17 నుంచి కలెక్టర్లు రాష్ట్రంలో అన్ని మండలాల్లో ఈ చట్టంపై అవగాహనా సదస్సులు నిర్వహిస్తారు. రాష్ట్రంలో అన్నివర్గాల నుంచి ఫీడ్‌బ్యాక్ తీసుకొని , భేషిజాలకు పోకుండా అవసరమైన మార్పులు చేసి జూన్ 2 తేదీనాటికి సమగ్ర చట్టాన్ని ఉపయోగంలోకి తీసుకువస్తాం మే మొదటి వారంలో రాష్ట్రంలో మిగిలిన 29 జిల్లాలలో ఒక్కో మండలాన్ని ప్రయోగాత్మకంగా ఎంపిక చేసి సమస్యలను స్వీకరించి భూభారతి చట్టాన్ని పటిష్టపరుస్తాం. గత ప్రభుత్వంలో జరిగిన తప్పులను సవరిస్తాం. దీనికోసం ఎమ్మార్వో స్దాయిలో అధికారుల బృందం పనిచేస్తుందిచట్టాన్ని ప్రజల కోసం ఇందిరమ్మ ప్రభుత్వం రూపొందించినా దీనిని సమగ్రంగా ప్రజలకు అందించాల్సిన బాధ్యత అధికారులదే. పేద, దళిత, గిరిజనుల పరిస్ధితులను దృష్టిలో పెట్టుకొని వారికి ఎటువంటి అడ్డంకులు లేకుండా భూభారతిని అమలు చేయాలని అధికారులను కోరుతున్నాను.


## అంబేద్కర్ ఆశయ సాధనే కాంగ్రెస్ లక్ష్యం




### జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షులు బత్తుల శ్రీనివాస్ యాదవ్

**డోర్నకల్, ఏప్రిల్ 15 (నిఘా న్యూస్):** బడుగు బలహీన వర్గాల ఆశయ సాధన కోసం జై బాపు,జై బీమ్, జై సంవిదాన్, కార్యక్రమం ఏడో రోజున ఏఐసీసీ పిసిసి ఆదేశాలతో డోర్నకల్ ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ రామచంద్రు నాయక్ నాయకత్వంలో మహబూబాబాద్ జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు బత్తుల శ్రీనివాస్ యాదవ్ మండల కాంగ్రెస్ నాయకులు మండలంలోని గొల్లచర్ల, లింభ్యతండ, హుణ్యతండా, తండాలో పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా మహబూబాబాద్ జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు డాక్టర్ బత్తుల శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ రాజ్యాంగాన్ని ప్రతి ఒక్కరూ గౌరవించాలి అన్నారు. రేవంత్ రెడ్డి సర్కార్ లో డోర్నకల్ మండలం అభివృద్ధిలో దూసుకు పోతుందని తెలిపారు. సన్న బియ్యం పథకంతో ప్రజలకు ప్రభుత్వం మీద నమ్మకం పెరిగింది చెప్పారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు డిఎస్ జగదీష్, మార్కెట్ డైరెక్టర్ తేజ వెంకన్న బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఖాసం శేఖర్,ఆంగోత్ వెంకన్న, హనుమా, పగిడిపాల వెంకటేశ్వర్లు, మాజీ ఎంపీటీసీ భూక్య శీను, లిబియా తండా గ్రామ కాంగ్రెస్ అధ్యక్షుడు బానోతు శ్రీను, పుణ్య తండా గ్రామ అధ్యక్షుడు డిజె శ్రీను, మాజీ ఎంపీటీసీ బానోతు శంకర్, తదితరులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు చెక్కుల పంపిణీ




**సిద్దిపేట, ఏప్రిల్ 15 (నిఘా న్యూస్):** ఇందిరమ్మ ఇళ్లకు ఎంపికైన లబ్ధిదారులలో పని పురోగతి వివరాలను బట్టి మంగళవారం సచివాలయంలో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఇతర మంత్రులతో కలిసి వివిధ జిల్లాలలో ఇందిరమ్మ ఇళ్లకు ఎంపికైనా లబ్ధిదారులకు వారి చేతుల మీదుగా లక్ష రూపాయల చెక్కును అందజేశారు. సిద్ధిపేట జిల్లా నుండి పని పురోగతిలా ముందున్న లబ్ధిదారులలో కోహెడ మండలం పోరెడ్డి పల్లి గ్రామానికి చెందిన దబ్బెట రాజవ్వ, సిద్ధిపేట రూరల్ మండలం వెంకటాపూర్ గ్రామానికి చెందిన గోపగాని లచ్చవ్వ వీరిరువురికి ముఖ్యమంత్రి లక్ష రూపాయల చెక్కును అందజేసినట్లు జిల్లా పౌర సమాచార శాఖ అధికారులు తెలిపారు. అనంతరం సిద్ధిపేట సమీకృత సముదాయంలోని జిల్లా అదనపు కలెక్టర్ ఛాంబర్ లో జిల్లా అదనపు కలెక్టర్ గరిమా అగ్రవాల్, సీఎం అందించిన చెక్కులను లబ్ధిదారులకు చూపించి వారి చేతుల మీదుగా చెక్కులను పంపిణి చేశారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ గరిమా అగ్రవాల్ ముఖ్యమంత్రి చేతుల మీదుగా చెక్కులు స్వీకరించిన ఇద్దరి లబ్ధిదారులకు శుభాకాంక్షలు తెలిపారు. ఇప్పటివరకు జిల్లాలో ఇందిరమ్మ ఇళ్ల పథకం మొదలైన నాటినుండి ఇప్పటి వరకు 2,667 ఇండ్ల మంజూరు కాగా, మరో 606 మంది లబ్ధిదారులు ఇందిరమ్మ ఇండ్లు ముగ్గు పోయాగ, 156 మంది లబ్ధిదారులు బేస్ మెంట్ లెవెల్ పూర్తి చేశారని, వారందరికీ మొదటి విడతగా ఒక లక్ష రూపాయల చెక్కును అందజేస్తున్నట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా హౌసింగ్ పీడీ దామోదర్ రావు, ఆయా మండల ఎంపీడీవోలు పంచాయతీరాజ్ ఏఈలు తదితరులు పాల్గొన్నారు.

## మరికల్ పోలీస్ స్టేషన్ ను తనిఖీ చేసిన జిల్లా ఎస్పీ




**నారాయణపేట, ఏప్రిల్ 15 (నిఘా న్యూస్):** జిల్లా ఎస్పీ యోగేష్ గౌతమ్ మంగళవారం మరికల్ పోలీస్ స్టేషన్ ను ఆకస్మికంగా తనిఖీ నిర్వహించి పోలీస్ స్టేషన్ పరిసరాలను పరిశీలించారు. పోలీస్ స్టేషన్ పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. అనంతరం పోలీస్ సిబ్బంది నిర్వహిస్తున్న విధుల గురించి అడిగి తెలుసుకున్నారు. ఎవరికైనా ఎలాంటి సమస్యలు ఉంటే నేరుగా ఆఫీస్ లో సంప్రదించవచ్చని తెలిపారు. పోలీస్ స్టేషన్లో పెండింగ్ లో ఉన్న కేసులు, దర్యాప్తు వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. పోలీస్ స్టేషన్ లో రోజువారిగా నమోదవుతున్న ఫిర్యాదులు గురించి అడిగి తెలుసు కున్నారు. పోలీస్ స్టేషన్లో 50 ఇంప్లిమెంటేషన్ చేయాలని చెప్పారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పోలీస్ శాఖ అత్యంత బాధ్యతాయుతమైన వ్యవస్థ అని ప్రతి ఒక్కరు అంకిత భావంతో విధులు నిర్వర్తించాలని సూచించారు. పోలీస్ స్టేషన్కు వచ్చే ఫిర్యాదులను పెండింగ్లో ఉంచకుండా వెంటనే పరిష్కరించి ప్రజల మన్ననలు పొందే విధంగా విధులు నిర్వర్తించాలని తెలిపారు. కోర్టులో నిందితులకు శిక్షలు పడేలా భౌతిక సాక్షంతోపాటు సాంకేతిక పరిజ్ఞానాన్ని జోడించాలని తెలియజేశారు. నిరంతరం అప్రమత్తంగా ఉండాలని తెలియజేశారు. దొంగతనాల నిర్మూలన కోసం నిఘా ఏర్పాటు చేయాలని, ఎటువంటి అసాంఘిక కార్యకలాపాలు పాల్పడకుండా పటిష్టంగా పెట్రోలింగ్ నిర్వహించాలని పేర్కొన్నారు. రహదారి వెంట డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్టులు నిర్వహించి ప్రమాదాలను నివారించడానికి కృషి చేయాలని తెలియజేశారు. ఆర్థిక నేరాలకు కట్టడి చేయడానికి సీసీ టీవీ కెమెరాలు అమర్చే విధంగా ప్రజలకు చైతన్య పరచాలి అని పేర్కొన్నారు. సైబర్ నేరాలపై, 1930 టోల్ ఫ్రీ నెంబర్ పై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. ప్రజలు తీసుకొచ్చే ఫిర్యాదులను తక్షణమే పరిష్కరించాలని పోలీస్ స్టేషన్కు వచ్చే ఫిర్యాదుదారులకు భద్రతా, భరోసా కల్పించే విధంగా పోలీస్ వ్యవస్థ ఉండాలని ప్రజలు ఎటువంటి సమాచారమైనా డయల్ - 100 ద్వారా తెలుపవచ్చు అని సూచించారు. బ్లూ కోట్స్, పెట్రో కార్ సిబ్బంది రాత్రి సమయంలో నిరంతరం పెట్రోలింగ్ నిర్వహించాలని, రౌడీ షీటర్స్, కేడీలు, సస్పెక్ట్ ఇళ్లను తనిఖీ చేయాలని, పాయింట్ బుక్స్ ను తనిఖీ చేయాలని గ్రామాలలో ప్రధాన కూడళ్ల వద్ద విజిబుల్ పోలీసింగ్ ఉండాలని నేరాల నివారణకు ఆకస్మికంగా వాహనాల తనిఖీలు నిర్వహించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఐ రాజేందర్ రెడ్డి, ఎస్ ఐ రాము, పోలీస్ సిబ్బంది మొదలగు వారు పాల్గొన్నారు.

## శ్రీ యజ్ఞ వల్క్య రాజాశ్రమ వార్షికోత్సవం

### హాజరైన భారతీయ ధర్మ పరిషత్ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షులు పాలచర్ల




**జగ్గంపేట, ఏప్రిల్ 15 (నిఘా న్యూస్):** ఏలూరు జిల్లా, పెదవేగి మండలం ముండూరు క్షేత్రంలో గల శ్రీ యజ్ఞ వల్క్య రాజాశ్రమము 67వ వార్షికోత్సవ వేదాంత మహాసభలు ఏప్రిల్ 15, 16, 17 తేదీలలో మూడు రోజులపాటు వైభవంగా నిర్వహిస్తున్నారు. మొదటిరోజు 15వ తేదీ మంగళవారం మహాసభలకు ముఖ్యఅతిథిలుగా జగ్గంపేట నుండి భారతీయ ధర్మ పరిషత్ రాష్ట్ర కార్య నిర్వాహక అధ్యక్షులు పాలచర్ల నాగేంద్ర చౌదరి, భారతీయ జనతా పార్టీ రాష్ట్ర జనరల్ సెక్రెటరీ గారపాటి సీతారామాంజనేయ చౌదరి ముఖ్య అతిథులుగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేయడం జరిగింది. నాగేంద్ర చౌదరిని ఘనంగా సత్కరించిన అభినవ వివేకానంద పూజ్య స్వామీజీ డాక్టర్ కృష్ణ చరణా నంద భారతి స్వాములవారు శ్రీ యజ్ఞ ఫల్క్య రాజా ఆశ్రమ పీఠాధిపతులు, భారతీయ ధర్మ పరిషత్ జాతీయ అధ్యక్షులు, అఖిల భారత సాధు పరిషత్ ప్రధాన కార్యదర్శి, ఈ సందర్భంగా నాగేంద్ర చౌదరి మాట్లాడుతూ ప్రతి ఒక్కరు ధర్మాన్ని పాటించాలని గోవులను పూజించాలని హిందూ ధర్మం ఆచరించాలని దీనికోసం తన వంతు బాధ్యతగా సనాతన ధర్మ ప్రచారం నిర్వహిస్తానని అన్నారు. ఈ కార్యక్రమానికి అధిక సంఖ్యలో రెండు తెలుగు రాష్ట్రాల నుండి ప్రముఖ స్వామీజీలు మఠాధిపతులు, పీఠాధిపతులు అధిక సంఖ్యలో భక్తులు రావడం జరిగింది.

## ఈనెల 20 నుండి శ్రీగంగాలమ్మ జాతర మహోత్సవాలు



**గోకవరం, ఏప్రిల్ 15 (నిఘా న్యూస్):** ఈనెల 20వ తేదీ నుండి రాజమహేంద్రవరం రోడ్డులో వేంచేసియున్న శ్రీగంగాలమ్మ అమ్మవారి జాతర మహోత్సవాలు ప్రారంభం కానున్నట్లు ఆలయ కమిటీ తెలియజేసింది. 20 వ తేదీన గరగలు తీయడం, ప్రత్యేక పూజలు, 21,22 తేదీలలో జాతర జరుపబడునని 23 వ తేదీన అన్న సమారాధన నిర్వహించబడునని ఆలయ కమిటీ తెలిపింది. జాతర మహోత్సవాలకు భక్తులందరు విచ్చేసి తీర్థప్రసాదాలు స్వీకరించి అమ్మవారి కృపకు పాత్రులు కాగలరని ఆలయ కమిటీ సభ్యులు నాగులకొండ శివరామకృష్ణ, ఏనుగ శ్రీనివాసరావు, చిటికల పాండు, సంగుల చక్రరావు, ఎలుగుబంటి చంటిబాబు కోరారు.

## నేటి నుండి బిఎస్ఎన్ఎల్ సర్వీస్ క్యాంపులు




**పలమనేరు, ఏప్రిల్ 15 (నిఘా న్యూస్):** పలమనేరు పట్టణంలో 16వ తేదీన బుధవారం కస్టమర్ మాసం సందర్భంగా బుధవారం నుంచి కస్టమర్ సర్వీస్ క్యాంపులు నిర్వహిస్తున్నది. పలమనేరు డివిజన్ హెడ్ క్యారెక్టర్ క్యాంపు నిర్వహిస్తున్నట్టు బిఎస్ఎన్ఎల్ డి ఈ విజయ్ కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 16వ తేదీ బుధవారం ఉదయం నుండి సాయంకాలం ఐదు గంటల వరకు పలమనేరు డివిజన్ కార్యాలయంలో టెలిఫోన్ ఎక్స్చేంజ్ ప్రాంగణంలో క్యాంపు షెడ్యూల్ సద్వినియోగం కోరారు. పలమనేరు డివిజన్ డి ఈ విజయ్ కుమార్ తెలిపారు.

## ఉప్పర్ పల్లిలో అంబేద్కర్ జయంతి వేడుకలు



**శామీర్ పేట, ఏప్రిల్ 15 (నిఘా న్యూస్):** అంబేద్కర్ జయంతి సందర్భంగా తూంకుంట మున్సిపాలిటీ పరిధి ఉప్పర్ పల్లిలో అంబేద్కర్ విగ్రహానికి బి ఆర్ ఎస్ పార్టీ సినియర్ నాయకుడు గంగాధరి బలరాం పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా అయిన మాట్లాడుతూ భారత రాజ్యాంగ రూపకర్త అంబేద్కర్, ఆశయ సాదనకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని అయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు శ్రీనివాసరెడ్డి, రవీందర్, మోహనకృష్ణ, ప్రదీప్, భాను, హేమంత్, సాయిరామ్, శివ సాయి, నితిన్, మహేష్, సాయిసందీప్, మనోజ్, మణి వేణు తదితరులు పాల్గొన్నారు.

## చికిత్స కోసం మాజీ సర్పంచ్ సాయం



**ధర్మపురి, ఏప్రిల్ 15 (నిఘా న్యూస్):** ధర్మారం మండలం కొత్తూరు గ్రామానికి చెందిన బానోతు చందు నాయక్ కుమారుడు బానోతు రామ్ చరణ్ రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి కరీంనగర్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. నిరుపేద కుటుంబం కావడంతో వారికి కొత్తూరు మాజీ సర్పంచ్ తాళ్ళ మల్లేశం గౌడ్ అండగా నిలిచారు. గాయపడిన రామ్ చరణ్ ఆసుపత్రికి వెళ్లికి పరామర్శి,వైద్య ఖర్చుల కోసం తనవంతుగా ఆర్థిక సాయాన్ని మల్లేశం అందజేశారు. మాజీ సర్పంచ్ కు బాధిత కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

## మీర్జాలగూడలో పేరుకుపోయిన చెత్త చెదారం



**మల్కాజిగిరి, ఏప్రిల్ 15 (నిఘా న్యూస్):** గౌతమ్ నగర్ డివిజన్ పరిధిలోని ఓల్డ్ మీర్జా లగూడలో దర్గా దగ్గర్లో రోడ్డుపైనే చెత్తా చెదారం పేరుకు పోతుంది. ఇక్కడ చెత్త 15 రోజుల నుండి ఇలాగే ఉండటంతో భరించలేని దుర్వాసన వస్తుందని స్థానికులు వాపోతున్నారు. రోజుల తరబడి ప్రధాన రహదారిపై చెత్త పేరుకుపోయి దుర్వాసన వస్తున్నా జీహెచ్ఎంసీ అధికారులు, సిబ్బంది ఎవరూ పట్టించుకోవడం లేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. భరించలేని కంపుతో తాము ఇళ్ళల్లో ఉండలేక పోతున్నామని, బయటకు వెళితే రోగాల బారిన పాడిన పడుతున్నామని స్థానికులు తెలిపారు. ఇకనైనా శానిటేషన్ అధికారులు స్పందించి తమ సిబ్బందిచేత ఈ చెత్తను తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

## రాయల్ కాలనీలో... రోడ్డు నిర్మాణానికి చర్యలు

### కార్పొరేటర్ రాజ్ జితేంద్ర నాథ్



**అల్వాల్, ఏప్రిల్ 15 (నిఘా న్యూస్):** మచ్చబొల్లారం డివిజన్ పరిధిలోని రాయల్ కాలనీలో సీసీ రోడ్డు నిర్మాణానికి చర్యలు తీసుకుంటానని స్థానిక కార్పొరేటర్ రాజ్ జితేంద్ర నాథ్ అన్నారు. మంగళవారం రాయల్ ఎన్ క్లేవ్ రోడ్ నెంబర్ 2 కాలనీ వాసులు కార్పొరేటర్ ను కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా కాలనీ వాసులు మాట్లాడుతూ తమ కాలనీ లోని ఈ రోడ్డుపై గత కొంత కాలంగా నీళ్లు నిలిచి, రోడ్డు గుంతలు పడి అధ్వాన్నంగా మారిందని, సీసీ రోడ్ వేయించాలని కోరారు. దీనికి కార్పొరేటర్ సానుకూలంగా స్పందించారు. త్వరలో ఇంజనీరింగ్ అధికారులతో కలిసి మీ కాలనీలో పర్యటించి ప్రతిపాదనలు తయారు చేసి జీహెచ్ఎంసీ ఉన్నతాధికారులకు పంపి సమస్య పరిష్కారం చేస్తానని హామీ నిచ్చారు.

## బాటసారులకు మజ్జిగ పంపిణీ చేసిన కాంగ్రెస్ నేతలు




**మల్కాజిగిరి, ఏప్రిల్ 15 (నిఘా న్యూస్):** మల్కాజిగిరి చౌరస్తాలో మంగళవారం కాంగ్రెస్ పార్టీ 140 డివిజన్ అధ్యక్షులు జీడి సంపత్ కుమార్ గౌడ్ ఆధ్వర్యంలో బట్టర్ మిల్క్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మైనంపల్లి సోషల్ సర్వీస్ ఆర్గనైజేషన్ సహకారంతో వేసవికాలం సందర్భంగా మల్కాజిగిరి డివిజన్ పరిధిలోని అన్ని ముఖ్యమైన ప్రాంతాలలో తాను నెల రోజులపాటు ప్రజలకు ఆరోగ్యకరమైన బట్టర్ మిల్క్ పంపిణీ కార్యక్రమం చేపడుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు గౌసుద్దీన్ భాయ్,మొర శ్రీకాంత్ ముదిరాజ్,మల్లేష్ గౌడ్,శ్రీశైలం ముదిరాజ్, రాజు, మురళి,అరుణ్,కార్తీక్,కిషోర్,ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు

## సీఎం సహాయనిధి అందజేసిన నేతలు



**ధర్మోర, ఏప్రిల్ 15 (నిఘా న్యూస్):** ప్రజలకు అత్యవసరమైన విద్యా, వైద్యసేవల్లో రాజకీయాలు చేయమని,అర్హులైన నిరుపేదలందరి ప్రభుత్వం అందించే పథకాలు తప్పనిసరిగా అందచేస్తామని ముథోల్ శాసనసభ్యులు ఎమ్మెల్యే పవర్ రామారావు పటేల్ ఆదేశాల అనుసారంగా సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు గీజ భూమవ్వ 24 వేలు, మొండోలా చిన్న మోహన్ 24 వేల రూపాయలు అందజేయడం జరిగింది అన్నారు. లబ్ధిదారులులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందచేశారు. ఈ సందర్బంగా బిజెపి నాయకులు మంద భాస్కర్ మాట్లాడుతూ గత పాలకులు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల మంజూరు విషయంలో రాజకీయాలు చేశారని,కొన్ని చెక్కులు మంజూరు అయినా నేటికి లబ్ధిదారులకు అందలేదన్నారు. పేదప్రజలకు అందించే పథకాల విషయంలో రాజకీయాలు చేసే బ్రతికే జీవితం వ్యర్థమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సునీల్ రెడ్డి,సంజీవరెడ్డి, మేకల సాయందర్, అనిల్ కుమార్, సాయ గౌడ్, బిజెపి సీనియర్ నాయకులు నాయకులు కార్యకర్తలు,తదితరులు ఉన్నారు.

## రైతు కుటుంబాన్ని పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే



**కుంటాల, ఏప్రిల్ 15 (నిఘా న్యూస్):** మండలంలోని లింబ కే గ్రామానికి చెందిన గంగాధర్ పటేల్ మొక్కజొన్న పంట ప్రమాదవశాత్తు సోమవారం అగ్నిప్రమాదంతో కాలి పోవడంతో మంగళవారం ముధోల్ మాజీ ఎమ్మెల్యే గడ్డిగారి విఠల్ రెడ్డి బాధిత రైతు గంగాధర్ పటేల్ ను పరామర్శించారు. ఈ సందర్భంగా అన్ని ప్రమాదానికి గల కారణాలను బాధిత రైతులు అడిగి తెలుసుకున్నారు. ఉన్నంత అధికారులతో మాట్లాడి న్యాయం చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు కే. బుచ్చన్న మాజీ ఆత్మ చైర్మన్ అశోక్ రెడ్డి సాగర్ రావు బి రమణ గౌడ్ ప్రవీణ్ కుమార్ ఆనంద్ రావు పటేల్ సునంద సత్యం గిరీష్ కాంగ్రెస్ పార్టీ నాయకుల తదితరులు పాల్గొన్నారు.

## నేడు పెదకూర పాడులో ప్రజా దర్బార్



**పెదకూరపాడు, ఏప్రిల్ 15 (నిఘా న్యూస్):** పెదకూరపాడు నియోజకవర్గం ప్రజాదర్బాం (గ్రీవెన్స్) కార్యక్రమంలో భాగంగా ప్రజా సమస్యల సత్వర పరిష్కారం కొరకు నియోజవర్గ శాసనసభ్యులు భాష్యం ప్రవీణ్ పెదకూరపాడు పంచాయతీరాజ్ గెస్ట్ హౌస్ నందు బుధవారం ప్రజాదర్బార్ నిర్వహిస్తామని. ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు నిర్వహిస్తామని తెలిపారు. కావున నియోజకవర్గం లోని అన్ని గ్రామాల ప్రజలు మీ సమస్యలు విన్నవించుకొని పరిష్కరించుకోవలసిందిగా తెలిపారు.

## పోలీస్ కంప్లైంట్స్ అథారిటీ సభ్యులుగా డా.వర్రె నియామకం పట్ల హర్షం



**మోత్కూరు, ఏప్రిల్ 15 (నిఘా న్యూస్):** తెలంగాణ రాష్ట్ర పోలీస్ కంప్లైంట్స్ అథారిటీ మెంబర్ గా డా.వర్రె వెంకటేశ్వర్లు నియామకం పట్ల తెలంగాణ గ్రంథాలయ వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోమటి మత్స్యగిరి హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్ సమాచార ప్రధాన కమిషనర్ గా డా.వర్రె వెంకటేశ్వర్లు తనదైన ప్రత్యేక ముద్రను వేశారన్నారని,తెలంగాణ రాష్ట్ర పోలీస్ కంప్లైంట్స్ అథారిటీకి కూడా వన్నె తెస్తారనడంలో ఎలాంటి సందేహం లేదన్నారు. ఈ కార్యక్రమంలో సమాచార హక్కు చైతన్య సమితి ప్రతినిధులు కందుల విక్రాంత్,దొంతొజు అశోక్,మోతె నవీన్ రెడ్డి, ఆరాని శేఖర్, కోమటి జనార్ధన్,అజయ్,సందీప్, రాజు,అనిల్ తదితరులు హర్షం వ్యక్తం చేశారు.

## అర్హులైన వారికి రేషన్ కార్డులు మంజూరు



**గన్నేరువరం, ఏప్రిల్ 15 (నిఘా న్యూస్):** గన్నేరువరం మండల కేంద్రంలో రాష్ట్ర ప్రభుత్వం తలపెట్టి నటువంటి కొత్త రేషన్ కొత్త రేషన్ కార్డు పేర్లను ఏ ఎస్ ఓ బుచ్చిబాబు, డి టి సురేందర్,ఆర్ ఐ రజినీకాంత్ కార్డులు పరిశీలించి ఎవరైతే అర్హులు ఉన్నారో, వారికి రేషన్ కార్డులు మంజూరు చేయడానికి పరిశీలిస్తున్నారు. ఇట్టి కార్యక్రమంలో ఏఎస్ఓ బుచ్చిబాబు. డిటిసిఎస్ సురేందర్. ఆర్ ఐ రజనీకాంత్ రెడ్డి గ్రామ పంచాయతీ కార్యదర్శి వెంకటరెడ్డి, గ్రామ కారోబార్ మాధవరావు జూనియర్ అసిస్టెంట్ ఎల్ సప్న తదితరులు పాల్గొన్నారు.

## బిఆర్ఎస్ సభను జయప్రదం చేయండి

### మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరావు




**దమ్మపేట, ఏప్రిల్ 15 (నిఘా న్యూస్):** దమ్మపేట మండలం పార్కెలగండి వద్ద మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరావు ఆధ్వర్యంలో అశ్వారావుపేట నియోజకవర్గ స్థాయి కార్యకర్తల సమావేశం ఏర్పాటుచేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బిఆర్ఎస్ అధ్యక్షుడు మాజీ ఎమ్మెల్యే రేగ కాంతారావు, రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర, గ్రంథాలయ కమిటీ చైర్మన్ దిండిగల రాజేంద్రర్ హాజరైయ్యారు. మాజీ ఎమ్మెల్యే మెచ్చా మాట్లాడుతూ ఏప్రిల్ 27 న వరంగల్లో జరగబోయే రాజతోత్సవ భారీ బహిరంగ సభకు అశ్వారావుపేట నియోజకవర్గం నుండి వేయి మందిని తరలించేందుకు ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. సమావేశం అనంతరం రాజతోత్సవ భారీ బహిరంగ సభ వాల్ పోస్టర్ను రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర, జిల్లా అధ్యక్షులు రేగ కాంతారావు, దిండిగల్ రాజేంద్ర, మాజీ ఎమ్మెల్యే మెచ్చ నాగేశ్వరరావు, పార్టీ నాయకులతో కలిసి ఆవిష్కరించారు, ఈ కార్యక్రమంలో ఐదు మండలాల పార్టీ అధ్యక్షులు, ముఖ్య నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# అర్హులైన పేదలకే ఇందిరమ్మ ఇండ్లు కేటాయించాలి

### జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు




**సంగారెడ్డి, ఏప్రిల్ 15 (నిఘా న్యూస్):** అర్హులైన పేదలకు ఇందిరమ్మ ఇండ్లు కేటాయించాలని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో పంచాయతీరాజ్ అధికారులు,గృహ నిర్మాణ శాఖ అధికారులు, మునిసిపల్ అధికారులతో కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు అర్హులైన లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇండ్లు కేటాయించాలని, జిల్లాలో వేసవిలో త్రాగునీటి ఇబ్బంది ఎత్తకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు మాట్లాడుతూ అర్హతల పేదవారికి ఇందిరమ్మ ఇండ్లు కేటాయించాలని ఈ నెల 18 నుంచి 21 వరకు లబ్ధిదారులను గుర్తించాలన్నారు. స్థానిక ఇందిరమ్మ కమిటీ సభ్యులు, గ్రామా, మండల ప్రత్యేక అధికారుల సమన్వయంతో ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులను గుర్తించాలన్నారు. ఇప్పటికే జిల్లాలో పైలెట్ ప్రాజెక్టుగా చేసిన గ్రామాలు కాకుండా జిల్లా వ్యాప్తంగా లబ్ధిదారుల గుర్తింపు కావాలని తెలిపారు. ఈ నెల 17 నుంచి లబ్ధిదారులు దరఖాస్తు చేసుకున్న లిస్టును అధికారులకు అందిస్తామన్నారు. దరఖాస్తు చేసుకున్న దానిలో అర్హత గల వారిని గుర్తించాలన్నారు. లబ్ధిదారులకు లిస్టును మే 2 తారీఖున డిస్ ప్లే చేస్తామన్నారు. నియోజవర్గానికి 3,500 ఇండ్లు తోపాటు 20 శాతం అదనంగా జనాభా ప్రాతిపదికన ప్రభుత్వం కేటాయించిందన్నారు. వేసవిలో తాగునీటి అధికారులు పటిష్టమైన చర్యలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, జిల్లా పరిషత్ సీఈవో జానకి రెడ్డి, జిల్లా పంచాయతీ అధికారి సాయిబాబా, పిడి హౌసింగ్ చలపతిరావు, అడిషనల్ డి ఆర్ డి ఓ బాలరాజు, ఎంపీడీవోలు ఎంపీడీవోలు మున్సిపల్ కమిషనర్లు, సంబంధిత అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# పంచాయతీ కార్మికుల బకాయిలు చెల్లించండి: సిఐటియు



**వలిగొండ, ఏప్రిల్ 15 (నిఘా న్యూస్):** వలిగొండ మండల కేంద్రం గ్రామపంచాయతీ కార్మికులకు పెండింగ్లో ఉన్న వేతనాలు వెంటనే విడుదల చేసి కార్మికులని ఆదుకోవాలని సిఐటి యు జిల్లా సహాయ కార్యదర్శి తుర్కపల్లి సురేందర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం వలిగొండలో గ్రామపంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ వలిగొండ మండల కమిటీ సమావేశం మండల అధ్యక్షుడు కొండ నరసింహ అధ్యక్షతన నిర్వహించగా ఈ సందర్భంగా సురేందర్ మాట్లాడుతూ మల్టీ పర్పస్ కార్మికులు కాకుండా ఇతర కార్మికులకు గత తొమ్మిది నెలల నుండి వేతనాలు రాక కార్మికులు ఇబ్బంది పడుతున్నారని పంచాయతీ కార్యదర్శులు కార్మికుల వేతనాలు చెక్కులు కొట్టి ట్రెజర్లు వేసిన చెక్కులు డ్రా కాక ఇబ్బంది పడుతున్నారని వెంటనే ప్రభుత్వం విడుదల చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం రాక ముందుకు గ్రామపంచాయతీ కార్మికులని ప్రభుత్వ ఉద్యోగులకు ఇచ్చే పద్ధతిలో ఒకటవ తేదీనే బ్యాంకు ద్వారా వేతనాలు ఇస్తానమ ని చెప్పి మాట మార్చిందని పి ఆర్ సి అమలు చేస్తానని మోసంచేసిందని విమర్శించారు. ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయాలని ఎంపీడీవో కు సమ్మె నోటీసు ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ మండల నాయకులు, ఎడవెల్లి ఎల్లమయ్య, రాములు మధు, రాజు, లింగస్వామి, మూర్తి, సాయిలు, శీను, సత్తయ్య, తదితరులు పాల్గొన్నారు.

# ఇన్ఫర్మేషన్ వ్యవస్థను మెరుగు పరచుకోవాలి



### డయల్ 100 కాల్స్ కు వెంటనే స్పందించి సమస్య పరిష్కరించాలి

**ముస్తాబాద్, ఏప్రిల్ 15 (నిఘా న్యూస్):** రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట్,ముస్తాబాద్ మండలాల పోలీస్ స్టేషన్లు,నర్మాల డ్యాం ను జిల్లా ఎస్పీ మహేష్ బిగితే సందర్శించారు. పోలీస్ స్టేషన్ల ఆవరణలో 5ఎస్ అమలు తీరు,విధులు నిర్వహిస్తున్న సిబ్బంది వివరాలు అడిగి తెలుసుకుని,రికార్డ్ రూమ్, రైటర్ రూమ్ తదితర అన్ని విభాగాలు క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం స్టేషన్ పరిధిలో పెండింగ్ లో ఉన్న కేసులు,నమోదు అవుతున్న కేసుల వివరాలు,శాంతిభద్రతల పరిరక్షణకు తీసుకుంటున్న చర్యలపై అధికారులను అడిగి తెలుసుకొని,పెండింగ్ కేసులపై రివ్యూ చేశారు. అనంతరం ఎస్పి మాట్లాడుతూ ప్రజలకు మరింత చేరువయ్యే విధంగా పోలీస్ విధులు ఉండాలని,పోలీస్ అధికారులు, సిబ్బంది స్టేషన్ పరిధిలోని గ్రామాలు, వార్డులు పర్యటిస్తూ ఇన్ఫర్మేషన్ వ్యవస్థ పటిష్టం చేయాలని అధికారులకు సూచించారు. డయల్ 100 కాల్స్ కి వెంటనే స్పందించి బ్లూ కోల్ట్, పెట్రో కార్ సిబ్బంది, అధికారులు సంఘటన స్థలానికి చేరుకొని సమస్యలు పరిష్కరించాలని,పెట్రోలింగ్ సమయంలో స్టేషన్ పరిధిలోని చట్ట వ్యతిరేకమైన కార్యక్రమాలు నిర్వహించే వారిపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలన్నారు. రౌడి షీటర్స్,హిస్టరీ షీటర్స్,అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిపై నిఘా కఠినతరం చేయాలన్నారు. అసాంఘిక కార్యకలాపాలు అయిన గంజాయి అక్రమ ఇసుక రవాణా పిడిఎస్ రైస్ అక్రమ రవాణాపై ఉక్కుపాదం మోపాలన్నారు. పోలీస్ స్టేషన్ పరిధిలో గంజాయి డ్రగ్స్ ఇతర మత్తు పదార్థాలపై నిఘా పటిష్టం చేస్తూ గంజాయి నివారణకు పకడ్బందీగా చర్యలు చెపడుతూ,గంజాయి వలన కలిగే అనర్ధాలపై అవగాహన కార్యక్రమాలు చేపట్టాలన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకు స్టేషన్ పరిధిలో వాహనాల తనిఖీలు,డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు చేయాలన్నారు. ఎస్పీ వెంట డిఎస్పీ చంద్రశేఖర్ రెడ్డి, సి.ఐ లు శ్రీనివాస్,మొగిలి, ఎస్.ఐ ప్రేమానందం సిబ్బంది తదితరులు ఉన్నారు.

# ఆయుష్ ఆధ్వర్యంలో పోషన్ పఖ్వాడ




**బెల్లంకొండ, ఏప్రిల్ 15 (నిఘా న్యూస్):** మండల కేంద్రంలో ఓసి అంగన్వాడి సెంటర్ నందు డాక్టర్. ఆర్. శ్రీనివాస్ ఆయుష్ వైద్య అధికారి, పరిమళ సూపర్వైజర్ లు ఆధ్వర్యంలో పోషణ పఖ్వాడా పౌష్టికాహార పక్షోత్సవాలు భాగంగా చిన్న పిల్లలకు, గర్భిణీ స్త్రీలకు, బాలింతలకు పోషకాహారం లోపం పైన అవగాహన సదస్సు, వైద్య శిబిరం నిర్వహించడం జరిగింది. డాక్టర్ ఆర్. శ్రీనివాస్. మాట్లాడుతూ చిన్నపిల్లలను బాలింతలు గర్భిణీ స్త్రీలు వృద్ధులు దీర్ఘకాలిక వ్యాధులు ఉన్నవారు. ఈ వేసవి కాలంలో జాగ్రత్తలు పాటించాలి. వ్యక్తిగత పరిశుభ్రత పరిసరాల పరిశుభ్రత పాటించవలెను. తృణధాన్యాలు ఆకుకూరలు పండ్లు ఈ సీజన్లో దొరికే ఆహార పదార్థాలు ఎక్కువగా తీసుకోవాలి మంచినీరు కూడా ఎక్కువగా తాగాలి మజ్జిగ గంజి రాగి జావా ఎక్కువగా తీసుకోవలెను చిన్న పిల్లలకు బాలామృతం ఇవ్వవలెను. కొబ్బరి నీరు త్రాగవలెను. నిమ్మకాయ రసంలో చిటికెడు ఉప్పు కొంచెం పటికబెల్లం వేసుకొని కలిపి త్రాగవలెను. బాలింతలు గర్భిణీ స్త్రీలు పౌష్టికాహారం తప్పకుండా తీసుకొనవలెను అంగన్వాడి సెంటర్ నందు ఇచ్చే ఆహారం తప్పకుండా తీసుకొనవలెను. గర్భిణీ స్త్రీలకు వెయ్యి రోజుల ప్రాముఖ్యత గురించి తెలియపరచి బాలింతలను గర్భిణీ స్త్రీలకు వైద్య పరీక్షలు నిర్వహించి వడదెబ్బ నివారణ జాగ్రత్తల గురించి తెలియపరిచి వ్యాధి నిరోధక శక్తిని పెంచడానికి ఆయుష్ మందులను పంపిణీ చేయడం జరిగినది. అంగన్వాడి టీచర్ ఆయేషా సూపర్వైజర్ పరిమళ ఆయుష్ సిబ్బంది వెంకటరామయ్య యోగా టీచర్ కోటేశ్వరమ్మ విద్యార్థిని విద్యార్థులకు గర్భిణీ స్త్రీలకు బాలింతలకు యోగ చేయించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు అంగన్వాడీ టీచర్లు తల్లితండ్రులు తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ శివ్వంపేట పోచమ్మ మైసమ్మ జాతరకు ఏర్పాట్లు



**మేడ్చల్, ఏప్రిల్ 15 (నిఘా న్యూస్):** మేడ్చల్ మున్సిపాలిటీ పూడూరు గ్రామంలో వచ్చేనెల మేలో జరిగే శ్రీ శివ్వంపేట పోచమ్మ-మైసమ్మ జాతరకు సంబంధించిన ఏర్పాట్లు చేయాలని కోరుతూ మంగళవారం గ్రామస్తులు మున్సిపల్ కమిషనర్ నాగిరెడ్డి,ఇంచార్జి తహసిల్దార్ సునీల్ కుమార్ లకు ఆహ్వాన పత్రిక అందజేశారు. అదేవిధంగా గ్రామంలోని పలు సమస్యలను పరిష్కరించాలని కోరినట్లు తెలిపారు. గ్రామస్తుల సూచన మేరకు మున్సిపల్ కమిషనర్ నాగిరెడ్డి పూడూరు గ్రామంలో పర్యటించి పలు సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా గ్రామస్తులు గ్రామంలోని పలు సమస్యలను మున్సిపల్ కమిషనర్ దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ సింగరేణి పోచయ్య, మాజీ వార్డు సభ్యులు కోలా వెంకటేష్,బక్క శేఖర్,మల్లెల కృష్ణ,తాళ్ళ జనార్ధన్ రెడ్డి,గ్రామస్తులు పుట్నల నర్సింహ,శేఖర్ రెడ్డి,లక్ష్మణ్,డప్పు కృష్ణ,బిక్షపతి,దేవక వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఆలయంలో హుండీ చోరీకి యత్నం



**అశ్వారావుపేట, ఏప్రిల్ 15 (నిఘా న్యూస్):** అశ్వారావుపేట మండలం లోని వినాయ కపురంలో ఉన్న చిలకలగండి ముత్యాలమ్మ అమ్మవారి ఆలయంలో చోరీ మంగళవారం చోరీ ఘటన వెలుగు చూసింది. సోమవారం అర్ధరాత్రి గుర్తు తెలియని దుండగులు హుండీని గుడి వెనక భాగంలోకి తీసుకెళ్లి పగలగొట్టేందుకు యత్నించినా, సాధ్యం కాకపోవడంతో అక్కడే వదిలేసి వెళ్లారు. నగదు ఏమి పోలేదని ఆలయ ఛైర్మన్ నరాల శ్రీనివాసరావు తెలిపారు.

## బిఆర్ఎస్ రజతోత్సవ సభను విజయవంతం చేయాలి

### ఏమ్మెల్యే చింతా ప్రభాకర్



**సంగారెడ్డి, ఏప్రిల్ 15 (నిఘా న్యూస్):** హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి లో ఈ నెల 27వ తేదీన జరిగే రజతోత్సవ భారీ బహిరంగ సభకు సంగారెడ్డి నియోజకవర్గం నుంచి గులాబీ దండు వేలాదిగా కదం తొక్కలని ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ పిలుపునిచ్చారు. సదాశివపేట పట్టణ బిఅర్ఎస్ పార్టీ ముఖ్య నేతలతో సమావేశం నిర్వహించారు. కేసీఆర్ బహిరంగ సభ సమయ సందర్భాన్ని వివరించారు. ప్రతి వార్డు నుంచి కుల సంఘాల నాయకులు పార్టీ నాయకులు కార్యకర్తలు అధిక సంఖ్య లో పాల్గొనాలని సూచించారు. బహిరంగ సభ సందర్భంగా ఒక రోజు ముందు ప్రతి వార్డులో జెండా ఆవిష్కరణ చేయాలన్నారు. కేసీఆర్ బహిరంగ సమావేశం పై దేశ రాజకీయంలో చర్చ జరుగుతుందని తెలిపారు. అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలు నెరవేర్చకుండా ప్రజలను మోసం చేస్తుందని తెలిపారు. రాష్టంలో ఎన్నికలు ఎప్పుడూ వచ్చిన బి అర్ ఎస్ పార్టీని ఆశీర్వదించడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు.

## సమస్యల పరిష్కారమే ప్రధాన ధ్యేయం

### బీజేపీ ఇంచార్జి తోకల శ్రీనివాస్ రెడ్డి



**రాజేంద్రనగర్, ఏప్రిల్ 15 (నిఘా న్యూస్):** మైలార్దేవపల్లి డివిజన్ ప్రజల సమస్యల పరిష్కారమే ప్రధాన ధ్యేయమని రాజేంద్రనగర్ నియోజకవర్గం బిజెపి ఇంచార్జి తోకల శ్రీనివాస్ రెడ్డి అన్నారు. డివిజన్ పరిధిలోని ఆర్జికే లక్ష్మీగూడ,దుర్గా నగర్ కాలనీలో స్థానికుల విజ్ఞప్తి మేరకు అధికారులతో కలసి పర్యటించారు. బస్తీ లో నెలకొన్న సమస్యలను అక్కడి నివాసతులను అడిగి తెలుసుకున్నారు. భూగర్భ డ్రైనేజీ వ్యవస్థ,అర్జీకే బ్లాక్ ప్రహరీ గోడ నిర్మాణ పనుల దెబ్బతిన్న వాటిని తోకల శ్రీనివాస్ దృష్టికి తెచ్చారు. ఎప్పటికప్పుడు ప్రజలు పడుతున్న సమస్యలను కనుగొని వాటికి పరిష్కారం చూపాల్సిన ఆయా శాఖల అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. చిన్న చిన్న సమస్యలను కూడ అధికారులు పరిష్కరించక పోతే ఎలా అని నిలదీశారు. ఎప్పటికప్పుడు ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలకు పరిష్కారం చూపాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జలమండలి మేనేజర్ రేణుక, జిహెచ్ఎంసి వర్క్ ఇన్స్పెక్టర్ రాహుల్ డివిజన్ ప్రెసిడెంట్ అడికి జనార్ధన్ బబ్లు మన్మోహన్ రెడ్డి సచిన్ శ్రావణ్ పాండు యాదవ్ పూజ నందిని శంకర్ రెడ్డి శేఖర్ రాకేష్ శానిటేషన్ ఎస్ఎఫ్ఐ సిబ్బంది స్థానికులు పాల్గొన్నారు.

## వరంగల్ సభకు లక్షలాదిగా తరలి రావాలి



**రాజేంద్రనగర్, ఏప్రిల్ 15 (నిఘా న్యూస్):** ఈనెల 27న వరంగల్ లో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న భారత రాష్ట్ర సమితి రజతోత్సవ బహిరంగ సభకు లక్షలాదిగా బిఆర్ఎస్ పార్టీ శ్రేణులు కార్యకర్తలు అభిమానులు స్వచ్ఛందంగా తరలి రావాలని రాజేంద్రనగర్ నియోజకవర్గం బిఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ పట్లోళ్ల కార్తీక్ రెడ్డి అన్నారు. బిఆర్ఎస్ ముఖ్య నాయకుల సమావేశం మైలార్దేవపల్లి డివిజన్ అధ్యక్షుడు మాజీ కౌన్సిలర్ ఎస్.వెంకటేష్ నివాసంలో జరిగింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా పట్లోళ్ళ కార్తీక్ రెడ్డి హాజరై పార్టీ ముఖ్య నేతలను ఉద్దేశించి ప్రసంగించారు. 15 నెలల లోనే ప్రజల్లో కాంగ్రెస్ ప్రభుత్వం పై తీవ్ర వ్యతిరేకత నెలకొందన్నారు. ఎన్నికలప్పుడు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలం చెందిందన్నారు.రాష్ట్రంలో ఎప్పుడు ఎన్నికలు వచ్చినా మళ్లీ గులాబీ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని అన్నారు.ఈ కార్యక్రమంలో మైలార్దేవపల్లి డివిజన్ అధ్యక్షులు ఎస్.వెంకటేష్,మాజీ కౌన్సిలర్ ఎన్.రాము యాదవ్,రమేష్ ముదిరాజ్,లక్ష్మీరాజ్,రఘు,బండరాజేష్ యాదవ్,సోమ శ్రీనివాస్ గుప్తా, సరిత,భూదేవి అరుణరెడ్డి, పుష్పమ్మ,మమత, తదితరులు పాల్గొన్నారు.

## ఛలో వరంగల్ సభను విజయవంతం చేద్దాం

### మండల అధ్యక్షుడు సురేందర్ రావు



**ముస్తాబాద్, ఏప్రిల్ 15 (నిఘా న్యూస్):** వరంగల్ నగరంలో బీఆర్ఎస్ పార్టీ రజతోత్సవ మహాసభను విజయవంతం చేయడానికి జన సమీకరణ విషయంపై ముస్తాబాద్ మండల కేంద్రంలోని బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో మండల అధ్యక్షుడు బొంపల్లి సురేందర్ రావు ఆధ్వర్యంలో ప్రెస్ మీట్ నిర్వహించారు. ప్రతి కార్యకర్త సభను విజయవంతం చేయడానికి జనాన్ని సమీకరించే దిశగా పనిచేయాలని అధ్యక్షుడు సూచించారు. అలాగే గురువారం మాజీ ఎంపీపీ జనగామ శరత్ రావు నివాసంలో బీఆర్ఎస్ పార్టీ రజతోత్సవ సభకు సంబంధించిన విషయాలు చర్చించడానికి సన్నాహక సమావేశం కలదు.కావున అన్ని గ్రామల నుండి గ్రామ శాఖ అధ్యక్షులు, మాజీ ప్రజా ప్రతినిధులు,పార్టీ నాయకులు యువజన,విద్యార్థి విభాగం, మహిళా విభాగం అందరూ పాల్గొనవలసిందిగా సురేందర్ రావు కోరారు.ఈ కార్యక్రమంలో సెస్ డైరెక్టర్ సందుపట్ల అంజిరెడ్డి, మాజీ జిల్లా కో-అప్షన్ మెంబర్ సర్వర్ పాషా,పార్టీ పట్టణ అధ్యక్షుడు ఏర్దండి నర్సింహా రెడ్డి, నాయకులు చెవుల మల్లేశం, మండల యువత అధ్యక్షుడు శీలం స్వామి, మాజీ మండల కో అప్షన్ మెంబర్ అన్వర్, ముస్తాబాద్ పట్టణ మహిళా అధ్యక్షురాలు మెంగని బాల్ లక్ష్మి, నాయకురాలు,మెంగని స్వర్ణలత, నాయకులు గుండెల్లి రాములు తదితరులు పాల్గొన్నారు.

## మామ నాన్న ఫౌండేషన్ ఆధ్వర్యంలో అన్న దానం

### మా అమ్మ నాన్న ఫౌండేషన్ చైర్మన్ ఏం ఆంజనేయులు



**లోకేశ్వరం, ఏప్రిల్ 15 (నిఘా న్యూస్):** మండలం ధర్మోరా గ్రామానికి చెందిన ఎం ఆంజనేయులు నియోజకవర్గంలో కాకుండా వివిధ జిల్లాలో కూడా ఏలలేని సేవలు అందిస్తున్నారు. కన్న తల్లి తల్లి పట్టించుకోని ఈ రోజుల్లో ఇలాంటి సేవా కార్యక్రమాలతో ముందుకు సాగుతున్న మా అమ్మ నాన్న ఫౌండేషన్ ఆంజనేయులుకు నియోజకవర్గంలో పలువురు అభినందనలు తెలుపుతున్నారు. ఇలాంటి సేవా కార్యక్రమాలు కొనసాగించి అభినందించారు. మండలంలోని కాండ్లీ గ్రామంలో ఒక మహోన్నత కార్యక్రమంలో మిగిలిపోయిన అన్నం,పప్పు,వంకాయ, జిలేబిని ఫుడ్ బ్యాంక్ బైంసా వ్యవస్థాపకులు ఆంజనేయులు ఫుడ్ బ్యాంక్ వాహనంలో రెండుసార్లు వెళ్లి ఆహార పదార్థాలను సేకరించి అట్టి ఆహార పదార్థాలను లోకేశ్వరం మండలం లక్ష్మీ నగర్ కు చెందిన దాదాపు 240 మంది నిరుపేదలకు అన్నదానం చేయడం జరిగింది. అన్నదానాన్ని స్వీకరించిన ఆ పేదవాళ్లు వేడివేడిగా చాలా రుచికరంగా ఉన్నాయని ఎంతో సంతోషాన్ని వ్యక్తపరచడం జరిగింది.ఈ విధంగా ఎక్కడైనా ఆహార పదార్థాలు మిగిలిపోతే సాయంత్రం నాలుగు గంటల లోపు 9912267973 నంబర్కు సమాచారమిచ్చినట్లయితే అట్టి ఆహార పదార్థాలను సేకరించి ఇలాంటి నిరుపేదల ఆకలి తీర్చడం జరుగుతుందని ఆంజనేయులు తెలిపారు.

# ఇకనైనా అసత్య ప్రచారాలకు భూమన స్వస్తి పలుకు



**తిరుపతి, ఏప్రిల్ 15 (నిఘా న్యూస్):** ప్రపంచ ప్రసిద్ధిగాంచిన తిరుమల తిరుపతి దేవస్థానం ప్రతిష్టపాలు చేసేందుకు మాజీ టీటీడీ చైర్మన్, భూమన కరుణాకర్ రెడ్డి అసత్య ప్రచారాలు చేస్తూ వ్యవహరిస్తున్నారని ఇకనైనా వ్యవహార శైలి మానుకోవాలని లేని పక్షంలో భగవంతుడు తన నిఘానేత్రంతో తగిన గుణపాఠం నేర్పుతారని తెలుగుదేశం పార్టీ తిరుపతి పార్లమెంటరీ నియోజకవర్గ అధ్యక్షులు గొల్ల నరసింహ యాదవ్ హెచ్చరించారు. తిరుపతి ప్రెస్ క్లబ్ లో మంగళవారం సాయం జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. హిందువులు పూజించే పవిత్రమైన గోమాతపై అసత్యపు ప్రచారాలు చేయడం తగదన్నారు. గత ఐదేళ్లలో సుబ్బారెడ్డి ధర్మారెడ్డి చైర్మన్ గా ఉన్నప్పుడు హరినాద్ రెడ్డిని పరిరక్షణ అధికారిగా నియమించుకొని కోట్లాది రూపాయలు కుంభకోణం చేశారని ఆరోపించారు. పలమనేరు లోను తిరుపతి టీటీడీ ఎస్వీ గోశాలలను అనేక కుంభకాణాలు జరిగాయన్నారు. మూగజీవాలు తినే ఆహారంలో కూడా కమిషన్లు తీసుకున్న ఘనత మీదేనన్నారు. ఎన్డీఏ కూటమి అధికారుల్లోకి వచ్చి ఆరు నెలలు కాలంలోనే టీటీడీ పైన ఎన్డీఏ కూటమి పైన లేనిపోని విమర్శలు చేయడం తగదన్నారు. మీ హయంలో ఎస్వీ గోశాలలో దానా కుంభకోణం నాణ్యతలేని మందులు సరఫరా చేసి గోమరణాలకు కారణమయ్యారని తెలిపారు. ప్రతి విషయాన్ని రాజకీయ లబ్ధి కోసం వాడుకోవడం తగదన్నారు ప్రస్తుత టిడిపి పాలన, కూటమి ప్రభుత్వ పాలన రాజ్యాంగ బద్ధంగా లేదని రెడ్ బుక్ ప్రకారం జరుగుతుందని విమర్శించడం ఏమిటని ఆయన ప్రశ్నించారు. మీ హయాంలో కేవలం ముఖ్యమంత్రి టిటిడి అధికారులు అందరూ ఒకే సామాజిక వర్గానికి చెందిన వారిని ఎనిమిచ్చుకున్నారని అయితే ప్రస్తుత ముఖ్యమంత్రి అన్ని కులాలకు చెందిన వారిని అందరికీ అవకాశం ఇస్తున్నారని తెలిపారు పరిశుద్ధ చైర్మన్ బిఆర్ నాయుడు భక్తులకు పారదర్శకంగా పాలన అందిస్తున్నారని దర్శనాల విషయంలోనూ లడ్డూల విషయంలోనూ ప్రతిదీ భక్తులకు అనుకూలంగా వ్యవహరిస్తున్నారని ఆయన్ని కూడా విమర్శించడం తగదన్నారు. కరుణాకర్ రెడ్డి టిటిడిలో జరుగుతున్న విషయాలపై పదేపదే అసత్యపు ఆరోపణలు చేస్తూ కోట్లాది శ్రీవారి భక్తుల మనోభావాలను దెబ్బ తీస్తున్నారని ఆయన మండిపడ్డారు. మీరు చేసిన అక్రమాలపై విచారం చేపట్టి దోషలను కఠినంగా శిక్షించడం జరుగుతుందన్నారు. యాదవులకు గోవు ప్రధానమైన జంతువు అని అలాంటి గో మాతపై అసత్యపు ప్రచారాలు చేయడం దేశవ్యాప్తంగా యాదవుల మనోభావాలను దెబ్బతీస్తున్నారని దీనికి తగిన మూల్యం చెల్లించుకోక తప్పదు అన్నారు. కరుణాకర్ రెడ్డి ఇకనైనా అసత్యాలు మానుకొని అభివృద్ధికి సలహాలు ఇచ్చి టీటీడీ ప్రతిష్టను కాపాడమని ఆయన హితవు పలికారు. అనంతరం నగరపాలక డిప్యూటీ మేయర్ ఆర్ సి మునికృష్ణ మాట్లాడుతూ కరుణాకర్ రెడ్డి బహిరంగ క్షమాపణ చెప్పాలని ఆయన నిలదీశారు. మీడియా సమావేశంలో కర్ణాకర్ రెడ్డి మాట్లాడుతూ నాకు టిటిడిలో రెండువేల మంది శ్రేయోభిలాషులు నిఘా నేత్రాలు ఉన్నాయని చెప్పడం పై టిటిడి ఉద్యోగులలో ఏ ఒక్కరు స్పందించక పోవడం విస్మయం కలిగిస్తుంది అన్నారు టీటీడీ లో పనిచేస్తున్న పదివేల మంది ఉద్యోగులు ఏ ఉద్యోగి కరుణాకర్ రెడ్డి మాటలపై స్పందించకపోవడం ఏమిటి అని ఆయన ఉద్యోగస్తులను ప్రశ్నించారు. టీటీడీలోని పనిచేస్తున్న ఏ కొద్దిమంది ఉద్యోగులు చేస్తున్న పనుల వల్ల మిగిలిన ఉద్యోగులు కూడా ఇబ్బందికి కావలసి వస్తుందన్నారు. కొండపైన చైర్మన్ ఈవో అడిషనల్ ఈవో మిగిలిన విషయాలనీ ఎప్పటికప్పుడు తనకు సమాచారం అందిస్తూ ఉన్నారని కరుణాకర్ రెడ్డి చెప్పడం విస్మయం కలిగిస్తుంది అన్నారు. టిటిడి ఉద్యోగస్తులు కరుణాకర్ రెడ్డి మాటలపై ఎందుకు స్పందించడం లేదని ఆయన ప్రశ్నించారు. ఈ విషయంపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, డిప్యూటీ ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్,మంత్రి నారా లోకేష్ బాబుల దృష్టికి తీసుకువెళ్లనట్టు ఆయన పేర్కొన్నారు. తిరుమలలో పాలన చక్కగా సాగుతుందని బి ఆర్ నాయుడు భక్తితో భక్తులకు బాధ్యతతో సేవలు అందిస్తున్నారు. ఆయన తెలిపారు. ఈ విలేకరుల సమావేశంలో కరాటి చంద్ర,సుబ్బు యాదవ్, సుధాకర్ రెడ్డి, నాగ ప్రతాప్ పాల్గొన్నారు.

## ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి



### ఏటూరు నాగారం సిఐ అనుముల శ్రీనివాస్

**ఏటూరు నాగారం, ఏప్రిల్ 15 (నిఘా న్యూస్):** ఉపాధి అవకాశాలను మహిళలు సద్వినియోగం చేసుకోవాలని ఏటూరు నాగారం సిఐ అనుముల శ్రీనివాస్ అన్నారు. మండల కేంద్రంలోని శ్రీ షిరిడి సాయిబాబా దేవాలయంలో స్టేట్ బ్యాంక్ సహకారంతో గ్రామీణ ప్రాంత మహిళలకు ఉపాధి అవకాశాలు కల్పించడం కోసం గత కొంతకాలంగా ఎస్బిఐ వివిధ రంగాలలో మహిళలకు ఉచిత శిక్షణ అందిస్తూ మహిళలు పురుషులతో సమానంగా అన్ని రంగాలలో రాణించడం కోసం కృషి చేయడం అభినందనీయమని వారి సేవలను కొనియాడారు. మహిళలకు జ్యూట్ బ్యాగుల తయారీ శిక్షణ అందిస్తుండడంతో మంగళవారం జ్యూట్ బ్యాగుల తయారీ శిక్షణ శిబిరమును సందర్శించి మహిళలు శిక్షణ పొందుతున్న తీరును పరిశీలించి ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సీఐ అనుముల శ్రీనివాస్. ఎస్ఐ తాజుద్దీన్. అటవిశాఖ అరేంజ్ అధికారి అబ్దుల్ రెహమాన్ లు. శిక్షణ శిబిరం సందర్శన అనంతరం వారు మాట్లాడుతూ నేటి సమాజంలో ప్లాస్టిక్ మహమ్మారిని నియంత్రించడంలో ప్రకృతి పర్యావరణం ను కాపాడడంలో ప్రతి ఒక్కరు చైతన్యవంతులై గ్రామాలలో ప్లాస్టిక్ వల్ల జరిగే నష్టాలు అనర్థాలను ప్రజలకు తెలియజేసి ప్లాస్టిక్ నియంత్రణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు అవ్వాలని అన్నారు.నేడు జూట్ బ్యాగుల శిక్షణ పొందిన ప్రతి ఒక్కరు ఇట్టి శిక్షణను సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా నిలదొక్కుకొని బ్యాంకు సహాయ సహకారాలు తీసుకొని ముద్ర ఇతర రుణాలు పొంది వ్యాపార అభివృద్ధిలో పోటీపడి మహిళలు రాణించాలన్నారు. జ్యూట్ బ్యాగులు మార్కెట్లో అందుబాటులో ఉండడం చేత ప్రజలు ప్లాస్టిక్ కవర్లు. సంచులు వాడకుండా నియంత్రించవచ్చు అన్నారు. ప్లాస్టిక్ ను నియంత్రించడం ద్వారా పర్యావరణం కాపాడిన వారు అవుతామని తెలిపారు. జ్యూట్ బ్యాగుల శిక్షణ పొందుతున్న మహిళలను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకొని అందుబాటులో ఉన్న వివిధ రంగాలలో శిక్షణ పొంది ఉపాధి అవకాశాలు సద్వినియోగం చేసుకోవడం ద్వారా ప్రతి ఒక్కరు కుటుంబ సమేతంగా సంతోషంగా జీవనం సాగించవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో షిరిడి సాయిబాబా దేవాలయం చైర్మన్ పెండాల ప్రభాకర్. దేవాలయ కమిటీ సభ్యులు బచ్చు సతీష్,మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## బత్తుల సిద్దేశ్వరకు పలు రాష్ట్రాల బీసీ నేతల మద్దతు



### ● బీసీ బిల్లును పార్లమెంటులో ఆమోదించాలని ఆమరణ దీక్షకు పూనుకున్న బత్తుల

**సిద్దిపేట, ఏప్రిల్ 15 (నిఘా న్యూస్):** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బీసీ బిల్లులకు రాజ్యాంగ బద్దత కల్పిస్తూ,బీసీ లను తొమ్మిదవ షెడ్యూల్లో చేర్చాలనే డిమాండ్ తో గత పది హేను రోజులుగా ఆమరణ నిరాహార దీక్షలో కూర్చున్న బత్తుల సిద్దేశ్వరకు మద్దత్తుగా ఉత్తర్ ప్రదేశ్, అస్సాం రెండు రాష్ట్రాల ఓ బీ సి ప్రతినిధులు మద్దత్తు తెలుపుతూ వారితో ఆమరణ నిరాహార దీక్షలో కూర్చొని సంఘీభావం తెలియజేశారని, వారికి కృతజ్ఞతలు తెలుపుతూ త్వరలో ప్రతి తెలంగాణ బిడ్డ బత్తుల సిద్దేశ్వరకు అండగా నిలవాలని, మంగళవారం సిద్దిపేట ప్రెస్ క్లబ్ లో ఎమ్మార్పీఎస్ నాయకులతో కలిసి బీసీ ఆజాతి జేఏసీ అధ్యక్షులు బోయ రాములు, సామాజిక తెలంగాణ ఉద్యమ నాయకులు మోహన్ రెడ్డిలు ఎమ్ ఆర్ పీఎస్ నాయకులతొ కలసి కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రాములు, మోహన్ రెడ్డిలు మాట్లాడుతూ దేశవ్యాప్తంగా జరిగే జాతీయ జనగణనలో కులగణనను చేర్చాలని డిమాండ్ చేశారు. తద్వారా బీసీ సమాజం దేశంలో సరైన భాగస్వామ్యాన్ని పొందుతుందన్నారు. కాగా బత్తుల సిద్దేశ్వర చేస్తున్న ఆమరణ నిరాహార దీక్షకు సంఘీభావంగా బిసి ఆజాది జేఏసీ ఆధ్వర్యంలో నిర్వహించనున్న సమావేశం, తేదీ, స్థల వివరాలను త్వరలో వెల్లడిస్తామని వారు తెలిపారు. ఈ సంఘీభావ సభలో బీసీ ఎస్సీ ఎస్టీ మైనారిటీ ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు దబ్బెట శ్రీనివాస్, బిసి ఆజాది జేఏసీ నాయకులు సత్యనారాయణ, వేణు, దప్పు చంద్రం, పలు కుల సంఘాల నాయకులు పాల్గొన్నారు.

## బార్ అసోసియేషన్ ఎన్నికల అధికారులకు సన్మానం



**కరీంనగర్, ఏప్రిల్ 15 (నిఘా న్యూస్):** కరీంనగర్ బార్ అసోసియేషన్ 2025బి2026 సం.ఎన్నికలు సజావుగా నిర్వహించిన నందుకు ఎన్నికల అధికారి కాసుగంటి మాధవరావు అసిస్టెంట్ ఎలక్షన్ ఆఫీసర్ పల్లెర్ల గోపాల కిషన్ లను బార్ అసోసియేషన్ మాజీ ఉపాధ్యక్షులు టి.రఘువీర్, మాజీ సీనియర్ ఈసీ మెంబర్ సుంకే దేవకిషన్ లు శాలువాతో ఘనంగా సన్మానించారు. మంగళవారం జిల్లా కోర్టులోని బార్ అసోసియేషన్ సమావేశం మందిరంలో సీనియర్ న్యాయవాదులు కాసుగంటి మాధవరావు పల్లెర్ల గోపాలకృష్ణ ఎలక్షన్ ఆఫీసర్లను సన్మానించి కొత్త ఒరవడిని శ్రీకారం చుట్టారు. ఈ సమావేశానికి సీనియర్ న్యాయవాదులు బాస సత్యనారాయణ రావు, మెట్ట అనిల్ కుమార్, టి.మురళి, బి.గోపాల్ రెడ్డి, కొత్త నరసింహారెడ్డి ఎం.అనురాధ, జక్కన్న పెల్లి గణేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఏప్రిల్ 20 న... ఉప్పల్ కురుమ సంఘం ఎన్నికలు



**హైదరాబాద్, ఏప్రిల్ 15 (నిఘా న్యూస్):** ఉప్పల్ జోన్ లో ఉన్న ఉప్పల్ డివిజన్ కురుమ సంఘం ఎన్నికలు ఏప్రిల్ 20 న ఉదయం 10 గంటలకు ఉప్పల్ శ్రీ బీరప్ప స్వామి ఆలయంలో ప్రారంభం అవుతాయి. ఉదయం 10 గంటల నుండి 11 గంటల వరకు నామినేషన్ ప్రక్రియ కొనసాగుతుందని కురుమ సంఘం ఎన్నికల అధికారులు డా.కంకల ఎలెందర్ కురుమ అసిస్టెంట్ ప్రొఫెసర్ కడకంచి ఎట్టి కురుమ ప్రకటన విడుదల చేశారు. కురుమలు ఐక్యంగా ఉండి ఎన్నికలలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఉప్పల్ డివిజన్ మెంబెర్ షిప్ బుక్స్ శుక్రవారం సాయంత్రం లోపు అందచేయాలని కోరారు.

## అక్రమంగా నిల్వ ఉంచిన ఇసుక డంపులు సీజ్



**పెబ్బేరు, ఏప్రిల్ 15 (నిఘా న్యూస్):** అక్రమంగా నిల్వ ఉంచిన ఇసుక డంపులను పెబ్బేరు పోలీసులు సీజ్ చేశారు. పెబ్బేరు మండలంలోని రంగాపురం గ్రామపరిధిలో గుర్తుతెలియని వ్యక్తులు అనుమతి లేకుండా అక్రమంగా ఇసుక డంపు నిల్వ ఉంచారు. ఈ విషయంపై పెబ్బేరు ఎస్ఐ యుగంధర్ రెడ్డి ఆధ్వర్యంలో తహసీల్దార్ లక్ష్మీ ఆదేశాల మేరకు మంగళవారం అక్రమంగా నిల్వ ఉన్న 75 ట్రాక్టర్ల ఇసుకను సీజ్ చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ యుగంధర్ రెడ్డి తెలిపారు.

# బియ్యం ఎగుమతి విధానంపై అగ్రీ వర్సిటీలో సదస్సు

### ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

**రాజేంద్రనగర్, ఏప్రిల్15 (నిఘా న్యూస్):** తెలంగాణ రాష్ట్రం నుంచి తొలిసారి ఫిలిప్ఫయన్స్ కు బియ్యం ఎగుమతి అవుతున్న నేపథ్యంలో ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాల యంలో బియ్యం ఎగుమతి విధానం అనే అంశంపై మంగళవారం ఒకరోజు సదస్సు నిర్వహించారు.ఈ సదస్సుకి తెలంగాణ రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలోనే వరి ఉత్పత్తిలో, ఈ ఏడాది తెలంగాణ రాష్ట్రం అగ్రగామిగా నిలిచిందన్నారు. ప్రస్తుత 2025-26 సంవత్సరంలో రాష్ట్రంలో సుమారుగా 280లక్షల మెట్రిక్ టన్నుల వరి ధాన్యం ఉత్పత్తి అయిందని, ఇది ఒక రికార్డని చెప్పారు.ఈ ఘనతకు రైతుల కృషితో పాటు, అనుకూలమైన వాతావరణ పరిస్థితులు ప్రకృతి సహకారం నూతన వరి రకాలు అందుబాటులో ఉండటం కారణమ న్నారు. ఈ సందర్భంగా ఆయన తెలంగాణ రైతాం గాన్ని అభినందించారు. రైతాంగానికి ప్రభుత్వం ఎల్లవేళలా అండగా ఉంటుందనీ,సన్న రకాలకు క్వింటాల్ కు 500 రూపాయల బోనస్ తో పాటు ప్రతి గింజను ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని వివరించారు.రాష్ట్ర ప్రజల స్థానిక అవసరాలకు పోను, ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా సన్నబియ్యం పంపిణీ కోసం ఉద్దేశించిన బియ్యం పోను,కేంద్ర నిలువల కోసం సుమారు 60 లక్షల మెట్రిక్ టన్నుల బియ్యం కేటాయింపులు పోగా ఇంకా సుమారు 50 నుంచి 60లక్షల మెట్రిక్ టన్నుల బియ్యం రాష్ట్రంలో మిగులు ఉంటుందని ఆయన అన్నారు.మిగులు ధాన్యం మార్కెట్ చేయడానికి అన్వేషన్లో భాగంగా ఆగ్నేయ ఆసియా ప్రాంతంలోని ఫిలిప్పైన్స్ కు తెలంగాణ బియ్యాన్ని ఎగుమతి చేయడాన్ని సదావ కాశంగా తీసుకొని ఆ ప్రభుత్వంతో నేరుగా అవగా హన ఒప్పందం చేసుకున్నామని చెప్పారు. ఈ ఒప్పందంలో భాగంగా ఏడాదికి 10లక్షల మెట్రిక్ టన్నుల దొడ్డు బియ్యాన్ని ఎగుమతి చేసే అవకాశం ఉంటుందని ఆయన వివరించారు.దొడ్డు రకాలలో ముఖ్యమైన ఎంటియు, -1010, ఐ.ఆర్-64 రకాలను రాష్ట్రంలో విస్తృతంగా సాగు చేస్తున్నారని, వీటికి ఫిలిప్పీన్స్లో అధిక డిమాండ్ ఉందని తెలిపారు. వరి సాగులో ఇటీవల రైతాంగంలో ఆదరణ పొందుతున్న వరి నేరుగా విత్తే పద్ధతి రోజు విడిచి రోజు నీరు పెట్టే విధానం తక్కువ రసాయ నాలు కలిగిన వరి రకాలను ఉత్పత్తి చేయడంపై రైతులను ప్రోత్సహించాలని వ్యవసాయ శాస్త్రవేత్త లకు మంత్రి సూచించారు. అదేవిధంగా ఎగుమతికి అనుకూలమైన వరి రకాలను ఉత్పత్తి చేయడానికి రైతులకు తగిన ప్రోత్సాహకాలు, ఎగుమతి దారులకు విధానపరమైన ప్రోత్సాహకాలు ఇస్తామని ఆయన



ప్రకటించారు. అధునాతన బియ్యం మిల్లులను ఒక డెమో రూపంలో ఆధునిక రైస్ మిల్లును వ్యవసాయ విశ్వవిద్యాలయంలో ఏర్పాటు చేసి రైతులకు, యువతకు శిక్షణ ఇచ్చి ఆధునిక పారిశ్రామిక వేత్తలుగా తీర్చిదిద్దాల్సిన అవసరం ఉందని ఆయన గుర్తు చేశారు.ఈ సందర్భంగా ఉపకులపతి ప్రొఫెసర్ ఆల్దాస్ జానయ్య మాట్లాడుతూ ఫిలిప్పీన్స్ దేశం ఎప్పటికీ దిగుమతి చేసుకునే దేశమేనని, ఎన్నటికీ స్వయం సమృద్ధి సాధించే దేశం కాదు కాబట్టి ఆ దేశాన్ని తెలంగాణ బియ్యానికి అనుకూల మైన మార్కెట్గా గుర్తించి ఆ దిశగా చర్యలు తీసుకున్నట్లయితే తెలంగాణలో పండుతున్న బియ్యం నిల్వలకు శాశ్వత పరిష్కారం దొరికినట్లేనని చెప్పారు.అంతే కాకుండా,ప్రభుత్వం వరి ధాన్యం సేకరణ కేంద్రాల నుంచి బియ్యం ఔత్సాహిక ఎగుమతి దారులకు సరఫరా చేసినట్లయితే ప్రభుత్వానికి అయ్యే ఖర్చుకు సమానంగా ఔత్సాహికదారులకు ఇచ్చినట్లయితే ప్రభుత్వంపై ఎలాంటి ఆర్థిక భారం పడకుండానే ఎగుమతులను ప్రోత్సహించే అవకాశం ఉంటుందని మంత్రి కి సూచించారు. అఖిలభారత రైస్ మిల్లర్ల అసోసియేషన్ అధ్యక్షుడు బి.కృష్ణారావు,ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా అధికారులు,అపెడా అధికారులు,రైతు నాయకులు, విశ్వవిద్యాలయ శాస్త్రవేత్తలు, పౌరసరఫరాల శాఖ అధికారులు పాల్గొన్నారు.



## కూతురు వివాహానికి... రేవంత్ రెడ్డిని ఆహ్వానించిన బిఆర్ఎస్ ఎమ్మెల్యే

**ఉప్పల్, ఏప్రిల్ 15 (నిఘా న్యూస్):** ఈ నెల 20 వ తేదీన జరుగు తన కూతురు వివాహానికి రావాల్సిందిగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని మంగళవారం తన నివాసంలో మర్యాద పూర్వకంగా కలిసి ఆహ్వాన పత్రిక ను ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి కుటుంబ సభ్యులతో కలిసి అందజేసి వివాహానికి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో నల్గొండ ఎంపీ రఘువీర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఏసీబీ వలలో శేరిలింగంపల్లి తిమింగలం

### 70 వేల లంచంతో ఏసీబీకి చిక్కిన అర్బన్ బయో డైవర్సిటీ డిప్యూటీ డైరెక్టర్ శ్రీనివాస్



**శేరిలింగంపల్లి, ఏప్రిల్ 15 (నిఘా న్యూస్):** మరో అవినీతి తిమింగలం ఏసీబీ అధికారులకు పట్టుబడింది. ఈసారి జీహెచ్ఎంసీ అర్బన్ బయోడైవర్సిటి డిప్యూటీ డైరెక్టర్ లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కాడు. ఓ బాధితుడి ఫిర్యాదు మేరకు మంగళవారం మధ్యాహ్నం శేరిలింగంపల్లి జోనల్ కార్యాలయంలో ఏసీబీ సోదాలు చేపట్టింది. జోనల్ కార్యాలయంలోని అర్బన్ బయోడైవర్సిటి డిప్యూటీ డైరెక్టర్ శ్రీనివాస్ గదిలో రంగారెడ్డి జిల్లా ఏసీబీ డీఎస్పీ శ్రీధర్ ఆధ్వర్యంలో తనిఖీలు నిర్వహించారు. అర్బన్ బయోడైవర్సిటి డిప్యూటీ డైరెక్టర్ గా విధులు నిర్వహిస్తున్న శ్రీనివాస్ గత కొంతకాలంగా చాంద్రాయణ గుట్ట సర్కిల్ లో అర్బన్ బయోడైవర్సిటి విభాగం ఇంచార్జ్ గా వ్యవహరిస్తున్నారు.చాంద్రాయణ గుట్ట సర్కిల్ పనికి సంబంధించి ఓ కాంట్రాక్టర్ వద్ద రూ. 70 వేలు లంచం డిమాండ్ చేశాడు. బాధితుడిని లంచం డబ్బులు తీసుకుని శేరిలింగంపల్లి జోనల్ కార్యాలయానికి రావాలని సూచించాడు. దీంతో కాంట్రాక్టర్ అర్బన్ బయోడైవర్సిటి డిప్యూటీ డైరెక్టర్ శ్రీనివాస్ తెలిపిన విధంగా శేరిలింగంపల్లి జోనల్ కార్యాలయంలోని శ్రీనివాస్ వద్దకు వచ్చాడు. అతని వద్ద నుండి డబ్బులు తీసుకుంటూ శేరిలింగంపల్లి జోనల్ కార్యాలయంలో శ్రీనివాస్ ఏసీబీ అధికారులకు పట్టుబడ్డాడు.

## ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సిగ్నేచర్ డే



**ఏటూరునాగారం, ఏప్రిల్ 15 (నిఘా న్యూస్):** మండల కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో తృతీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థిని విద్యార్థులు మంగళవారం సిగ్నేచర్ డే కార్యక్రమం ఘనంగా నిర్వహించారు.ఇట్టి కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కళాశాల ప్రిన్సిపాల్ డా,బి.రేణుక, అధ్యాపక బృందాన్ని ఆహ్వానించడం జరిగింది.ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి కళాశాల ప్రిన్సిపాల్ మాట్లాడుతూ కళాశాల స్థాయిలో విద్యార్థులు నిర్వహించుకునే ఒక చక్కని వేడుకని, విద్యార్థులు కాలేజీ వదిలి వెళ్ళిన తర్వాత మంచి స్థాయిలో స్థిరపడిన తర్వాత గుర్తుకు వచ్చే మధుర జ్ఞాపకం అని భవిష్యత్తులో మీ సిగ్నేచర్ ఒక ఆటోగ్రాఫ్ గా మారాలని అన్నారు.అనంతరం తృతీయ సంవత్సరం విద్యార్థులు టీషర్ట్ లు ధరించి అధ్యాపకుల సంతకం తీసుకున్నారు.విద్యార్థులు ఒకరి టీ షర్టుపై ఒకరు సంతకం చేసుకుని అధ్యాపకుల దీవెనలను తీసుకున్నారు.ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్.కో ఆర్డినేటర్ సిహెచ్. వెంకటయ్య, డా. జ్యోతి, కనీస్ ఫాతిమా, సంపత్, మున్ని, జీవవేణి, రాజశేఖర్, సుమలత, భావన, అభిలాష్, భాస్కర్, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

## పోలీసులు సమయాన్ని దైవంగా భావించాలి

### అడిషనల్ డీజీపీ వివి శ్రీనివాస రావు



**మేడ్చల్, ఏప్రిల్ 15(నిఘా న్యూస్):** పోలీసులు సమయాన్నే దైవంగా వృత్తిలో ఎలాంటి లోటుపాట్లు లేకుండా క్రమశిక్షణను అలవరుచుకోవా లని వివి శ్రీనివాసరావు అడిషనల్ డీజీపీ, డైరెక్టర్ ఆర్బివిఆర్ఆర్ తెలంగాణ పోలీస్ అకాడమీ ఇంచార్జ్ ట్రైనింగ్ విభాగం అన్నారు. మేడ్చల్ కండ్లకోయ పరిధిలోని పోలీస్ ట్రైనింగ్ సెంటర్లో మంగళవారం శిక్షణ పూర్తి చేసుకున్న 142కానిస్టేబుల్స్కు దీక్షాంత్ పరేడ్ నిర్వ హించారు. ఈ సందర్భంగా ఆయన శిక్షణ పూర్తిచేసుకున్న వారిని ఉద్దేశించి మాట్లాడుతూ తెలంగాణ పోలీస్ డిపార్ట్మెంట్ అనేది ఇతర రాష్ట్రాల పోలీస్ వ్యవస్థలకు దిక్సూచిగా ఉందని, తెలంగాణ ప్రభుత్వం పోలీసుల కుటుంబాలకు విద్యా ఇతర సంక్షేమ పథకాలను అమలు చేయడంలో ప్రత్యేక శ్రద్ధ చూపుతోందని అన్నారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ మధుకర్ స్వామి సూపరిండెంట్ ఆఫ్ పోలీస్ మాట్లాడుతూ తొమ్మిదినెలల కఠోర శ్రమ తరువాత మీరు వంద శాతం ఉత్తీర్ణత సాధించారని, మీరందరూ మంచి నడవడిక, క్రమ శిక్షణ నైతిక విలువలతో మీ భాద్యతలను నిర్వర్తించాలని తద్వారా రాష్ట్రానికి కీర్తి ప్రతిష్టలు చేకూర్చాలని ఆయన తెలిపారు. అనంతరం కళాశాలలో నూతనంగా నిర్మించిన ఫౌంటైన్లను, సైబర్ సెక్యూరిటీ ల్యాబ్, ఫోరెన్సిక్ ల్యాబ్, సిసిటివి లను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో యూసుఫ్ గూడ బెటాలియన్ కమాండెంట్ పి.మురళీకృష్ణ, పోలీస్ ట్రైనింగ్ కాలేజీ డిఎస్పి లు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇండ్ల లబ్దిదారులకు నిధులు మంజూరు

### మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెల్లడి



**హైదరాబాద్, ఏప్రిల్ 15(నిఘా న్యూస్):** బేస్మెంట్ పూర్తి చేసుకున్న ఇందిరమ్మ ఇండ్ల లబ్దిదారులకు రూ. 20.19 కోట్ల రూపాయిలను నేరుగా వారి బ్యాంకు ఖాతాలలో జమచేయడం జరిగిందని రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. మొదటి విడతలో పైలట్ ప్రాజెక్ట్ కింద మంజూరు చేసిన 70,122 ఇండ్లలో బేస్ మెంట్ పూర్తి చేసుకున్న 2019 మందికి లక్ష రూపాయిల చొప్పున రూ.20.19కోట్ల రూపాయిలను విడుదల చేశామని మంగళ వారం విడుదల చేసిన ఒక ప్రకటనలో మంత్రి తెలిపారు.ఆర్థికంగా ఎన్ని ఇబ్బందులు ఉన్నాకూడా ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి ఆటంకం ఏర్పడకుండా నిధులు విడుదల చేస్తామన్నారు.ఇండ్ల గ్రౌండింగ్ ప్రక్రియను వేగవంతం చేయాలని , గ్రౌండింగ్ అయిన ఇండ్ల నిర్మాణ పనులను మరింత వేగవంతం చేస్తున్నామని ఇప్పటికి 13,500 ఇండ్లు గ్రౌండింగ్ అయ్యాయని తెలిపారు.గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిగారు 12 మంది లబ్దిదారులకు మంగళవారం లాంఛనంగా లక్ష రూపాయిల చొప్పున చెక్కులను అందజేశారని తెలిపారు. మధ్యవర్తుల ప్రమేయానికి తావులేకుండా నాలుగు విడతల్లో లబ్దిదారులకు నేరుగా వారి ఖాతాలోనే జమచేస్తామని తెలిపారు. నిర్మాణం పూర్తైన వెంటనే బేస్ మెంట్ పూర్తైన తర్వాత లక్ష రూపాయిలు, గోడలు పూర్తైన తర్వాత 1.25 లక్షల రూపాయిలు, శ్లాబ్ పూర్తిచేసుకున్న తర్వాత 1.75 లక్షల రూపాయిలు, ఇల్లు పూర్తైన తర్వాత మిగిలిన లక్ష రూపాయిలు విడుదల చేస్తామని వివరించారు.బేస్మెంట్ గాని గోడలు గాని శ్లాబ్గాని నిర్మాణం పూర్తిచేసుకుంటే అధికారుల కోసం ఎదురుచూడకుండా లబ్దిదారులే ఫోటో తీసి మొబైల్ యాప్లో అప్లోడ్ చేసినా కూడా డబ్బులు లబ్దిదారుల ఖాతాలో జమచేస్తామని తెలిపారు. కనీసం 400ఎస్ఎఫ్టికి తగ్గకుండా 600ఎస్ ఎఫ్టీకి మించకుండా లబ్దిదారులు ఇంటిని నిర్మించుకోవాలని సూచించారు. అర్హులైన ఇందిరమ్మ ఇండ్ల లబ్దిదారుల ఎంపిక ప్రక్రియ మరింత వేగవంతం చేయడం, అధికారులకు, ప్రజాప్రతినిధులకు సమన్వయం ఉండేలా ప్రతి నియోజకవర్గానికి ఒక ప్రత్యేక అధికారిని నియమిస్తున్నామని తెలిపారు.

# ఇసుక అక్రమ రవాణా కోసం రహదారి కబ్జా

### ఎమ్మెల్యే గారు ఓ నిమిషం ఇటు చూడరా..!




**పలమనేరు, ఏప్రిల్ 15(నిఘా న్యూస్):** చిత్తూరు జిల్లా పలమనేరు నియోజకవర్గం పెద్దపంజాణి మండలం బొమ్మరాజు పల్లి గ్రామపంచాయతీ పరిధిలో ఉన్న కంగాణం బండ సమీపంలో ఉన్న కౌండిన్య నది లో అనునిత్యం అక్రమ ఇసుక రవాణా చేస్తున్నారు. రాజకీయ పార్టీలకు అతీతంగా సమీప గ్రామంలో ఉన్న ముదరంపల్లి గ్రామానికి చెందిన వైయస్సార్సీపి కార్యకర్తలు సైతం అక్రమ ఇసుక రవాణా చేస్తుంటే అధికారులు చూస్తూ ఉండడం ఎన్నో అనుమానాలకు దారితీస్తుంది, ఇదే క్రమంలో శంకర్ రాయలపేట గ్రామ సమీపంలో ఉన్న దొరచెరువు నుండి దండపల్లి చెరువు మధ్యన వెళ్లే కౌండిన్య నదిలో ఎన్నో రోజులుగా లభ్యమవుతున్న ఇసుకను అక్రమ రవాణా చేస్తూ అక్రమ దారులు సొమ్ము చేసుకుంటున్నారు. స్థానికముదరంపల్లి గ్రామంలోని అధికార పార్టీ అండతో ప్రతిపక్ష పార్టీ అయినా వైయస్సార్సీపి నాయకులు ఇసుక రవాణా చేయడంపై ఎన్నో అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. 2019 ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ తరపున పలమనేరు నియోజకవర్గం పోటీ చేసి గెలుపొందిన అమరనాథ్ రెడ్డికి అప్పట్లో భారీ పరిశ్రమల శాఖ మంత్రిగా అవకాశం ఇచ్చిన సంగతి తెలిసిందే, అప్పుడు బొమ్మరాజు పల్లి నుండి కంగాణం బండ వరకు రోడ్డు సమస్య ఉందని అప్పటి మంత్రి అయినా అమర్నాథ్ రెడ్డిని కలిసి రెండు గ్రామాల ప్రజలు సమస్య గురించి తమ ఆవేదనను తెలిపారు. ఈ క్రమంలో ఆయన ఖచ్చితంగా రోడ్డు మంజూరు చేస్తామని హామీ కూడా ఇచ్చారు.అలాంటి తరుణంలో ఇప్పుడు ఎమ్మెల్యేగా గెలుపొందిన ఆయన రోడ్డు మంజూరు చేస్తారో లేదో కానీ ఇక్కడ మాత్రం అక్రమ ఇసుక రవాణా మాత్రం రోజు చేస్తున్నారు. ఇప్పటికైనా ఎమ్మెల్యే స్పందించి రోడ్డు వేయాల్సిన చోట అక్రమ ఇసుక రవాణా చేస్తున్న వారిపై కఠినమైన చర్యలు తీసుకుని రోడ్డు మంజూరు చేయవలసిందిగా రెండు గ్రామాల ప్రజలు తమ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు, మరి ఎమ్మెల్యే ఏం చేస్తారో వేచి చూడాలి.

## కూతురు పేరును తొలగించమంటే...

# తల్లి పేరును మాయం చేసిన ఘనులు

- రేషన్ కార్డు లోంచి పెళ్లయిన కూతురి పేరును తొలగించాలని దరఖాస్తు చేసిన తల్లి
- ఏకంగా దరఖాస్తు చేసిన తల్లి పేరునే కార్డులోంచి తొలగించిన పౌరసరఫరాల శాఖ



**అంబర్పేట, ఏప్రిల్ 15(నిఘా న్యూస్):** కొండే నాలుకకు మందేస్తే, ఉన్న నాలుక ఊడి పోయినట్లు పౌరసరఫరాల శాఖ పనితీరు కొట్టొచ్చినట్టు కనిపిస్తుంది. పెళ్లయి అత్తారింటికి కాపురానికి వెళ్లిన తన కూతురి పేరును తన రేషన్ కార్డు లోంచి తొలగించాలని ఓ మహిళ పౌరసరఫరాల శాఖ అంబర్ పేట సర్కిల్ అధికారులకు దరఖాస్తు చేసుకోగా, ముందు వెనుక ఆలోచించకుండా అధికారులు సదరు మహిళ పేరునే కార్డు నుంచి తొలగించి నిర్లక్ష్యానికి నిలువుటద్దంలా నిలిచారు. కూతురు పేరుకు బదులు రేషన్ కార్డు నుంచి తన పేరు డిలీట్ అయినట్లు తెలుసుకున్న సదరు మహిళ తీవ్ర ఆందోళనకు గురవుతుంది. బాధితురాలి కథనం ప్రకారం వివరాలిలా ఉన్నాయి. గోల్నాక అశోక నగర్ కు చెందిన కొండేరి జ్యోతికి సంబంధించిన రేషన్ కార్డు (ఆహార భద్రత కార్డు నెంబర్: 365360620509)లో భర్త శివ కుమార్, కుమార్తె సాగరిక పేర్లు ఉన్నాయి. మూడేళ్ల క్రితం సాగరిక వివాహం శ్రీకాంత్ జరగడంతో ఆమె ప్రస్తుతం అత్తారింట్లో ఉంది. సాగరిక భర్తతో కలిసి కొత్త కార్డు తీసుకోవడానికి గాను కార్డులో ఉన్న తన పేరును తొలగించాలని తల్లి జ్యోతి కి చెప్పింది. దీంతో కొండేరి జ్యోతి తన కార్డులో ఉన్న కూతురు సాగరిక పేరును తొలగించాలని కోరుతూ ఫిబ్రవరి 20వ తేదీన ఆన్ లైన్ ద్వారా, అలాగే ఆర్టీసీ కళ్యాణ మంటపం సమీపంలో ఉన్న పౌరసరఫరాల శాఖ అంబర్ పేట సర్కిల్ కార్యాలయానికి వెళ్లి లిఖితపూర్వకంగా దరఖాస్తు చేసింది. ఈ దరఖాస్తును సదరు ఏరియా ఇన్స్పెక్టర్ పరిశీలించి కార్డు నుంచి దరఖాస్తుదారుడు సూచించిన పేరును తొలగించడానికి సిఫార్సు చేయాల్సి ఉంది. అయితే ఈ విషయంలో సర్కిల్లో విధులు నిర్వహిస్తున్న ఏరియా ఇన్స్పెక్టర్, కంప్యూటర్ ఆపరేటర్లు నిర్లక్ష్యంగా వ్యవహరించి కార్డు లోంచి కూతురు సాగరిక పేరుకు బదులు, ఏకంగా దరఖాస్తు చేసిన తల్లి జ్యోతి పేరును తొలగించారు. రెండు రోజుల తర్వాత తన పేరు కార్డు నుంచి తొలగించినట్లు తెలుసుకున్న జ్యోతి వెంటనే కార్యాలయానికి వెళ్లి అధికారులను కలిసి ఫిర్యాదు చేసింది. తన పేరును తిరిగి కార్డులో నమోదు చేయాలని ఆమె అధికారులకు మొర పెట్టుకున్న వారు పట్టించుకోవడం లేదని ఆరోపణలు వస్తున్నాయి దాదాపు 45 రోజులుగా బాధితురాలు జ్యోతి పౌరసరఫరాల శాఖ అంబర్ పేట్ సర్కిల్ కార్యాలయం చుట్టూ చెప్పులు అరిగేలా తిరుగుతున్న అధికారులు కనికరించడం లేదు. తమ నిర్లక్ష్యం కారణంగానే జ్యోతి పేరు కార్డులోంచి డిలీట్ అయినట్లు తెలిసినప్పటికీ అధికారులు పట్టనట్టు వ్యవహరించడం పట్ల సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ విషయమై బాధితురాలు జ్యోతి మంగళవారం మీడి యాతో మాట్లాడుతూ తొలగించబడిన తన పేరును తిరిగి రేషన్ కార్డులో నమోదు చేయాలని అధికారులకు మొరపెట్టుకున్నా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేసింది. ఈ విషయంలో సర్కిల్ సహాయ పౌరసరఫరాల శాఖ అధికారిని కలిస్తే, డీఎస్ఓ వద్దకు వెళ్ళమంటున్నారని, అక్కడికి వెళ్తే ఇక్కడికి వెళ్ళమంటున్నారని ఆమె ఆరోపించింది. దీంతో గత 45 రోజులుగా తాను కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణ చేయాల్సి వస్తుందని ఆమె పేర్కొంది. ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా అమలు చేస్తున్న రాజీవ్ యువ వికాసం పథకానికి దరఖాస్తు చేసుకోవాలంటే, రేషన్ కార్డులో తన పేరు లేకపోవడంతో దరఖాస్తు చేయలేక పోయానని ఆమె వాపోయింది. రాష్ట్ర ప్రభుత్వం పౌరసర ఫరాల శాఖ ఉన్నతాధికారులు స్పందించి తనకు న్యాయం చేయాలని బాధితురాలు జ్యోతి విజ్ఞప్తి చేసింది.

## విశాఖ పోర్టులో ఫైర్ సర్వీస్ డే వారోత్సవం



**విశాఖపట్నం, ఏప్రిల్ 15 (నిఘా న్యూస్):** విశాఖపట్నం పోర్ట్ అథారిటీలో మంగళవారం నేషనల్ ఫైర్ సర్వీస్ డే వారోత్సవాలు ఘనంగా నిర్వహించారు. అగ్ని ప్రమాదాలలో ప్రాణ త్యాగం చేసిన వీర ఫైర్ మెన్ కు స్మారక చిహ్నంగా శిలాఫలకానికి చైర్ పర్సన్ డాక్టర్ ఎం.అంగముత్తు పుష్పాంజలి ఘటించి పెరేడ్ ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ఫైర్ ఎక్విప్మెంట్, ఫోటో ప్రదర్శనలను చైర్ పర్సన్ తిలకించారు. అనంతరం వారోత్సవ కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు.

## గంగమ్మ జాతరను ఘనంగా నిర్వహిద్దాం

### తిరుపతి మున్సిపల్ కమిషనర్ ఎన్ మౌర్య



**తిరుపతి, ఏప్రిల్ 15(నిఘా న్యూస్):** తిరుపతి తాతయ్యగుంట గంగమ్మ జాతరను అద్భుతంగా నిర్వహించేందుకు అందరూ కలసి కట్టుగా పని చేయాలని నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య అధికారులను ఆదేశించారు. మంగళవారం తాతయ్యగుంట గంగమ్మ గుడిలో జాతరకు చేయాల్సిన ఏర్పాట్లపై డిప్యూటీ మేయర్ ఆర్.సి.మునికృష్ణఅన్ని విభాగాల అధికారులతో కలసి కమిషనర్ పరిశీలించారు. గతంలో ఏర్పాట్లు, ప్రస్తుతం చేయాల్సిన ఏర్పాట్లపై అధికారులతో చర్చించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ తాతయ్యగుంట గంగమ్మ జాతర వైశిష్ట్యానికి తగ్గట్టుగా అన్ని ఏర్పాట్లు ఏర్పాట్లు చేసేందుకు అధికారులు, సిబ్బంది ప్రణాళికలు సిద్ధం చేయాలని అన్నారు. నగరపాలక సంస్థ తరపున చేయాల్సిన అన్ని ఏర్పాట్లను పరిశీలించాలని అన్నారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా త్రాగునీరు సరఫరా చేయాలని, వాహనాలు పార్కింగ్, క్యూ లైన్ల ఏర్పాటు, భక్తులు పొంగళ్ళు పెట్టుకునేందుకు చేయాల్సిన ఏర్పాట్లపై అధికారులు అన్ని ప్రణాళికలు సిద్ధం చేయాలని అన్నారు. అలాగే భక్తులకు ఇబ్బంది లేకుండా ప్రథమ చికిత్స కేంద్రాలు ఏర్పాటు చేయాలని అన్నారు. ముఖ్యంగా పారిశుద్ధ్య నిర్వహణలో ఎటువంటి పొరపాట్లకు తావులేకుండా చూడాలని అన్నారు. కమిషనర్ వెంట తాతయ్య గుంట గంగమ్మ గుడి ఈఓ జయకుమార్, మునిసిపల్ ఇంజినీర్ తులసి కుమార్, డి.ఈ రాజు, ఏసిపి బాలాజీ, రెవెన్యూ ఆఫీసర్లు సేతుమాధవ్, రవి, సర్వేయర్ కోటేశ్వర రావు,శానిటరీ సూపర్ వైజర్ సుమతి తదితరులు ఉన్నారు.

## సీజ్ చేసిన మద్యాన్ని పారబోసిన పోలీసులు

**గన్నేరువరం, ఏప్రిల్ 15 (నిఘా న్యూస్):** మండల పరిధిలో గత 2023 నవంబర్ అసెంబ్లీ ఎలక్షన్లో సమయంలో అక్రమంగా తరలిస్తున్న మద్యం బాటిల్లు 480 క్వార్టర్లు గత రెండేళ్లుగా వివిధ కేసుల్లో పట్టుకున్న మద్యాన్ని మంగళవారం పోలీస్ స్టేషన్ ఆవరణలో ఎస్సై తాండ్ర నరేష్ ఆధ్వర్యంలో ఎక్సైజ్ సీఐ బాబా, ఎస్సై శ్రీకాంత్ పర్యవేక్షణలో ధ్వంసం చేశారు. ఈ సందర్భంగా ఎస్సై తాండ్ర నరేష్ సీజ్ చేసిన మద్యం విలువ సుమారు 86 వేలు ఉంటుందని అన్నారు. ఎక్సైజ్ అధికారుల పర్యవేక్షణలో బాటిల్ మద్యాన్ని బకెట్లలో నింపి స్టేషన్ బయట పారబోశారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ సిబ్బంది పాల్గొన్నారు.



Printed Published by Ch.Srinivas, Printed at M/s Apsara Printing Works, H.No. G9 Ground Floor, Maruti Complex, Nagole Cross Road, Hyderabad, Telangana India - 500068.
Editor : Ch.Srinivas RNI Reg.No.APTEL/2010/35098. Phone: +91 90142 77465 email: nighareporters@gmail.com